శ్రీ

ఆంధ్రసాహిత్యపరిషత్పత్రిక

Journal of the Telugu Academy

KAKINADA



దేశ భాషలందు తెలుగు లెస్స

సంపుటము ౫౧
Vol 51

సంచికలు ౩-౪
Parts III & IV

ఆంధ్ర సాహిత్య పరిషత్తు

స్థాపకులు :

శ్రీ జయంతి రామయ్యగారు

ప్రతిష్ఠాపకులు:

శ్రీ శ్రీ శ్రీ రావు వేంకటకుమార మహీపతి సూర్యారావు బహద్దరువారు సి. బి, ఇ., డి. లిట్, పిఠాపురము మహారాజావారు

శ్రీ శ్రీ శ్రీ వేంకటగిరి మహారాజావారు

శ్రీ శ్రీ శ్రీ బొబ్బిలి మహారాజావారు

ఉద్ధారకులు :

శ్రీ రాజా వేంకటాద్రి అప్పారావు బహద్దరువారు,
(జమీందారు, ఉయ్యూరు ఎస్టేటు,)

శ్రీ

ఆంధ్రసాహిత్యపరిషత్పత్రిక

Journal of the Telugu Academy

KAKINADA

సంవత్సరము చందా రు. 3-0-0.

సంపుటము ౫౧ శ్రావణ-భాద్రపద సంచికలు 3-౪

Vol 51 ఆశ్వయుజ కార్తికములు Parts III & IV

విషయసూచిక

స్వ వి ష య ము

ఈనాఁడు ప్రాచీనాంధ్రభాషా స్వరూపమును దెలిసికొనవలె ననెడి యుత్సాహము చాలమంది పాఠకులలోఁ గానవచ్చుచున్నది. చాలమంది విశ్వవిద్యాలయ పట్టభద్రులు ప్రత్యేకవిషయములను దీసికొని విమర్శనములు సాగించుచున్నారు. అట్టివారికి ఆంధ్ర సాహిత్య పరిషత్కార్యాలయమునందలి తాళపత్ర ప్రతులు, వ్రాఁతప్రతులు హెచ్చుగ సహకరించుచున్నవి. ప్రాచీన గ్రంథములందలి శబ్దస్వరూపమును నిర్ణయముచేయునప్పు డున్నవానికి మూల సంస్కృతగ్రంథములతోను, లభించిన తాళపత్రప్రతుల పాఠములతోను సంప్రతించి, కవి ప్రయుక్తమైనపాఠ మిదికాఁదగునని నిర్ణయించుట, ప్రామాణికులైన విమర్శకులకుఁ బరిపాటియైవచ్చుచున్నది. అట్టి పరిపాటిని బాటించుటకుఁ గావలసిన సామగ్రి ఆంధ్రసాహిత్యపరిషద్భాండాగారమున సమృద్ధముగ నున్నది. కావున ప్రాచీనాంధ్రభాషా విషయమునఁ బరిశ్రమించు పాఠకులు, తమ యవకాశమునుబట్టి పరిషద్భాండాగారమునందలి, ముద్రితములు అముద్రితములు నగు గ్రంథములను బరికించి తమకు వలయు విషయములను సంగ్రహించుకొందురుగాక యని మా యాకాంక్ష.

ఇట్లు

సంపాదకుఁడు.

శ్రీ కాళిదాస శివభక్తి తత్త్వము—తత్త్వజ్ఞాన వైభవము

ఖండవిల్లి సూర్యనారాయణశాస్త్రి.

శ్రీ కాళిదాస మహాకవి, తన రఘువంశ మహాకావ్య ప్రారంభమునను, దన నాటకత్రయ ప్రారంభమునను జేసిన శివస్తుతిని బట్టి కొందఱీ కవిని "శైవకవి" యనుకొనుచుందురు. పరమార్థదృష్టితోఁ బరిశీలించినచో నీ కవి కేవల శైవకవి మాత్రమే గాక బ్రహ్మజ్ఞాన పరిపూర్ణుఁడైన యద్వైత మహాకవి యనియుఁ, దత్త్వవిచ్ఛిరోమణి యనియు, వీనికావ్యోదాహరణములు మనకుఁ దేటతెల్లము సేయఁ గల్గియున్నవి. వీని శివభక్తిలోని తత్త్వమును దెలిసికొనుటకు ముందు 'శివ' శబ్దార్థమును దత్త్వతః తెలిసికొనవలసి యున్నది. శ్రీ సురేశ్వరాచార్యులవారు తమ తంత్ర వార్తికములో 'శివ' శబ్దార్థమును నిట్లు నిర్వచించియుండిరి. "పూర్వకల్పకృత పరిపక్వ సకల ప్రాణిసర్వకర్మసు ఉపభోగేన నష్టేషు అపరిపక్వ వాసనారూప కర్మాశ్రయ మాయావచ్ఛిన్నం బ్రహ్మ యావత్పరిపాకం నిశ్చలతరంగసముద్రవ త్తిష్ఠతి తచ్ఛివః" (తత్ + శివః) "జీవుల పరిపక్వకర్మలు వారి యనుభవముతో నశించును. ఇఁక పరిపక్వదశకు రాని వారి కర్మలు పరిపాకమునకు వచ్చువఱకును, ఆ జీవులు వాసనారూపములైన తమ యా కర్మలతోఁగూడి, మాయావిశిష్టుఁడైన పరబ్రహ్మయొక్క యవ్యక్త రూపములో లీనములై యుండును. నామరూప రహితమైన (నిర్గుణ) పరబ్రహ్మయొక్క యప్పటి యా 'అవ్యక్త' స్థితి, తరంగములు లేని సముద్రమువలె నిశ్చలముగ నుండును. ఆ పరబ్రహ్మయొక్క యట్టి నైశ్చల్య స్థితియే 'శివుఁడు' లేక 'శివతత్త్వ' మనఁబడును" జీవుల పరిపక్వ కర్మలకుఁ దగినట్లుగా చరాచర సృష్టిని జేయఁదలఁచినపుడు ఆ యేకైక శివతత్త్వమే స్త్రీ పురుష రూపములో ఆదిదంపతులుగ మాఱును. ఈ యాదిదంపతులే మన కాళిదాసుచే రఘువంశాదిలో

స్తుతింపఁబడిన పార్వతీ పరమేశ్వరులు. వీరే ప్రకృతి పురుషులు. వీరి సమ్మేళనమే ప్రపంచసృష్టికి మూలమగుచున్నది. కనుకనే వీరు జగత్తునకుఁ దలిదండ్రు లైనారు. ఈ విషయమునంతను మన కవి "వాగర్థావివ సంపృక్తౌ వాగర్థప్రతిపత్తయే, జగతః పితరౌ వందే పార్వతీ పరమేశ్వరౌ అన్న రఘువంశకావ్యాది శివస్తుతిలో వ్యక్తముచేసినాఁడు. వీరి కలయిక అర్ధనారీశ్వరరూప మయ్యె నిందెంతో తత్త్వమున్నది.

ఇట్లు ఏకతత్త్వము భిన్నరూపములఁ జెందుటను యజురారణ్యక మిట్లు తెలుపుచున్నది. "తదాత్మానగ్ం స్వయ మకురుత""ఆ నిర్గుణ పరబ్రహ్మము సృష్టి కనుకూలమగునట్లు సర్వజగ దధిష్ఠానమై తన్ను స్వయముగా ప్రకృతి పురుషుల రూపముగ విభక్తము చేసికొనెను. ఈ విషయమునే మన కవీశ్వరుఁడు తన కుమారసంభవకావ్యములో దేవతలచేత బ్రహ్మను స్తుతింపఁజేయు సందర్భమున—

"స్త్రీ పుంసా వాత్మభాగౌ తే భిన్నమూర్తే స్సిసృక్షయా,
ప్రసూతిభాజ స్సర్గస్య తావేవపితరౌ స్మృతౌ. (చూ. కు.సం.సర్గ ౨)

ఓ బ్రహ్మ! ఈ చరాచరసృష్టి సేయు నిచ్ఛతో నీ యొక్క యొక్క రూపమునే నీవు స్త్రీ పుం రూపములుగ విభజించుకొంటివి కనుక నా స్త్రీ పురుషు లిరువురును నీ యేకైక రూపముయొక్క పరిణామ రూపులే. కాన నీ సృష్టి కంతకు వారే పితరులు"

పరబ్రహ్మయొక్క పై 'యద్వితీయత్వమే'' భారతీయుల యద్వైతతత్త్వమునకు మూలమై, వారి సర్వ వేదాంత శాస్త్రముల సారమై యున్నది.

"వేదాంతసిద్ధాంత నిరుక్తి రేషా బ్రహ్మైవ జీవస్సకలంజగచ్చ॥
(ఆచార్య శ్రీ శంకర భగవత్పాదులు)

"ఏకమేవా ద్వితీయం బ్రహ్మ । నేహానా నాస్తి కించన"
(ఉపనిష త్సూక్తి)

"ఆత్మావా ఇద మేకవ వాగ్ర ఆసీత్ । నాన్యత్కించన మిషత్

(ఉపనిష త్సూక్తి)

"ఏకం సద్విప్రా బహుధా వదంతి......"

ఇట్లు సర్వవేదాంతశాస్త్రసమ్మతమైన పరమశివుని "పరబ్రహ్మ" లేక ఆత్మైకత్వ సిద్ధాంతమునే మన మహాకవి తన కుమారసంభవములో బ్రహ్మస్తుతి సందర్భముననే—

"నమ స్త్రిమూర్తయే తుభ్యం ప్రాక్సృష్టేః కేవలాత్మనే,
గుణత్రయవిభాగాయ పశ్చాద్భేద ముపేయుషే" (2-4)

అనియు—

"ప్రళయస్థితిసర్గాణా మేకః కారణతాం గతః" (2-6)

అనియు నొక్కి వక్కాణించినాఁడు.

ఇఁక ప్రకృతి పురుషుల విషయములో మన కవీశ్వరుఁడు తన కుమారసంభవములో—

"త్వా మామనంతి ప్రకృతిం పురుషార్థప్రవర్తినీం,
తద్దర్శిన ముదాసీనం త్వామేవ పురుషం విదుః" (2-13)

ఓ పరబ్రహ్మ! తత్త్వవేత్తలు నిన్ను భోగాపవర్గ రూపమైన పురుషార్థమును ప్రవర్తింపఁ జేసెడు "ప్రకృతి" గా, లేక మూల కారణముగాఁ జెప్పుచున్నారు. (దీనిచేఁ బ్రకృతిపురుషుల కభేద మంగీకృత మైనది) ఇట్లా ప్రకృతిని సాక్షిగాఁ జూచుచున్న నిన్ను కూటస్థపురుషునిగాఁ దత్త్వజ్ఞులు దెలిసికొనిరి" ఈ శ్లోకార్థమునకు ఉపనిషదర్థమే ప్రమాణము.

"అజామేకాం లోహితశుక్లకృష్ణాం—అజో హ్యేకో జుషమాణోఽనుశేతే
జహాత్యేనాం భుక్తభోగామజోఽన్యః" (చూ. తైత్తిరీయోపనిషత్తు)

ఇట "పురుషుఁడు" అనఁగా "పురి హృదయ కుహరే శయనాత్ పురుషః" సర్వజీవుల హృదయకుహరములందు శయనించి, సర్వాంత

ర్యామియై యుండువాఁడు కనుకనే యా పురుషుని గూర్చి పురుష సూక్తము—

"పురుష ఏవేదగ్ం సర్వం, యద్భూతం యచ్చ భవ్యం" అని కీర్తించినది. ఇట్లు పురుషశబ్ద వాచ్యుఁడైన ఈశ్వరుని యీ సర్వ వ్యాపకత్వ విషయమే—"ఈశ్వర స్సర్వ భూతానాం హృద్దేశేఽర్జున తిష్ఠతి" అనియు—

"సర్వస్య చాహం హృది సన్నివిష్టః—"అనియు గీతలో శ్రీకృష్ణ పరమాత్మచేఁ దెలుపఁబడినది. ఈ పురుషుఁడే 'పరమాత్మ'యని కూడ

"ఉత్తమః పురుష స్త్వన్యః పరమాత్మే త్యుదాహృతః
యో లోకత్రయ మావిశ్య బిభ ర్త్యవ్యయ ఈశ్వరః" అని గీత పురుషుని గీర్తించినది. ఇట్లు పరమాత్మశబ్ద వాచ్యుఁడైన పురుషుని- లేక పురుషశబ్ద వాచ్యుఁడైన "పరమాత్మ"ను వినా మఱియొక టేదియు నీ విశ్వమున లేదని-

"యస్మాత్పరం నాపర మస్తి కించి ద్యస్మా న్నాణీయో నజ్యాయోఽస్తి కశ్చిత్ ।
వృక్షఇవ స్తబ్ధో దివితిష్ఠ త్యేక స్తేనే దం పూర్ణం పురుషేణ సర్వం" ఇట్లు శ్వేతాశ్వతరోపనిషత్సూక్తి సువ్యక్తము సేయుచున్నది.

పై విషయము నంతను తత్త్వవిచ్ఛిరోమణియైన మన మహాకవి తన కుమారములో బ్రహ్మస్తుతి సందర్భముననే-

"త్వం పితౄణా మపి పితా దేవానా మపి దేవతా।
పరతోఽపి పరశ్చాసి విధాతా వేధసా మపి॥"

(చూ. కు. సం. సర్గ 2 శ్లో. 14)

"ఓ బ్రహ్మ! నీవు అగ్నిష్వాత్తాది పితృదేవతలకుఁ గూడ తర్పణీయుఁడవు. ఇట్లే నీవు దేవత లందఱకును ఆదిదేవుఁడవు. ఓ పరాత్పరా!

"ప్రకృతిః పంచభూతేషు ప్రభావే మూలకారణే॥ (చూ. యాదవ నిఘంటువు)

తెలియఁదగిన వస్తువులలో నేది తుది వస్తువుగా నిశ్చితమైనదో అట్టి చరమవస్తువునకుఁ గూడ నీవు ఆవలివాఁడవు. అనఁగాఁ బరాత్పరుఁడవు. దక్షబ్రహ్మకుఁగూడ నీవు బ్రహ్మవు." ఇట్లు మన కవిచే 'పురుషుఁడు' లేక 'బ్రహ్మ' పరాత్పరుఁడుగా భాసితుఁడైనాఁడు. పరబ్రహ్మరూపుఁడైన లేక పరమ శివాత్మకుఁడైన యీ 'బ్రహ్మ' పరాత్పరత్వమును మఱియొక సూక్తి ఇట్లు సువ్యక్తముచేయుచున్నది.

"ఇంద్రియేభ్యః పరాహ్యర్థాః అర్థేభ్యశ్చ పరంమనః। మనసశ్చ పరా బుద్ధిః బుద్ధేరాత్మా మహాన్ పరః । మహతః పర మవ్యక్త మవ్యక్తాత్పురుషః పరః పురుషాన్న పరం కించిత్ సా కాష్ఠా సాపరాగతిః

(కఠోపనిషత్)

ఇంతటితో 'బ్రహ్మ'కు పరాత్పరత్వము సిద్ధించినది. ఇఁక జగత్సృష్టి స్థితి లయములలో నీనిదే సర్వాధిపత్య మను విషయమును బట్టి (చూ. కు. సం. 2-10) మన మహాకవి యిట "వివర్త పరిణామ" సిద్ధాంతములనే సూచించినాఁడు. ఒకమూలవస్తువు మఱొక వస్తురూపముగా మాఱినపిమ్మటఁ గూడ ఆ మూలవస్తువు చెడకయుంటయే 'పరిణామ' మనఁబడును. ఈ పరిణామ మిా క్రింది శ్లోకములో మన మహాకవి విస్పష్టము చేసినాఁడు.

"ద్రవ స్సంఘాతకఠినః స్థూల స్సూక్ష్మో లఘు ర్గురుః।
వ్యక్తో వ్యక్తేతరశ్చాసి ప్రాకామ్యం తే విభూతిషు" (కు.సం. 2-11)

"ఓ పరబ్రహ్మ ! నదీ సముద్రాది ద్రవపదార్థసముదాయ మంతయు నీ పరిణామరూపమే. ఇట్లు పర్వతాది కఠినపదార్థజాతమును, ఘటాది స్థూలపదార్థజాతమును, ఇంద్రియగోచరము కాని పరమాణ్వాది సూక్ష్మపదార్థజాతమును ఓ పరబ్రహ్మ ! నీ పరిణామరూపమే. ఇట్లే జిల్లేడుదూది (అర్కతూలము) వంటి లఘుపదార్థమును, మేరు పర్వతమువంటి గురు పదార్థమును నీవే; కార్యకారణములు కూడ నీవే.

ఇట్లు అణిమాద్యష్టసిద్ధులలో నీ యిష్టమే (ఇచ్ఛయే) ప్రాముఖ్యము వహించును. కాఁగా పరబ్రహ్మరూపము ఎన్ని భిన్న వస్తువులుగా మార్పుచెందినను, మూలరూపము చెడక తదిచ్ఛాప్రకారము మాఱుచుండుట యిట వ్యక్తమైనది. ఈ శ్లోకములోఁ గాళిదాసుని "స్థూల సూక్ష్మ ద్రివాది పదార్థముల కీ క్రింది యుపనిషదర్థమే మూలము.

"అణోరణీయాన్మహతో మహీయానాత్మా గుహాయాం నిహితోఽస్య జంతోః——అతశ్చ విశ్వౌషధయో రసాశ్చ యేనైష భూతస్తిష్ఠత్యంతరాత్మా॥ (చూ. తైత్తిరీయోపనిషత్తు)

ఇట్లు ఉపనిషదర్థసమ్మిళితమైన మన కాళిదాస కవీంద్రుని బ్రహ్మస్తవమును బట్టి బ్రహ్మకు లేక శివునకు పరాత్పరత్వమును, సర్వాధిపత్యమును, సర్వాధ్యక్షత్వమును, సర్వశక్తిమత్త్వమును, ఆద్యంతరాహిత్యము నను వీని నీ విధముగ మన కవి సంగ్రహించి నాఁడు.

"జగద్యోని రయోని స్త్వం జగదీశో నిరీశ్వరః,
జగదాది రనాది స్త్వం జగదంతో నిరంతకః" (చూ. కు. సం. 2-9)

ఇఁక నీ దృశ్యమాన ప్రపంచములో నగపడు వస్తుజాత మంతయు (జ్ఞాత, జ్ఞేయము, మొ॥) అనఁగా విశ్వ మంతయు విశ్వేశ్వరుని విశిష్ట స్వరూపమే యని యీ క్రింది శ్లోకములో.

'త్వమేవ హవ్యం హోతాచ భోజ్యం భోక్తా చ శాశ్వతః।
వేద్యంచ వేదితా చాసి ధ్యాతా ధ్యేయంచ యత్పరం॥"
(చూ. కు. సం. 2-15)

ఓ దేవదేవా ! భోజ్యపదార్థమును, భోక్తయు నీరూపమే. ఇట్లు తెలియఁదగిన వస్తువును, తెలిసికొనువాఁడవును నీవే. కాళిదాసుని యీ వర్ణనములో 'సర్వం ఖల్విదం బ్రహ్మ। నేహనా నాస్తి కించన' అను నుపనిషదర్థము గతార్థమగుచు నీ వర్ణన వీని వేదాంత విజ్ఞానమును వేనోళ్ళఁ జాటుచుండుట లేదా!

ఇట్లు త్రిమూర్తులలో నొకఁడైన 'బ్రహ్మ'ను సాక్షాత్పరబ్రహ్మరూపుఁడైన పరమశివునిగఁ జిత్రించి, మన యీ శైవాద్వైతకవిచక్రవర్తి యీ పరబ్రహ్మ రూపమునే ఆ పరమశివతత్త్వమునే తనకావ్య మందిరములో సుప్రతిష్ఠితముచేసి మనసార-నోరారఁ దత్త్వమును ఆరాధించి అభినుతించినాఁ డనుటకు నీ కవీశ్వరుని కావ్యములలో నింకను నెన్నియేని యుదాహరణములు కోకొల్లలు. చూడుఁడు. ఈ కవి తన కుమారములో

"ప్రళయస్థితి సర్గాణా మేకః కారణతాంగతః" (చూ. కు. సం. 2-6) అని సృష్టి స్థితి లయముల కొక్కరుఁడే బ్రహ్మ కారణ మగుట"ను దన 'రఘువంశము'లో విష్ణుస్తవ సందర్భమును బురస్కరించుకొని

"నమోవిశ్వ సృజేపూర్వం విశ్వం తదను బిభ్రతే। అథవిశ్వస్య సంహర్త్రే తుభ్యం త్రేధా స్థితాత్మనే" అని ఒక్కరుఁడే అవస్థాత్రయ విశిష్టుఁడై ప్రళయస్థితి సర్గములకు మూలకారణ మగుచున్నట్లు తెలిపి యీ యద్వైతకవిచక్రవర్తి వేదాంతము నే ఆత్మజ్ఞానమునకు దగ్గర మార్గ మని నిరూపించినాఁడు. ఈ కవీశ్వరుని యొక్క పైశ్లోకార్థము ఈ క్రింది తైత్తిరీయోపనిష దంతర్గతమైన "భృగువల్లి" లోని యీ వాక్యార్థములో నెట్లు ప్రతిఫలించుచున్నదో పరిశీలింపుఁడు.

"యతో వా ఇమానిభూతాని జాయంతే। యేనజాతాని జీవంతి। యత్ప్రయం త్యభిసంవిశంతి। తద్విజిజ్ఞాసస్వ తద్బ్రహ్మేతి—"

ఇఁక పంచభూతాత్మక మైన యీ చరాచర ప్రకృతి యంతయును, 'అష్టమూర్తి' స్వరూపుఁడైన ఈశ్వరునిలోఁ బ్రతిబింబించుచున్న రీతి నీతఁడు తన శాకుంతల నాటకములోని నాందిలో

"యా సృష్టిః స్రష్టురాద్యా......ప్రత్యక్షాభిః ప్రపన్నస్తనుభి రవతు వ స్తాభిరష్టాభిరీశః" అని పంచభూతములు, సూర్య చంద్రులు, సోమయాజి (యజమాని) అను నెన్మిది మూర్తులు మనకీ ప్రపంచములో

ప్రత్యక్ష దృష్టము లగుచున్నవి. ఈ మూర్త్యష్టకములోఁ బ్రపంచ మంతయు నిమిడి యున్నవి. కాఁగా ప్రపంచ స్వరూపుఁడు పాఠకులను బ్రోచుఁగాత మని కవి యాశయము. మన యీ కవికి నాఱువందల సంవత్సరములకుఁ బిమ్మట నున్న శ్రీ శంకరభగవత్పాదులు కూడ కాళిదాసుని పై భావమునే తమ దక్షిణామూర్త్యష్టకములో

"భూరంభాంస్యనిలోऽనలోంబర మహర్నాథో హిమాంశుః పుమాన్
ఇత్యాభాతి చరాచరాత్మక మిదం యస్యైవ మూర్త్యష్టకం
నాన్యత్కించన విద్యతే విమృశతాం యస్మాత్పరస్మాద్విభోః
తస్మై శ్రీ గురుమూర్తయే నమ ఇదం శ్రీ దక్షిణామూర్తయే"

అని విశ్వరూపుని విశ్వరూపములను విశదీకరించినారు. కనుక విశ్వేశ్వరుఁడు విశ్వరూపుఁడే యగుట తథ్యము కదా! అనఁగా ఈ బ్రహ్మాండ మంతయును బరమశివుని లేక పరబ్రహ్మ స్వరూపుని మహాశరీరమే యగుచున్న దని మన కాళిదాసకవీంద్రుని కమనీయ సూక్త్యర్థములచే స్పష్టమైనది.

ఇట్లు బ్రహ్మాండము నంతను బరమేశ్వర స్వరూపముగ భాసింపఁజేసి తన ఆత్మజ్ఞానజ్యోతితోఁ బాఠకుల చిత్తములలో నాత్మజ్ఞాన జ్యోతిని వెలిఁగించిన మన కాళిదాసకవీంద్రుని కావ్య సాహిత్యమే ఉత్తమోత్తమమైన సాహిత్య మనఁదగియున్నది. ఈ సందర్భమున మన శ్రీ 'రాష్ట్రపతి' శ్రీ రాధాకృష్ణ మహోదయుల వాక్యములను- సర్వవిషయ సంభరితములగు వాని, నిట నుల్లేఖించెదను. 24 జూన్ 62 దైనిక ఆంధ్రపత్రికలో శ్రీ రాధాకృష్ణ మహోదయులు "ఆత్మజ్యోతిని వెలిగింపఁగల్గినదే ఉత్తమసాహిత్యము. అను విషయమునుగూర్చి యిట్లుపన్యసించినారు. (ఇది ఆంధ్రానువాదము) "కళారూపము రచయిత స్వీయ జీవితానుభవముతో కూడుకొని యుండును...... విజ్ఞానశాస్త్రీయ ఫలితములను నుత్కోక రూపములో సంపూర్ణముచేయ

వచ్చును. అటంబాంబును అమెరికాయే ప్రథమముగఁ బ్రయోగించుట కేవలము కాకతాళీయము. ఆ పనిని ఆ దేశము చేయకపోయినచో బ్రిటన్ గాని, రష్యాగాని చివరకు జపా వైనను జేసియుండెడిది. కొలంబస్ పుట్టకపోయినచో మఱొకరు అమెరికా దేశమును గనుఁగొనియుండెడివారు. వాస్కోడిగామా మన దేశమునకు సముద్రమార్గమును నిశ్చయింపనిచో నితరు లెవరో ఆ కార్యమొనరించి యుండెడివారు. కాని కాళిదాస మహాకవి పుట్టియుండనిచో 'అభిజ్ఞాన శాకుంతలము'' ఉండెడిది కాదు, సాహిత్యగ్రంథములను కళాఖండములు, రచయిత మేధాసంపత్తి తోడను, వ్యక్తిప్రతిభతోడను ఆకృతి ధరించును. కావున అట్టి కళాస్వరూపములు మఱొకరిచే యథావత్తుగ పూరితము లగుట అసాధ్యము. విజ్ఞాన శాస్త్రములోఁ బ్రావీణ్యము గడించుటకు అనేకశిక్షణాలయము లుండవచ్చును. కాని, కవులను ప్రవక్తలను దయారుచేయు శిక్షణాలయములను మనము కనుఁగొననేరము—

సాహిత్యము జీవిత విమర్శనము కాదు. జీవిత పరివర్తనమును నిశ్చయించునది. వినోదము కలిగించుట కంటెను, నీతిబోధ యొనర్చుట కంటెను, 'ఆత్మజ్యోతిని వెలిఁగించుటయే' సాహిత్యము యొక్క పరమ ప్రయోజనము''

మన రాష్ట్రపతి మహోదయులయొక్క పై సూక్తులకు, మన కాళిదాస మహాకవి నూటికి నూరుపాళ్లును దగియున్నట్లు, వీని పై కావ్యోదాహరణములు ప్రత్యక్షప్రమాణము లనుట ప్రత్యక్షర సత్యము.

ఇట్లు మన కవీశుని 'శివస్తుతి'ని బట్టి విశ్వమును విశ్వేశ్వరుని విశిష్టరూపముగ విలోకింపఁగల్గిన విజ్ఞపాఠకునకు 'విశ్వప్రేమ' స్వయముగనే యుదయించుచున్నదిగదా! కాఁగా, ఇట్టి ధన్యాత్ములయొక్క విశ్వప్రేమ విలసితవిమల విశిష్ట జీవితములు విశ్వకళ్యాణమునకుఁ

బచ్చుని తోరణము లగుచుండు ననుట నిర్వివాదాంశమే యగును.

ఈ కవి తన మాళవికాగ్నిమిత్రములోని నాందిలో—

"......అష్టాభిర్యస్య కృత్స్నం జగదపి తనుభి ర్బిభ్రతో నాభిమానః
సన్మార్గాలోకనాయ వ్యపనయతు సవ స్తామసీం వృత్తి మీశః"

ఇట "ఈశ్వరుఁ డష్టతనువులతోఁ బ్రపంచరూపుఁ డయ్యు నిరహంకారుఁడు. మోక్షమార్గ సందర్శనమునకై యీశ్వరుఁడు మీ తామసవృత్తిని దరలింపఁజేయుగాక యని కవి కాంక్షించినాఁడు. కనుకనే ముముక్షుజనము తమ తమస్సునుండి వెలుఁగుబాటకు దారి చూపుమని యిట్లు"అసతో మా సద్గమయ తమసో మా జ్యోతిర్గమయ మృత్యోర్మా మృతంగమయ" అని తమ తామసవృత్తి నివృత్తి కొఱకుఁ బరమేశ్వరుని ప్రార్థించుచుందురు. ఇది మన కవి యనిన "—సన్మార్గాలోకనాయ—"అనుపదమునకు మూలము కావచ్చును ఇఁక విక్రమోర్వశీయ నాటకాదిని—

"వేదాంతేషు యమాహు రేకపురుషం వ్యాప్య స్థితం రోదసీ
యస్మి న్నీశ్వర ఇత్యనన్యవిషయ శ్శబ్దో యథార్థాక్షరః
అంత ర్యశ్చ ముముక్షుభి ర్నియమితః ప్రాణాది భిర్మృగ్యతే
సస్థాణు స్థ్సిరభక్తియోగసులభో నిశ్శ్రేయసాయాస్తు వః॥"

ఇందలి 'పురుషుని' సర్వ వ్యాపకత్వము, ఈశ్వర (శివ) శబ్దార్థమును మొదట వివృతమైనవి. ఇట 'ఈశ్వర' అన్న శబ్దము ఒక్కనికే చెందు ననుటచే 'తచ్ఛివః' అను పరమశివతత్త్వము సూచితము. కాఁగా ఈ శివుఁడే సర్వదేవతా స్వరూపుఁడని కాళిదాసుని 'శివభక్తి'లోని సర్వ దేవతాత్మకత్వము సూచితము.మూఁడవపాదములో యోగమార్గముచే నీతఁడు ముముక్షుజనులచే దమలో వెదకఁబడునఁట. ఈ కవీశ్వరుఁడు పై విషయమును ఈశ్వరునిచేఁ దపస్సుచేయించునదనున—

"మనో నవద్వారనిషిద్ధవృత్తి హృది వ్యవస్థాప్య సమాధివశ్యం

యమక్షరం క్షేత్రవిదో విదుస్త మాత్మాన మాత్మన్యవలోకయంతం"
(చూ. కు. సం. సర్గ 3-50)

ఈశ్వరుఁడు సమాధిస్థితుఁడై, నవద్వారములను బంధించుటచే నిరాస్రవ పారమై, సమాధిచే వశంగతమైన తన మనస్సును దన హృదయాధిష్ఠానమందు నిలిపినాఁడట. 'హృదయము' అనఁగా వశిష్ఠు డిట్లు చెప్పినాఁడు. "యతోనిర్యాతి విషయః యస్మింశ్చైవ ప్రలీయతే హృదయంత ద్విజానీయా న్మనసః స్థితికారణం॥"
విషయము దేనినుండి బయల్వెడలి, దేనియందు లయించునో, మనసు నిల్కడ కేది కారణ మైనదో అదే హృదయ మనఁబడును. క్షేత్రజ్ఞులైన పురుషు లెవనిని నాశరహితునిగాఁ దెలిసికొనిరో అట్టి పరమాత్మను ఈశ్వరుఁడు దనలోఁ జూచుచున్నాఁడఁట. ఈ శ్లోకములో "ఆత్మాన మాత్మ న్యవలోకయంతం" అని ఆత్మరూపుఁడైన తాను దనలోఁ దనరూపమునే చూచుచున్నాఁ డని కాళిదాసుని కమనీయ కల్పన. ఈ విషయమునే యీ కవి యీశ్వరమహిమను రాయబారులైన సప్తర్షులచే నిట్లు పలికించును.
"యోగినో యం విచిన్వంతి క్షేత్రాభ్యంతరవర్తినం। అనావృత్తిభయం యస్యపదమాహుర్మనీషిణః॥" (చూ. కు. సం. 6-77)
ఇట్లీశ్వరుఁడు యోగమార్గముచేతనే గాక భక్తియోగముచేతను దెలియఁదగినవాఁడఁట. త్యాగరాజాదిభక్తులు తమస్థిరభక్తి చేతనే ముక్తులైన విషయము విజ్ఞవిదితమే. కనుకనే ఆదిశంకర భగవత్పాదులు 'భక్తి' నిగూర్చి తమ 'వివేకచూడామణి' యను వేదాంత గ్రంథములో "మోక్షసాధనసామగ్ర్యాం భక్తిరేవగరీయసీ।భక్తేస్తుయా పరాకాష్ఠా సైవ జ్ఞానం ప్రకీర్తితం। వైరాగ్యస్యతు సీమాసా జ్ఞానేతదుభయంయతః॥" "మోక్షమును సులభముగ సాధించుటకుఁ దగిన యుత్తమ సాధన సామగ్రిలో 'భక్తి' యే గొప్పది ఈ 'భక్తి' యొక్క-

తుదిహద్దు లేక చరమసీమయే "జ్ఞానము" అనఁబడును. వైరాగ్యము యొక్క చరమసీమ కూడ జ్ఞానమే. కనుక జ్ఞానవైరాగ్యములకుఁ గూడలివైన భక్తి పరమేశ్వరుని సులభముగఁ దెలిసికొని మోక్షముఁ బడయుటలో నుత్తమసాధనమనుట సత్యము. ఇట్లు మన మహాకవి కాళిదాసు జ్ఞానయోగ, భక్తిసాధనములచే ఆత్మ సాక్షాత్కార భాగ్యముఁ బడసిన జీవన్ముక్తుఁడు కనుకనే తనశాకుంతలనాటకాంత మున "పునర్జన్మరాహిత్యము నే తనధ్యేయమునుగాఁ దెలుపుచు నట్టి ధ్యేయము (నీలలోహిత) శివసాధ్యమని సూచించినాఁడు. మఱియుఁ ద్రిమూర్తులలో నొక్కొక్కనినే సర్వదేవతా స్వరూపునిగను సృష్ట్యాది సర్వకార్యకరణదక్షునిగను, సర్వశక్తియుక్తునిగను, వర్ణించి, ఆత్రి మూర్తులలోఁ బౌర్వాపర్యమనునది లేదని యిట్లు దెలిపినాఁడు.

"ఏకైవమూర్తిర్బిభిదే త్రిధాసా సామాన్య మేషాం ప్రథమావరత్వం। విష్ణోర్హర స్తస్య హరిః కదాచిద్వేధా స్తయోస్తావపి ధాతురాద్యౌ॥ (7-44)ఒకేమూర్తి ముమ్మూర్తులుగ మాఱినదిగాన నీత్రిమూర్తులలో జ్యేష్ఠ కనిష్ఠ భేదము లేదు. ఒకప్పుడు విష్ణువుకంటె నీశ్వరుఁ డాద్యుఁడై నచో మఱొకపుడు హరునికంటె హరియే ఆద్యుఁడు. ఇట్లే యింకొక ప్పుడు వీరిద్దరకు బ్రహ్మ ఆద్యుఁడు. కనుక వీరిలో ప్రథమావరత్వము సర్వసామాన్యమే ఈవిషయమునే మనకవి యీశ్వరుని గూర్చి సప్తర్షు లచే నిట్లు పలికించినాఁడు. "ఓ మహేశా! నీ యీదృశ్యమానరూపము త్రిమూర్తులలో దేనికి ఏమూర్తికిఁ జెందినది'' (చూ. కు. సం. 6-23) అని ప్రశ్నించి—

"అథవాసుమహత్యేషా ప్రార్థనా దేవ తిష్ఠతు''అని "మాప్రశ్నమునకు సమాధాన, మతిగుహ్యాతమమైనది గాన, అద్దాని నట్లుంచి మమ్ము తలం చిన పనిని దెలుపు'మని సప్తర్షు లీశ్వరుని నర్థించెదరు. (చూ. కు. సం. 6-24)

పైరీతిగ మన మహాకవి త్రిమూర్తులయందును భేదరహితమైన సమదృష్టి కలవాఁడుకనుకనే తన రఘువంశములో విష్ణుస్తుతి సందర్భమున విష్ణువును బ్రహ్మవాచకములైన 'చతుర్ముఖ' "పరమేష్ఠి" శబ్దములతో సూచించినాఁడు.

"ఇతి ప్రసాదయామాసుః స్తే సురా స్తమధోక్షజం
భూతార్థవ్యాహృతి స్సాహి నస్తుతిః పరమేష్ఠినః"

"...త్వత్తస్సర్వం చతుర్ముఖాత్" ఇట్లు బ్రహ్మాదిదేవత లందఱును ఒకే యొక మూలతత్త్వమునకుఁ జెందిన విభిన్నరూపములనియు నొక్క తత్త్వమును (శివతత్త్వమును) సేవించినచో నందఱు సేవింపఁబడినట్లే యగునని, ముముక్షుజనమున కీకవి యుపదేశించినాఁడు. మఱియుఁ బై విషయమును వివరించుచు నీ యద్వైతకవి విష్ణుస్తవముననే

"రసాంతరా ణ్యేకరసం యథా దివ్యం పయోఽశ్నుతే।
దేశే దేశే గుణేష్వేవ మవస్థా స్త్వ మవిక్రియః"

"ఓదేవదేవా! స్వతః మధురమగు వర్షోదకము చవిటి ప్రదేశములలోఁ బడి ఉప్పనగమాఱినట్లే స్వతః ఏ వికారములును లేని నీవు సత్త్వాది భిన్నగుణముల నాశ్రయించి బ్రహ్మాది విభిన్ననామములతోఁ బిలువఁబడుచుందువు. నిజమునకు వికారములు లేని నీ మూలతత్త్వము మాత్ర మొక్కటియే" ఇట్లు పరమేశ్వరుని నిజరూపముఁ లేకతత్త్వము తెలిసినవారు 'భిన్నతను నమ్మక భేదభావరహితమైన నైక్యభావముతో నేకతత్త్వము నుపాసించి తరించెదరనియు, నజ్ఞులు చవిటి నేలలోని నీటినిబట్టి ఉప్పనయే నీటిగుణమని భ్రమించునట్లు భిన్నతనే నిజమని నమ్మి నిజగుణమును తెలియలేక వారు తమ చంచల భావములతోఁ గష్టముల పాలగుచుందురనియు మన యద్వైతకవి యిట సూచించినాఁడు. భగవద్గీతలోఁ బై శ్లోకభావమే,

"యే ప్యన్యదేవతాభక్తా యజంతే శ్రద్ధయాన్వితాః।
తేఽపి మామేవ కౌంతేయ యజంత్యవిధిపూర్వకం॥"
'భిన్నదేవతా భక్తులు తమ తమ దేవతలను భక్తి శ్రద్ధలతో సేవించి
నచో వారి ఆ భిన్న దేవతాపూజ లన్నియు నోయర్జునా నాకే (కృష్ణ
పరమాత్మకే) చెందును. వారి భిన్నత్వము మిగులును. కనుక ఏకేశ్వ
రోపాసన మానవుల నైక్యమునకు భావైక్యమునకు సాధనమగును.'
ఈ గీతారహస్యమును మన భారతీయాద్వైతకవి తన కావ్యముఖమున
నెట్లు చాటినాఁడో చిత్తగింపుఁడు — పంథాన స్సిద్ధిహేతవః"

"బహుధాప్యాగమైర్భిన్నాః త్వయ్యేవనిపతంత్యోఘా జాహ్నవీయా
ఇవార్ణవే॥ (రఘువంశము) "పురుషార్థసిద్ధికి సాధకములైన మార్గములు
తత్తదాగమసిద్ధాంతముల ననుసరించి భిన్నములుగ నున్నను అవన్నియు
నో దేవాదిదేవా! గంగాదిభిన్ననదులన్నియు భిన్నమార్గములఁ బ్రవ
హించినను, తుదకొక్క సముద్రములోనికే వెళ్ళి కలిసి, అవి యఖండ
మహోదధియైన ట్లాభిన్నమత మార్గములన్నియు నీలోనికేవచ్చి చేరి
నీలో నంతర్భవించుచున్నవి.'' అనఁగా భిన్నమతసిద్ధాంతముల నన్ని
టిని మన యద్వైత మహోదధి తనలో లీన మొనర్చుకొని వానికి
తన నైక్యరూపము నొసంగఁజాలిన దని కవిభావము.

మన భారతీయమతములో మోక్షప్రాప్తికి సాధనములుగా
నింకను మంత్రతంత్రాదులు కూడ మన వేదములయందును, దర్శన
ములయందును, ఆగమములయందును విభిన్నరీతులుగఁ జూపఁబడినవి.
పై విభిన్నమార్గములన్నియు స్థూలదృష్టికి సమన్వయము కుదరనిచేఁ
బరస్పరవివాదాశ్రయములై పరస్పర విరుద్ధములుగఁ బొడకట్టు
చున్నవి. ఐనను ఈ విభిన్నమార్గములన్నియు "బహుధాప్యాగమై
ర్భిన్నాః పంథాన స్సిద్ధిహేతవః . . ." అని మన కాళిదాసకవీశ్వ

రుఁడు చెప్పినట్లు ఒక్క పరమేశ్వరప్రాప్తికే దారిచూపుచున్నవి. కనుక నానావిధములైన సాధనములు నామరూపాదులచేత మాత్రమే భిన్నములుగ గన్పట్టుచుండుననియు, వీని చరమలక్ష్యము మాత్రమొక్కటియే యనియు మన కాళిదాసమహాకవి తన తాత్త్వికదృష్టితో తన పూర్ణాద్వైత భావనతో తన సమగ్రదృష్టితో, మనకుఁ బ్రస్ఫుటము చేసినాఁడు; పరతత్త్వజ్ఞాన ప్రాప్తికి వెలుఁగుబాటను జూపినాఁడు.

ఈ కవీశ్వరుని, పై యుపదేశములను బట్టి మనయుపనిషత్సమ్మతమైన సర్వమత సామరస్యము, మానవసంఘము లన్నిటిలో నిజమగు సమైక్యభావన అనునివి సుసాధములగుచున్నవి.

నేటి ప్రపంచమును బటిష్ఠము చేయుటకు ముఖ్యసాధన మీ సమైక్య భావనయే కదా! ఇది కేవల వాగాడంబరముచేత నే సిద్ధించునది కాదు. ఇది క్రియాత్మకముగా నాచరణములోనికి రావలె నన్నచో మన కాళిదాసుని- సత్యమైన దేశసేవకుని కావ్యోపదేశము శరణ్యము. ఈ యుపదేశమే దేశకళ్యాణమునకు మూలము. ఇదియే తత్సాధనకు సుకరమైన మార్గము. ఈమార్గము ఉపనిషత్సమ్మతమైన సత్యవిషయమనుటకుఁ క్రిందియుపనిషత్సూక్తియే ప్రమాణము.

"అంతః ప్రవిష్ట శాస్తా జనానాగ్ం సర్వాత్మా
సర్వాః ప్రజా యత్రైకం భవంతి" (చూ. తైత్తిరీయోపనిషత్)

"సర్వాంతర్యామి యైన యొకే పరమాత్మ అందఱి హృదయ కుహరములలో శయనించి సర్వజనశాసకుఁ డగుచు అందఱి బుద్ధి వృత్తులను తత్తద్యోగ్యతలనుబట్టి సద్విషయములందుఁ బ్రేరేపించును. "తమసో మా జ్యోతిర్గమయ" అని సన్మార్గాలోకనసిద్ధికై అందఱును, ఆ యాదిదేవుని, ఆ పరమాత్మ స్వరూపుని సమముగ నారాధించినచో నది యందఱను నొకే లక్ష్యప్రాప్తికిఁ బ్రేరేపించి యందఱిలో సమైక్య భావన సముద్దీపింపఁజేయును. అప్పుడే మానవసంఘ మంతయు జాతి

మత వివక్షత విడనాడి, ఒకే యొక లక్ష్యసిద్ధికిఁ బాటుపడుచు నొకరి నొకరు కలహించుకొనుటను మఱచి పోదురు. ఈ విధముగా మానవ సంఘములలో సత్యమైన సమైక్యభావన, సత్యమైన దేశసేవ, సత్యమైన దేశప్రేమ, దీనితో సత్యమైనదగు విశ్వప్రేమ అనునవి క్రమముగ నుద యించును. దీనికంతకు జనతలో భిన్నభావన ముందు నశియువలెను. దీనితో వారి తామస ప్రవృత్తి తరలిపోవును. వెంటనే యిట్టి వారికి శ్రీ కాళిదాసు నుడివినట్లు-

"సన్మార్గాలోకనాయ వ్యపనయతు సవ స్తామసీం వృత్తిమీశః"

సన్మార్గసందర్శనాభ్యుదయము సమకూరును. ఈ విధముగా దేశ కళ్యాణము లోకకళ్యాణము స్వయముగఁ జేకూరుచున్నవి.

ఇంతవఱకు జరిగిన చర్చనుబట్టి తేలిన పరమార్థ సంగ్రహమిది "సర్వవ్యాపియై యున్న పరమేశ్వరుఁ డొక్కరుఁడే. స్వతః వీనికి నెట్టి వికారములు కాని యెట్టి భేదముకాని లేదు. ఇట్టి యేకైక తత్త్వము ప్రపంచసృష్టిరూపమున విశ్వకళ్యాణకామనతో సత్త్వాది త్రిగుణముల నాశ్రయించి సృష్ట్యాద్యనుకూలముగ నామరూపము లనేకములు దాల్చి ప్రపంచరూపమును దాల్చును. ఇట్లు మాఱినను వీని మూల తత్త్వము చెడదు. కనుక కేవలనామరూపములచేఁ బరమేశ్వరున కేర్పడిన భిన్నతను లేక వివిధ రూపములను బురస్కరించుకొని కొందఱు భేద భావములకు లోనగుచుందురు. ఇట్లు లోనగుట పరమే శ్వరుని నిజరూపమును దెలియమిచేతనే సంభవించును. కనుక నిట్టి యజ్ఞతతో గొందఱు భేదభావములతోఁ దమ లక్ష్యమును నుఱచి కష్టములకు లోనగుచుందురు. కనుక 'భిన్నభావన' మానవులకు కష్ట ములకే కారణమగుచుండును. కష్టకారకమగు నిట్టి భేద భావములను దమ తామసికవృత్తులను జనులు (కొందఱు) ఏకేశ్వరోపాసన, లేక ఏకలక్ష్య సాధనారాధనతోఁ బోఁదోలి సత్త్వవృత్తితో (ఇదే గాంధీ

మహాత్ముని మతము) నిరహంకారులై «సర్వము న్నతని దివ్యకళా మయ మంచుఁ" దమలోనెంచి సుఖకరమార్గ సూచకమైన యద్వైత భావనతో 'ఈశ్వర అల్లా తేరే నాం' అని గాంధీమహాత్ముని మహా సందేశము. ఇదే నిజమైన యద్వైతము) జనులందఱు తమతమ కుల దైవతములను సర్వదేవతాత్మకముగ భావించి ఆరాధింపవలెను. ఇట్లారాధించినవారి ఆరాధనలన్నియు నాకే పరమేశ్వరునికిఁ జెందును. అప్పుడు వారు ఏకలక్ష్య సాధన కృతార్థులగుదురు. ఇట్లు ఏకలక్ష్య సాధనతో జనులు పరమేశ్వర కరుణాకటాక్ష పాత్రులై యిహపర సుఖములతోఁ దరించుటయే మానవుల జీవిత పరమార్థము; సమైక్య భావనతో మానవునిలో దేశసేవాభావ ముదయించును. దీనితో మానవ సేవాభాగ్య ముదయించును. సర్వమానవ సేవతో సర్వాంతర్యామియైన సర్వేశ్వరుఁడు సంతృప్తుఁ డగునుగదా! ఇట్టి సర్వమానవసేవతో మానవుఁడు మాధవ సేవాభాగ్యముఁ బడసి కృతకృత్యుఁడై చరితార్థుఁ డగును."

మన కాళిదాస మహాకవి పై రీతిగా తన కావ్య ముఖమున కంతకు విశ్వశ్రేయ స్సంపాదకమైన♦ మహాసందేశము నొసంగి, విశ్వ సంస్తవనీయుఁడగుచు, నిప్పటికిని నెప్పటికిని మన భక్త్యంజలుల నందుకొనుచునే యున్నాఁడు. ఈ మహాకవి కట్టి తత్త్వజ్ఞానము వ్యంగ్య మర్యాదచేఁగూడ నే రీతిగఁ బ్రతిఫలించి ప్రకాశించుచున్నదో సంగ్రహముగఁ జూపి యీ విషయము ముగించెదను.

కాళిదాసమహాకవి కవితావాహినిలో నైహిక విషయములతో పాటు ఆముష్మికవిషయవిజ్ఞానవాహినికూడ నంతర్వాహినియై ప్రవహించినరీతిని ఈ క్రింది కావ్యోదాహరణములు మనకు స్పష్టముచేయగలవు. ఈ విషయమును ఈ కవి తన కుమారసంభవములో ఉమాముఖవర్ణనా సందర్భములోని శ్లోకముచే వ్యక్తముచేసినాఁడు. "ఉమా

♦ "విశ్వశ్రేయః కావ్యం" నన్నయభట్టారకుని "ఆంధ్రశబ్దచింతామణి" లోని ఆద్యసూత్రము.

ముఖంతు ప్రతిపద్య లోలా ద్విసంశ్రయాం ప్రీతి మవాప లక్ష్మీం" (చూ. కు. సం. 1-43) "కాంతి లక్ష్మి చంద్రారవిందములలో నుండి పొందలేని ప్రీతిని ఉమాముఖము నాశ్రయించినపు డొక్కసారిగ పొందిన దని ముఖ్యార్థము. ఇట వ్యంగ్యరీతిచే వచ్చు తత్త్వార్థ మిది సంస్కృత కవితాలక్ష్మి ఉమాముఖలక్ష్మివంటి కాళిదాసుని కావ్య లక్ష్మిని పొంది, ఐహికమైన, ఆముష్మికమైన ద్వివిధప్రీతినొక్కసారిగ పొందినది." అనఁగా నీకవి కావ్యాలలో నుత్తమాధికారులకు ఐహిక విషయానందముతో పాటు ఆముష్మికానందముకూడ వెన్వెంటనే కల్గుచున్నదని వ్యంగ్యార్థములోని పరమార్థము. ఇట్లే వీని రఘువంశకావ్యములో-

"గుర్వర్థమర్థీ శ్రుతపారదృశ్వా రఘో స్సకాశా దనవాప్యః కామం
గతో వదాన్యాంతర మిత్యయం మే మాభూత్పరీవాదనవావతారః॥
(5-24)

గురుదక్షిణార్థమై రఘువునొద్దకు వచ్చిన వరతంతుశిష్యునితో రాజు "రఘువునుండి యొక యర్థి కాంక్షితమునందక మఱియొక దాతకడకు వెడలినాఁడను నపవాదము లేకుండుఁగాక" యన్నమాటలే పైశ్లోకములోని ముఖ్యార్థము. ఇఁక వ్యంగ్యార్థములో "వేదాంతవేత్త యగు నొకఁడు గొప్పదైన యర్థమును అనఁగా మోక్షపురుషార్థమును గోరి ఆ కోరికను రఘువంశకావ్యమునుండి పొందలేక మఱియొక గ్రంథమునొద్దకు వెడలినాఁ డను నపవాదము కాళిదాసునైన నాకు లేకుండుఁగాక" అని కవి పాఠకుని ప్రబోధించినాఁ డనుట భావ్యము. అనఁగా తత్త్వవేత్తకు వలయు మోక్షజ్ఞాన సామగ్రి యీ రఘువంశమునందు (ఇది ఉపలక్షణముగాన) వీని కావ్యములం దున్నదనియు నజ్ఞులతో లేదనుట ఈ కవికి అపచారము చేయుటవంటి దనియుఁ గాన ఉత్తమాధికారియగు పాఠకుఁడు, తన మోక్షవిషయక జ్ఞానమును విజ్ఞదృష్టితో-

సావధానచిత్తతతో విలోకించి తన కాంక్షితమును నిందుండి బడయుటయు, కాళిదాసునకు సంతోషకారణ మనియు భావము. ఈ వ్యంగ్యార్థభావమునే యింకను వివరించుచున్నట్లీ కవి, తరువాతి శ్లోకములో-

'సత్వం ప్రశస్తే మహితే మదీయే వసన్ చతుర్థోఽగ్ని రివాగ్న్యగారే.
'ద్విత్రాణ్యహా న్యర్హసి సోఢుమర్హన్! యావద్యతే సాధయితుంత్వదర్థం॥
(5-25)

ముఖ్యార్థములోఁ రాజు వరతంతుశిష్యునితో నిట్లనును. ఓమాననీయా నీవు నా త్రేతాగ్నిగృహములో నాల్గవయగ్నివలె రెండుమూఁడు రోజులున్నచో నీ కాంక్షితార్థమును సాధించి యిచ్చెదను. ఇక వ్యంగ్యార్థములో కవి యుత్తమపాఠకునితో నుడివినట్లు భావించునది. ఓ మాననీయ పాఠకోత్తమా! త్రేతాగ్నిగృహమువలె పవిత్రమైన నా కావ్యమందిర•ములో నాల్గవయగ్నివలెఁ పవిత్రభావభాసురుఁడవైన నీవు సావధానచిత్తుఁడవై పరమార్థచింతతో నిరీక్షించియున్నచో నీ కాంక్షితార్థమైన మోక్షపురుషార్థమును సాధించి నీ కందించెదను.'' ఆత్మజ్ఞానోపలబ్ధికి తత్సాధకుఁడు తద్విషయకమైన మననము, ధ్యానము, నిదిధ్యాసము అను వానితో "ఆత్మ'' పర్యాలోచనము చేయవలెనని బృహదారణ్యకోపనిషత్తులో నిట్లు చెప్పఁబడినది.

"ఆత్మావాఽరే! ద్రష్టవ్యః శ్రోతవ్యో మంతవ్యో నిదిధ్యాసితవ్యః'

ఇది యాజ్ఞవల్క్య మైత్రేయికి 'ఆత్మ'ను బోధించుచున్న సందర్భములోనిది. ఇట్లు నిరంతర నిరీక్షణతోఁ జూచిన పాఠకునికి కాళిదాసకావ్యములలో చతుర్థపురుషార్థసిద్ధి తప్పక చేకూరునని కవి యిట నొక్కి వక్కాణించినాఁడు. మోక్షసాధనమైన యిట్టికాళిదాసుని తత్త్వజ్ఞానము ఈ కవీశ్వరుని "కర్మబంధచ్ఛిదం ధర్మం భవస్యేవ ముముక్షవః'' (చూ.కు.నెం. 2) మున్నగు సూక్తులవలన సువ్యక్తమగుచునేయున్నది.

• వీని కావ్యములు త్రేతాగ్నులవలె మూఁడు. దృశ్యకావ్యములును మూఁడే.

ఈ "యాత్మజ్ఞానము" మానవునకు వాని యహంకారాదు లంతరించినఁగాని యలవడదు. ఈ యహంకారము తరించవలె నన్న మానవునిలో సాత్త్వికశక్తి సముజ్జృంభింపవలెను. ఈ సాత్త్విక భావోదయమునకు మానవుని తామసికవృత్తి తరలిపోవలెను. ఇట్లు సాత్త్విక గుణసంయుతుఁడైనపుడే మానవుఁడు తత్త్వజ్ఞానమును సంపాదింపఁగల్గుచున్నాఁడు. ఈ విశిష్ట విషయ కదంబమును వీని శాకుంతలనాటక కథాభాగము వ్యంగ్యరీతిచే నిట్లు ప్రకాశింపఁజేయుచున్నది.

దుష్యంతుఁడు కణ్వాశ్రమమునకుఁజెందిన పెంపుడు లేడిని వెంటాడుటలో నీ నాటకకథ ప్రారంభ మగుచున్నది. ఇచ్చట ఈ క్రింది నాటకకథావిషయములు ముఖ్యములై విశిష్టార్థప్రతిపాదకము లగుచున్నవి. పరిశీలింపుఁడు.

(1) రాజు, పరుగిడుచున్న లేడిని బట్టి హింసించుటకై రథాశ్వములను వేగముగఁ దోలుమని సారథిని గోరేచుట

(2) రథాశ్వవేగ వర్ధనముతో రాజు నింద్రియాశ్వవేగము కూడ హెచ్చి ఆ వేగము రాజులోని హింసాప్రవృత్తిని పరివృద్ధముగఁ జేయును.

(3) రథవేగమునకు భీతిలి ప్రాణత్రాణమతియైన లేడి యతి రయముగఁ బరుగిడుచు రాజును గహనములోని కాకర్షించుకొని పోవును.

(4) తపోవన ద్వారమువఱకు నాకర్షితుఁడైన రాజును జూచి యచ్చటి మునులు వాని నా హింస నుండి నివారించెదరు.

(5) రాజు వారి కారణముచేఁ దన ధనస్సుతోపాటు తన హింసావృత్తిని గూడ విడిచిపెట్టి సత్త్వవృత్తిని సమాశ్రయించును.

(6) రాజుయొక్క సత్త్వ సమాశ్రయమునకు సంతసించిన మునులు రాజు నాశీర్వదించెదరు.

(7) రాజు తపస్వి ప్రార్థనముచేఁ గణ్వాశ్రమములోనికి వెళ్ళును.
(8) అట రాజునకు శకుంతలాదర్శన భాగ్యము, పరమానందప్రాప్తి భాగ్యము చేకూరును.

పై విషయాష్టకములోఁ గూడిన కథాంశములను విమల చిత్తముతో విలోకించినచో నీ క్రిందిరీతిని పరమార్థము ధ్వనింపఁగలదు.

మానవుఁడు తన యింద్రియము లనెడు అశ్వములను కోరిక లనెడు మృగములమీఁదకు విచ్చలవిడిగ విడిచి విహరించుచున్నంత వఱకు నట్టివాని నా మృగములు దుష్యంతుని మృగమువలె విషయారణ్యములోనికి ఆకర్షించు ననియు, అట్లాకర్షితుఁడైనవానికి అహంకారపూర్వకమైన హింసా ప్రవృత్తియే ప్రవృద్ధ మగుచుండు ననియు, నిట్టి హింసాపరాయణుఁడు కొంతకాలమునకుఁ దన పూర్వపుణ్య వశమున నే మహానుభావునిచే నైనఁ బ్రబోధ్యమానుఁడై తన తామసిక వృత్తిని విడనాడి తన యకృత్యములకుఁ బరితపించి పరిశుద్ధచిత్తుఁడు కాఁగల్గినచో వెన్వెంటనే వానికి సత్వగుణసంయుక్తుఁ డగు దుష్యంతునకు వలె నభ్యుదయము చేకూరి తుదకు బ్రహ్మానందప్రాప్తి లభించు ననియుఁ బై విషయాష్టకము వ్యంగ్యరీతిని సూచించుచున్నది. పై ధ్వన్యర్థసూచక మంతయు గాళిదాసుని దుష్యంతుని భావిచరిత్రలోఁ బ్రతిఫలించిన విధము శాకుంతల పాఠకులకు విదితచర మైనదే. ఇందు రాజు అహంకారముతో శకుంతలను బ్రత్యాఖ్యానించి, యభిజ్ఞానజ్ఞానానంతరమునఁ బశ్చాత్తాప ప్రక్షాళిత పాపపంకిలుఁడై విశుద్ధచిత్తుఁడగుట విలోకింపఁ దగిన విశిష్ట విషయము. పశ్చాత్తాపముతో రాజున కంతకుముందు గల యహంకార మణఁగిపోయినది. పుటతప్తజాంబూనదమునకు నైర్మల్యమువలె వాని చిత్తమునకు నైర్మల్య ముదయించి 'చిత్తశుద్ధి' చేకూరినది. ఈ సందర్భములో వీని చిత్తశుద్ధినిగూర్చి మారీచ మహర్షి శకుంతలతో-

"వత్సే! చరితార్థాసి!

"శాపా దసి ప్రతిహతా స్మృతిరోధరూక్షే
భర్త్ర్యపేత తమసి ప్రభుతా తవైవ।
ఛాయా నమూర్ఛతి మలోపహతప్రసాదే
శుద్ధేతు దర్పణతలే సులభావకాశా" (7 అంకం 196 శ్లోకం)

అద్దము వినిర్మలముగా నున్నప్పుడే అందగ్రస్థితవస్తుచ్ఛాయ ప్రతిఫలించునట్లు మానవుని వినిర్మలచిత్తముననే పరమాత్మవస్తుచ్ఛాయ ప్రతిబింబించు నని యిందలి వ్యంగ్యార్థము. మన మహాకవి, దుష్యంతుని విశుద్ధచిత్తతతోపాటు దన 'విశుద్ధత'ను దన 'విముక్తత'ను గూడ సూచించినాఁడు. విముక్తుఁడగు వాని కిఁక నిహమునఁ గావలసిన దేముండును? తన కమనీయత మకవితాప్రతిభతో మర్త్యలోకము న మర్త్యలోకాధికముగ నమరఁజేసి పూర్ణమనోరథుఁ డైనాఁడు. కాన నైహికముగా నీ కవికి వలయున దేదియు లేదు. శకుంతలా పునః ప్రాప్తితో దుష్యంతుఁడుకూడ నిట్లే యైహికముగ నవాప్తసర్వమనోరథుఁ డైనాఁడు. కనుకనే దుష్యంతముఖమున దనకిఁక "పునర్జన్మ రాహిత్యమే" చరమలక్ష్య మని సూచించినాఁడు. ఈ తాత్త్విక శిరోమణి యొక్క భావ మింతగఁ బరిణత మగుటకుఁ దగినంత పుష్కల పూత సామగ్రి యీ కవీశ్వరుని నాటకాది నుండియుఁ జక్కగ సందృష్టమగు చునేయున్న దనుటకు నింకను ఈ క్రింది యుదాహరణములు చాలును. తపోవన పాదపములకు ఘటముతో జలము లిడుచున్న శకుంతలను జూచి రాజు తనలో నిట్లనుకొనును.

"ఇదం కిలావ్యాజమనోహరం వపుస్తపః
క్షమం సాధయితుం య ఇచ్ఛతి।
ధ్రువం సనీలోత్పలపత్రధారయా
సమిల్లతాం ఛేత్తు మృషి ర్వ్యవస్యతి॥" (అంకం 1 శ్లో 18)

"నిసర్గ సుందర సుకుమారమైన శకుంతలయొక్క సుందరరూపమును క్లిష్టకార్య (తపఃక్లేశ) సహనక్షమముగఁ జేయఁదలఁచిన కణ్వర్షి సుకుమారమగు నల్లకలువ పూరేకుటంచుతో కఠినమైన సమిల్లతను ఛేదించుటకుఁ బ్రయత్నించుచున్నాఁడు. ఇది ముఖ్యార్థము. ఇఁక నిందలి ధ్వన్యర్థ మిది. ఋషితుల్యుఁడైన కాళిదాసు (నాఽనృషిః కురుతే కావ్యం) శృంగారప్రధానమైన తన సుకుమార శాకుంతల కథాభాగము అను (అల్ప) సుకుమారసాధనముచే, కృచ్ఛ్రచాంద్రాయణ నియమసాధ్యమై, కఠినాతికఠినమైన మోక్ష పురుషార్థ సాధనము అను మహాకార్యమును సాధించుటకుఁ బూనుకొనినాఁడు. శృంగారప్రధానమగు కథాంశముతో దత్త్వజ్ఞానసాధ్యమైన మోక్ష వస్తువును సాధించుట మహాకార్యసాధనమే కదా!

దీనితో నీ తత్త్వవేత్త తత్త్వజ్ఞాన పరిపూర్ణుఁ డనియు బరమాత్మ జ్ఞానసంపన్నుఁడనియు నవగతమైనది. నిజమున కీ శాకుంతల నాటక కథారూపము కేవల "జ్ఞాన" జ్ఞేయమైన దను విషయ మీ క్రింది శ్లోకార్థముచే వ్యక్త మగుచున్నది.

"అనాఘ్రాతం పుష్పం కిసలయ మలూనం కరరుహైః
అనావిద్ధం రత్నం మధు నవ మనాస్వాదితరసం
అఖండం పుణ్యానాం ఫలమివ చ తద్రూప మనఘం
నజానే భోక్తారం క మిహ సముపస్థాస్యతి విధిః"

ఇందలి ముఖ్యార్థము "సౌందర్య సమారాధనా" సందర్భమున విదితము. ఇఁక నిందలి వ్యంగ్యార్థము- ఇందు రేఖాంకితమైన వస్తు పంచకము జ్ఞానేంద్రియ గ్రాహ్యమైనది. ఇట్టి పంచకముతో నభిన్నమైన శకుంతలారూపము అనఁగా శాకుంతల కథారూప తత్త్వము, (కథాపరివర్తిక)కూడ 'జ్ఞాన'గోచర మైనదేయని యిందు ధ్వనించుచున్నది. ఇంతటియీ కథారూపవైభవమును దత్త్వతః తెలిసికొని యానందింపఁ

గల వే తత్త్వజ్ఞానిని- ఏ యుత్తమాధికారిని- బ్రహ్మ యుత్తమ పాఠకునిగా సృజించెనో ? యని కవి భావన యన్నట్లు భావించునది. ఇట్లే యింకొకచోట దుష్యంతుడు విదూషకునితో-

"సఖే! అనవాప్తచక్షుః ఫలోఽసి। యేన ద్రష్టవ్యానాం పరం నదృష్టం॥
(2 అంకం)

"మాధవ్యా ! శకుంతల ఉత్తమ వస్తువు లన్నిటిలో ఆఖరి వస్తువుగా అనఁగా ఉత్తమోత్తమ వస్తువుగాఁ జూడఁదగినది. అట్టి సుందరతమవస్తువును నీవు చూడలేకపోతివి గాన నీవు నేత్రము లున్నందుకుఁ దగిన ఫలమంద లేదు." ఇది ముఖ్యార్థము. ఇందలి వ్యంగ్యార్థమెట్టిదనఁగా "పరమాత్మ వస్తువు ప్రపంచములోఁగల వస్తువులన్నిటిలో ఆఖరి వస్తువుగాఁ దెలియఁ దగినది. అట్టి యనుత్తమవస్తువును చూడలేనివాఁడు కండ్లున్నను అంధప్రాయుఁ డగును.

"యద్జ్ఞాత్వా నేహభూయోఽన్యద్జ్ఞాతవ్య మవశిష్యతే।"

"ఏయుత్తమవస్తువును దెలిసికొనిన పిమ్మట ఈ ప్రపంచమున నిఁక దెలిసికొనవలసిన వస్తువనునది యుండదో ? అట్టి పరాత్పరవస్తువును పరమాత్మవస్తువును సాధనాదిశేషములఁ దెలియనివాఁడు (అంధప్రాయుఁడే. కనుకనే చక్షుష్మత్తాతు శాస్త్రేణ" అని అభిజ్ఞులనినారు. ఇఁక "తత్త్వజ్ఞానవైభవ" భాగములో నింతవఱకుఁగల పరమార్థ సంగ్రహమరయుదము. "మానవుఁడు లౌకిక ప్రపంచములోఁ దనలౌకిక కృత్యములను నెరవేర్చుకొనుచున్నను దనపరమలక్ష్యమును మఱువరాదు. ఆతఁడు కేవల రాజసవృత్తితో నహంకారాదుల కధీనుఁడై యున్నంతవఱకు వానియింద్రియవేగము వానిని హింసాప్రవృత్తి ప్రవణుని జేయును. కాన నహంకారాదుల నణఁగఁద్రొక్కుటకు మానవుఁడు దాఁజేసిన యకృత్యములకుఁ బదేవదే పశ్చాత్తాపఁ సంతప్తుఁడు కావలెను. పశ్చాత్తాప క్షాళితపాప పంకిలుఁడైనవాఁడు సత్త్వసంయుక్తుఁ

డగును. అప్పుడే మానవుఁడు దురహంకారదూరుఁడై శమితాహంకారుఁడై విశుద్ధచిత్తుఁడు కాఁగల్గును. ఇట్లు చిత్తశుద్ధి చేకూరిన వానికి వాని వినిర్మల చిత్తములో, వినిర్మలదర్పణములో వస్తుచ్ఛాయవలె బరమాత్మవస్తుచ్ఛాయ ప్రతిబింబించును. దీనితో నిట్టి వానికి నైహిక వాంఛారాహిత్యము, మోక్షపురుషార్థసిద్ధియుఁ జేకూరును. ఇట్టి జీవన్ముక్తునికి బ్రహ్మానందానుభవ ప్రాప్తి సులభమేయగును.

కనుకనో పాఠకులారా! దురభిమానాదులతోఁ దమ సాటివారిని, దమసాటి మతములను నేవగించుకొనుట కేవలభ్రమమూలము, దుఃఖమూలమునగుననియు, నిట్టి దురభిమానము వీడి సత్త్వవృత్తితో మహాత్ముల యుపదేశములను మన్నించి యాచరించువారు దుష్యంతునివలె నభ్యుదయపథము నందుకొనగలరనియు నహంకారావిష్టులైయున్నంత వఱకు వీరు భ్రమప్రమాదాయాస కష్ట నష్టాదులకు లోనగుచుందురనియుఁ గాన మొదటినుండియు సత్త్వలాభమునకు యత్నించుచు, తమ తమ వృత్తులతో సుఖజీవనులై తుదకు, "చిత్తశుద్ధి" వడసి పరమాత్మజ్ఞానప్రాప్తితోఁ జరితార్థజన్ములగుటయే మానవజన్మకు ఫలమని, మన కాళిదాసకవీంద్రుఁడు కమనీయకావ్యలక్ష్మి యధికారి తారతమ్యమును బట్టి ముఖ్యార్థముచే మనల నైహికానందయుతులుగను, వ్యంగ్యముగ నాముష్మికానందయుతులుగను జేసి, సర్వజనమనోరంజకముగ దన సరస సుందర సుమధుర సుకుమార సూక్తులచే నిట్లు ప్రమోదకరముగఁ బ్రబోధించుచున్నది. కనుకనే యాలంకారికులిట్టి మహాకవుల కావ్యలక్ష్మిని వేదపురాణాధికముగ నిట్లు కీర్తించినారు.

"యద్వేదా త్ప్రభుసమ్మితా దధిగతం శబ్దప్రధానాచ్చిరం
యచ్చార్థప్రవణా త్పురాణవచనా దిష్టం సుహృత్సమ్మితాత్।
కాంతాసమ్మితయా యయా సరసతా మాపాద్య కావ్యశ్రియా
కర్తవ్యే కుతుకీ బుధో విరచిత స్తస్యై స్పృహాం కుర్మహే॥

ద్విపద రామాయణ రచయిత

అచ్చువెల్లి రంగనాథుఁడు

చాలకాలమునుండి ద్విపద రామాయణ కర్త రంగనాథుఁడా? లేక గోన బుద్ధారెడ్డియా? యను విషయము వాదోపవాదముల నడుమఁబడి యున్నది. రంగనాథుఁడను కవి దీనిని రచించె ననువారు, మొదట వైష్ణవుఁడై తరువాత శైవుఁడైన చక్రపాణి రంగనాథుఁడు దీనిని రచించిన కవియని నిర్ణయించియున్నారు. పరిషత్పుస్తకభాండా గారములో పొత్తపి వేంకటరమణకవి రచించిన 'లక్షణ శిరోమణి' యను లక్షణగ్రంథములో యతిప్రకరణమున రెండు తావులందు ద్విపద లుదాహరింపఁబడినవి. అచట నీ రామాయణ కర్త అచ్చువెల్లి రంగనాథుఁడుగాఁ బేర్కొనఁబడి యున్నాఁడు ఆ వాక్యము లీ క్రింది విధముగనున్నవి.

1. "అచ్చువెల్లి రంగనాథుఁడు రామాయణం ద్విపద-విశ్వామిత్ర శబ్దమునకు రెండవ యర్ధచరణాది అచ్చుకు నిత్యసమాసయతి ప్రయోగం లక్ష్యం.

ద్వి. ఎక్కడగురుఁడని యెఱుఁగని నీకు
అక్కటా గురుఁడు విశ్వామిత్రుఁడయ్యె.

2. అచ్చువెల్లి రంగన్నగారు రామాయణంద్విపద. ౧ పాదా ర్థమున సహజస్వరయతి లక్ష్యం.

ద్వి. ఎసగ దివ్యులఁ బెంప ఋషులరక్షింప
నసురులశిక్షింప నవనిఁ బాలింప.

విభీషణ శరణాగతి ఘట్టములోనిదీ ద్విపద. ఈవిధమయిన యుదాహృతి వాక్యములనుబట్టి, ద్విపద రామాయణ కర్త అచ్చువెల్లి రంగనాథుఁడుగాఁ దెలియవచ్చుచున్నాఁడు ద్విపద కావ్యములలో గౌరన హరిశ్చంద్రోపాఖ్యానములోని ద్విపదలనుగూడ నీతఁడుదాహ రించియున్నాఁడు. పెక్కురు గ్రంథకర్తల నామములతోపాటు, వారి వారి గ్రంథములలోని యుదాహృతుల నీతఁడు గైకొని యున్నాఁడు. ఈతఁ డిచ్చిన యుదాహృతులఁబట్టి యీతఁ డప్పకవికంటెఁ గొంత పూర్వుఁడుగఁ గన్పట్టును. —సంపాదకుఁడు.

తెలగనార్యుని యయాతిచరిత్రము

పరాశరం గోపాలకృష్ణమూర్తి ఎం. ఏ.

ఒక నూతన సాహిత్య ప్రక్రియను ప్రచారమునకుఁ దెచ్చిన ప్రతిభావంతుఁడు పొన్నిగంటి తెలగన్న. అతనికిఁ బూర్వము గ్రంథములలో నెటనో యొకటిరెం డచ్చతెలుఁగు పద్యములు కనవచ్చును. ఆ యొకటి రెండింటి నచ్చతెనుఁగున నడపునప్పటికే యాకవులకుఁ గృత్యాద్యవస్థయైనది.

"తోలుకారు మెఱుఁగుల తోఁటలో నాడెడి
 రాయంచ కొదమతో రాయఁజాలి
యిరుల బండారపు టింటికిఁ బెట్టిన
 బొండుమల్లెల కోటఁ బోర గెలిచి
బలుమంచుఁ గంబాల బలసిరాఁ జుట్టిన
 క్రొత్త మంజిడి బాగుఁ గొఱఁతచేసి
పాల పెన్నురువు గుబ్బలిమీఁద నెలకొన్న
 నిండు వెన్నెల ముగ్గు నిగ్గు చెఱిచి
జడలఁ గ్రొన్నెల, మెడఁ బాఁప సరిగఁ దొడలఁ
బొడల తోల్మేన వెలిమిడిపూఁత మించఁ
బొడమి వేత్రేని ముందటఁ బొడవుసూపెఁ
బొడవులందెల్లఁ బొడవైన పోటు వేల్పు."

(ఉత్తర హరి–2 ఆ–134 ప.)

అని యచ్చతెనుఁగుఁ బద్యములను దొలుతగా రుచి చూపించిన మహాకవి నవీన గుణసనాథుఁడగు నాచన సోమనాథుఁడు. ఈ మాదిరిగనే కబ్బమంతయు నేల వ్రాయఁగూడదను చిత్రమైన ప్రశ్న పొన్నిగంటి తెలగన్న కుదయించినది. దాని ఫలితమే యయాతి చరిత్రము. ఒక యచ్చతెనుఁగుఁ బద్యము కన్పించిననే యాశ్చర్యమగుచుండఁ బొత్తమెల్లనిట్లు రచించుట సామాన్యముకాదు.

ద్వ్యర్థి కావ్యమును సంతరింపఁబోవుచుఁ బింగళి సూరన "రెండర్థంబుల పద్యమొక్కటియు నిర్మింపంగ శక్యంబు గాకుండు" నని యనిపించుకొన్నాఁడు. అతనికిఁ బూర్వము "భీమన తొల్లి చెప్పెనను పెద్దల మాట" యైనఁ గలదు. అనఁగాఁ దత్పూర్వమట్టి ప్రక్రియకలదను వాడుకయైనఁ గలదు. తెలగన కట్టి వినికిడి యయిన లేదు. ఉత్సాహముతో నూత్నపథానుగామి యయిన యితని ప్రయత్నము ప్రశస్యము కావున నే.

"అచ్చ తెనుంగుఁ బద్యమొకఁడైనను గబ్బములోన నుండినన్
హెచ్చనియాడుచుందు రది యెన్నుచు నేర్పునఁ బొత్తమెల్ల ని
ట్లచ్చ తెనుంగున న్నొడువ నందుల చందమెఱుంగు వారు నిన్
మెచ్చరొ యబ్బురంబనరొ మేలనరో కొనియాడరో నినున్."

అని మరింగంటి యప్పన గారిచే ననిపించినాఁడు. తెలగన చేసిన 'యచ్చ తెనుఁగు' రాచబాటనే కూచిమంచి తిమ్మకవ్యాదులు పయనించినారు. మరింగంటి వేంకట నరసింహాచార్యులు రచించిన 'చిలువపడిగ తేని పేరణము' కూచిమంచి తిమ్మకవి నీలపెండ్లి, యచ్చ తెలుఁగు రామాయణమును, పాటిబండ పురుషోత్తమకవి కంస విజయము; మున్నగు నచ్చతెలుఁగుఁ గబ్బములు ప్రసిద్ధములు. పందొమ్మిదవ శతాబ్దమునుండి వీని రచనమింకను బ్రచురమయినది. కవ్వడికైవారము కిరాతార్జునీయమునకుఁ దెనుఁగు సేఁత. శ్రీ వీరేశలింగముగా రన్నిప్రక్రియలతో పాటు దీనియందును నొక చేయి వేసినారు.

ఒక ముసల్మాను ప్రభువు కృతిభర్తయగుట, కృతిశుద్ధాంధ్రములో నుండుటయను రెండు విశిష్టలక్షణములు యయాతి చరిత్రకుఁ బట్టినవి. 1550 నుండి 1581 వఱకు గోలకొండ రాజధానిగాఁ బ్రభుత్వము చేసిన మల్కిభరామునొద్ద నుద్యోగియగు నమీనుఖానరొడయనికిది యంకితము చేయఁబడినది. కందుకూరి రుద్రకవిని సత్కరించిన

వాఁడీ యిభరాముఁడే యందురు. అద్దంకి గంగాధరకవి తపతీసంవరణో పాఖ్యానమును మల్కిభరామున కంకితమొనర్చెను. తన ప్రభువు వలెనే తానును కృతిపతికావలయునని ముచ్చటపడి యమీను ఖానుఁడు తెలగన్నను జేరఁదీసియుండును. మరింగంటి యప్పన గారి ప్రేరణమున నితఁ డమీనుఖానునకీ కృతినిచ్చినట్లు తెలియుచున్నది.

గుంటూరు మండలమునఁ గొండవీటి పరిసరమున-అమీనా బాదు, పొట్లపాడు, ఇభరాంపట్నం, పొన్నెగల్లు నను గ్రామములు కలవు. ఇభరామ్ పాదుషా కొండవీటి రాజ్యమును జయించినట్లుగా నమీనాబాదులో, మూలాంగురమ్మగుడి యొద్దనున్న శాసనమువలన ధ్రువపడుచున్నందునఁ దెలగనార్యుని నివాసము గుంటూరుమండలమై యుండునని శ్రీ చాగంటి శేషయ్యగా రభిప్రాయపడినారు. ఇభరామ్ పాదుషా గోలకొండ ప్రభువు కావున నాతనియొద్ద నుద్యోగియగు నమీనుఖానుఁడును, దదాశ్రితుఁడగు తెలగన్నయు గోలకొండ ప్రాంతీయులే యని కొందఱియూహ.

అమీనుఖాను ప్రజాహిత కార్యములెన్నియో చేసియుండెనని తెలగనార్యుఁడు పొగడియున్నాఁడు. పొట్లచెర్లలో నాతఁడొక మసీదును గట్టించెనఁట. పరమాత్మని ధామము చేరఁదలఁచినవారి కీ మసీదు నిచ్చెనవలె నున్నదని కవి చక్కగా నుత్ప్రేక్షించినాఁడు. అమీనుఖాను బ్రాహ్మణుల బిడ్డలకు వివాహములు వేడుకతోఁ జేయించెడి వాఁడఁట. ఈ ఖానుఁడు తన్నుఁ గూడఁబట్టి పెండ్లి చేయించునేమో యని జడిసి నిత్య బ్రహ్మచారియయిన హనుమంతుఁడు వనములకుఁ బారిపోయెనఁట.

తెలగన కవిత్వము శ్రుతి కటువుగాక మృదువుగాను బొందికగాను నుండును. యయాతి చరిత్రము పుట్టువునందే కాక మేలిమి గొనములందు సయితము మచ్చ తెనుఁగుఁ గబ్బములలోఁ దొలుత నెన్నఁ

దగినదని ప్రాజ్ఞుల యభిప్రాయము. ఇతర కవులవలెఁ దెలగన్నయుఁ బూర్వకవుల పద్యములు నూహములు, వర్ణనములు కొన్నింటిని దన విగాఁ జేసికొని యచ్చతెనుఁగొనర్చితన కావ్యమునఁ జేర్చికొనినాఁడు. యయాతికథ భారతమునందును భాగవతమునందును గలదు. నన్నయ పోతనల లేఖిని చవి చూచిన యీ కథను దెలగన్న యంత ప్రతిభావంతముగ నిర్వహింపలేదేమోయని పించును. అయినను నితని చూపంతయు నచ్చతెనుఁగుఁ గబ్బముగా నిర్వహించుటలోనే నిమగ్నయయి యున్నదను నంశము మఱువఁగూడదు.

యయాతిచరిత్రమను పేరేకాని యయాతి దేవయానిని శర్మిష్ఠను వివాహమయి వారియందు సంతానము కనువఱకే యిందు గ్రథితము. యయాతి శృంగార జీవితమును మాత్రమే తెలగన స్వీకరించుట ప్రబంధయుగము వారి యభినివేశమునకుఁ దగినట్లేయున్నది. శుద్ధాంధ్రమునందుఁ గావ్యనిర్మాణమునకుఁ జాలినంత పదజాలము లేక పోవుటచే నితఁడు తద్భవములపై నెక్కువ యాధారపడెను.

'తెనుఁగుననను మాఱు పేళ్ళిడి
పెనచిన వినఁగూడదనుచు బిరుదులు బేళ్లున్
మును వేల్పుబాస వెంబడి
ననిచెదఁ గాదనకుఁడయ్య యుల్లమునందున్.'

అని సంజ్ఞానామవాచకములను బిరుదులను దత్సమములనే యుంచెను. తిమ్మకవ్యాదులును నితని యొరవడినే పేళ్ళను దత్సమములుగానే యుంచుచు వచ్చిరి.

తెలగన యచ్చతెనుఁగుఁగూర్పులు చమత్కారముగ నుండును. తెలిగంటిదొర, ఎక్కటి రాచందమామ; కనువినుకలి నెలవు పుట్టువు (కనువినుకలి=చక్షుశ్శ్రవము పాము; దాని నెలవు=పుట్ట; అది పుట్టువు=జన్మస్థానము గాఁగలవాఁడు వాల్మీకి) మొదలగునవి యిందు కుదా

హరణములు. ఇతనివలెనే కూచిమంచి తిమ్మకవి మున్నగువారును అచ్చతెనుఁగుఁ గూర్పులను బొనరించిరి. చిచ్చఱకంటి దొరకంటి పేరింటి పేరులు=రుద్రాక్షమాలలు; బంతితేరుల పంటవలంతితేని కొడుకు=దాశరథి.

తెలగనార్యుని పద్యములో కప్పు డచ్చతెనుఁగునఁ జెప్పుచున్నాడను విషయమును మఱపించునంత ధారాధోరణీభాసురములయి యుండును.

"పలపలనై మ్రాగినపడి పండ్లు చూపెడు
పుడుకుఁజెట్లను వేఁడఁబోవనేల
మించు చూపుచునె నమ్మించి నిల్కడయేది
విసమెసంగెడు మబ్బుఁ గోసరనేల
ఒలిహోయి యీ లేక యొక పూఁట వెట్టెడు
తామర చెలిపట్టిఁ దడవనేల
పొరలంగఁబడుచుఁ దాఁ దెర మఱుఁగుననుండి
కసరెడు మున్నీటిఁ గోసరనేల
తెలివి గురికొల్పి నిచ్చలు పలుకుఁ దియ్యఁ
దనము గాన్పింప నోసఁగెడు దారిచేత
మిగులఁ బొలుపొందునట్టి యమీను ఖాన
యొడయఁ డొప్పుల కుప్పయై యొనరుచుండ

యయాతిచరిత్రమైదాశ్వాసముల కబ్బము. ఇందు మొత్తము 735 పద్దియములు కూర్పఁబడినవి. వర్ణనము లొనర్చుటయందితని కభిరుచి మెండు. యయాతి వేఁట వర్ణనము మనుచరిత్రములోని వేఁట వర్ణనమువలె సుదీర్ఘముగా నున్నది. యయాతి వేఁట కరిగి జాబాలి యాశ్రమమును జేరి యతని వలన రామకథను వినినట్లు సందర్భపఱిచి దాదాపొక యాశ్వాసము నింపెను. (2వ యాశ్వాసము సగమునుండి

శివ యాశ్వాసము సగమువఱకు) మఱియునిందు ఋతువర్ణనలు, జల క్రీడాదివర్ణనలునున్నవి.

సన్నివేశ కల్పనములోఁ గాని పాత్రపోషణములోఁ గాని యీ ప్రబంధమున నంత నేర్పు కానరాదు. వృషపర్వుఁడు, శుక్రుని "ఏడసీమ కొలమింటం జూడము ముంగుఱులు గూడుచుం గొనబున నిట్టిడేటి కట్టు దప్పిన చేడియ, నీకనైనఁ బెండ్లి సేయం దగదే" యనియడుగుటయుఁ గచుని శాపమువలన నిట్లు జరిగినదని శుక్రుఁడన నతఁడెవఁడని యీ రాక్షసరాజడుగుటయు నంతయుచితముగాఁ బొందుపడినట్లు తోఁపవు.

ఇందు వచ్చిన యెఱుకులు యయాతి కాలమువారయినను వారి పాత్ర చిత్రణలోఁ గవి దేశకాలములను మఱచినట్లు కన్పించును.

‘కొండమల్లయ్య చేనుండు నందురుగాని
జింకను గాన మేవంకనైన
అలఁగంబమయ్య తానైనదేమో కాని
సింగ మొక్కటియైన సెలల లేదు' అని యెఱుకులు యయాతితో ననిరఁట. ఎఱుకతలు యయాతిని జూచి ‘రాజు కాఁడన్న కంబము రాయఁ’ డనియనుకొనిరఁట. కంబమయ్య, కాటేడు, మల్లయ్య యాంధ్రదేశీయులకే పరిచితులు. నీలాపరిణయమున "గొప్ప చింబోతు కదుపులఁ గూర్చి నీకుఁ గావు వెట్టింతుఁ జుమ్మి మోగంగనమ్మ’ యని తెలుఁగువారి గంగానమ్మ ప్రత్యక్షమయినది. కథాగతికి భంగము కలిగింప నప్పుడిట్టి వుపేక్ష్యములు. రఘునాథనాయకుఁడు దశరథుని కొలువున రెడ్లుండినట్లు చెప్పియున్నాఁడు. తమకుఁ దెలియకుండఁగనే దేశకాలములు కవులపైఁ దమ తాతాచార్యుల ముద్ర నిట్లు వేయుచుండును.

నన్నయగారి యాయాత్యుపాఖ్యానముఛాయ లిందుఁ బొడ కట్టును. ‘శర్మిష్ఠ రాచకూఁతురు కొండుకయది దానితోడిదేమి రమ్మ

నిన'నను నన్నయరచన

"కొమ్మ శర్మిష్ఠ తా రాచకూఁతురగుట
నెఱుఁగ కీలాగు నిచ్చోట నెగ్గొనర్చి
తప్పు చేసిన నది నీకుఁ దడవగుని
కొండికయుఁగాదె యదియు నట్లుండ నిను" మను పద్యమునఁ

బ్రతిబింబించినది. "రాజు మగఁడైన వెనుకను గాజుఁ గడియనున్న సామెత నిక్కంబెయయ్యెమాకు" "విదియనాఁడేరుపడకున్నఁ దదియ నాఁడు కానఁబడియెడు పనికింత కసలనేల?" "ఔర యవ్వింటికి నబ్బులల్లి బలువింటికిఁ గలదియేమి కల్గెనో?" మున్నగు తెలుఁగు నుడికారములు సామెతలు వచ్చుటచ్చుటఁ జమత్కృతి జనకములుగా నున్నవి.

"కంబమయ్య రామేలు గలిగించు నీకొక్క
గరుటాలమంతుని గానుకిత్తుఁ
గాట్రేడ మెకముల కడుపురాఁ జేయుమీ
జింక నొక్కటి నీకుఁ జేతికిత్తు
యనుచుఁ దమ వేలుపులనెల్ల మును దలంచి
వేఁడుకొని మ్రొక్కి వాకట్టు వేళ్లు గొనుచు
వలను లెస్సైన మిక్కిలి నలరుకొనుచు
వచ్చి మెఱుకులు వేఁటాడఁ జొచ్చిరపుడు"

మున్నగునవి కవియొక్క లోకజ్ఞతను వెల్లడించును. కాని "క్వాకార్యం శశలక్ష్మణః క్వచకులం ..." వంటి భావశబలత యిందు మచ్చునకైనఁ గానరాదు.

పదుమూడవ శతాబ్దమున 'ఆండయ్య' యనుకవి యచ్చుకన్నడమున 'కబ్బిగర కావ' యను కావ్యమును రచించెను. అటు పిమ్మట నెవరును నచ్చుకన్నడ కావ్యములను వెలయింపలేదు. తెనుఁగున నట్లు

కాక తెలగనార్యుని యయాతి చరిత్రము తరువాత నెన్నియో యచ్చ తెనుఁగుఁ గావ్యములు వెడలుచునేయుండుట గమనార్హము.

"వ్రాసిన ప్రాతకావ్యముల ఫక్కిని బోలఁగ నెన్నికావ్యముల్
వ్రాసిననేమి ? నూత్నమగు పద్ధతి నొక్కటి వ్రాయునంత నా
చేసినదొక్క- భూషణవిశేషముగాఁ దనరారుచున్నదై
బాసను వన్నెకెక్కు-విధిఁ బాల్పడఁజేయక యూరకుండునే"

అను శ్రీగంటి జోగిసోమయాజిగారి సూక్తి యయాతి చరిత్రము నకు యథాక్షరముగా నన్వయించుచున్నది. ఆంధ్రసాహితీయువతి కొక యపూర్వాలంకారమును గూర్చి పొన్నిగంటి తెలగనార్యుఁడు తెలుఁగు వారికిఁ జిరస్మరణీయుఁడయినాఁడు.

శ్రీనాథుని జన్మస్థల మేది ?

చిలుకూరి పాపయ్యశాస్త్రి

శ్రీనాథుని జన్మస్థల మేది ? యనునది చరిత్ర పరిశోధకుల దృష్టిలోఁ బడినది మొదలు నేటివఱకుఁ జర్చనీయాంశముగనే నిలిచి పోవుచువచ్చినది. ఆతనిరచనలో నిక్షిప్తమైయున్న చారిత్రకసామగ్రి మఱి యే యితర కవిరచనలోను మనకుఁ గానరాదు. అట్లయినను నాతనికి సంబధించిన చరిత్రాంశము లన్నియు వివాద గ్రస్తములు గనే నిలిచిపోవుచున్నవి. శ్రీనాథుని జన్మస్థల మేది ? యను విషయ మునఁ జాలకాలము నుండియుఁ దల కొకసిద్ధాంతము బయలుదేరు చునేయున్నది. ఎవ్వరేని యేదేని నిర్ణయము చేసినను దానికిమూలము భీమేశ్వరపురాణములోని వాక్యములే. ఆ వాక్యముల సమన్వయ విష యమునందే మతభేదము లేర్పడుచున్నవి. ఆ సమన్వయవిషయమున కేవల చారిత్రకదృష్టి సంగీకరించువారు కొందఱు, చరిత్రను పారస్వ తమును రెండిటిని జోడించి పరికించువారు కొందఱు, కేవలము ప్రాంతీయాభిమానమును బాటించువారు మఱికొందఱు.

ముందుగ భీమేశ్వరపురాణమునందలి వాక్యములను జేకొని వానిపై నాకుఁ బొడకట్టిన యూహలను వివరింతును. శ్రీనాథుఁ డీ భీమేశ్వరపురాణకృత్యారంభమున తొమ్మిది పద్యములతో వివిధ దేవతలకు, వెనుకటిసంస్కృతకవులకు నుతులర్పించి ఆ వెనుకఁ దెలుఁగు కవులలో నన్నయ తిక్కనలకు నమస్కృతులుచేసి, శంభు దాసునకు బదులుగఁ దన పితామహుఁడైన కమలనాభామాత్యు నీ క్రిందివిధముగఁ గొలిచినాఁడు.

కనకక్ష్మాధరధీరు వారిధితటీకాల్పట్టణాధీశ్వరున్
ఘనునిం బద్మపురాణసంగ్రహకథాకావ్యప్రబంధాధిపున్
వినమత్కాకతిసార్వభౌముఁ గవితావిద్యాధరుం గొల్తు మా
యనుగుందాతఁ బ్రిదాత శ్రీకమలనాభామాత్య చూడామణిన్

భీమ. 1-10.

శ్రీనాథుని తండ్రి మారయామాత్యుఁడు. తాత కమలనాభామాత్యుఁడు. ఈతఁడు మేరుపర్వత మంతటి ధీరుఁడు. సముద్రపు టొడ్డునందున్న కాల్పట్టణమునకు ప్రభువు. గొప్పవాఁడు. పద్మపురాణసంగ్రహ కథ యనుప్రబంధమును గూర్చినవాఁడు. కాకతి సార్వభౌముఁ డైన ప్రతాపరుద్రుని వినతులను పొందినవాఁడు. కవితావిద్యను దాల్చినవాఁడు. శ్రీనాథునియెడఁ బ్రీతిగల పితామహుఁడు. గొప్పదాత, యని యీ పద్యమునుబట్టి తెలియుచున్నది. దీనిని బట్టియే శ్రీనాథుని జన్మస్థలమును నిర్ణయింపవలయును. అందును 'వారిధితటీ కాల్పట్టణ' మేదియో నిర్ణీతమయిన, శ్రీనాథునిజన్మస్థలము నిర్ణీతమగును. కావున విమర్శకులు వారి వారి యభిమతమును బట్టి యీ కాల్పట్టణమును వెనుక ముందులకు నెట్టుకొని పోవుచున్నారు.

నెల్లూరు ప్రాంత మావాసముగాఁగల విమర్శకులు శ్రీనాథుని నెల్లూరు మండలమునందే పుట్టి పెరిగినవానినిగఁ జేసి, పంటరెడ్డివంశ సంజాతులతోపాటు కొండవీటికిఁ గొనివచ్చుటకు విశేషాదరమును జూపుచున్నారు. తన్మూలమున కృష్ణాపురమును వారిధితటీ కాల్పట్టణముగా నిరూపించుచున్నారు. నెల్లూరునకు సమీపమునందున్న కృష్ణాపురమే కాల్పట్టణమనుటకు, ఈనాఁడు చూచుటకైన లభింపని యొక శాసనవాక్యమును, కాల్పట్టణ మని మార్చుకొనుట కనువైన తమిళ శాసనవాక్యములను ప్రమాణముగఁ దెలుపుచున్నారు. ఇంతే కాక, ఈ కాల్పట్టణము నెల్లూరుప్రాంతములోనిదే యనుటను బలపఱుచుటకై, బెండపూఁడి అన్నామాత్యునిచే ననిపించిన "పాకనా టింటివాఁడవు బాంధవుఁడవు" అను వాక్యమును జోడించి, పాకనాటిలో ఇల్లు గలవాఁడ వని యర్థమును జెప్పి, పాకనాఁ డనునది ప్రధానముగ నెల్లూరుమండలములోనిదే కావున శ్రీనాథుఁడు కృష్ణాపురము వాఁడే యనుచున్నారు. ఏతన్మూలముగ శ్రీనాథుని వంశము వారికి పాకనాఁ

ములో నిల్లుగలదని గూడఁ దెలుపుచున్నారు. ఇల్లు వాకిలి లేని దేశ ద్రిమ్మరిగా నూహింపఁబడుచున్న శ్రీనాథునకుఁ బాకనాఁడులో నిల్లుండిన ట్లూహించుట మంచిదియే.

కాని కృష్ణాపురమే కాల్పట్టణ మని యాతఁ డనుకొన్నచో "వారిధితటీ కృష్ణాపురాధీశ్వరున్" అని ప్రక్క కూర్చియుండెడివాఁడు. యతిస్థానములో కాల్పట్టణము పడినది గనుకనే, పద్య ప్రారంభము "కనకక్ష్మాధరధీరుక్'' కావలసి వచ్చినది. కాల్పట్టణశబ్దమును ముందుగనే తెలుఁగును సంస్కృతము చేసి, ఆ వెనుకనే వారిధితటీ యను సంస్కృతసమాసపదముతోఁ గలిపి, ఏకసమాసముచేసి, పద్యమును నడిపించినాఁడు. ఈ పద్యములోనే కమలనాభామాత్యుని 'వినమత్కాకతిసార్వభౌము'ని జేసిపెట్టినాఁడు. శ్రీనాథుని తాతకు కాకతి సార్వభౌముఁడు వినతుఁడగుటకు మూల మేమో ? కొంచెము పరికింతము. అరిమేఁటి అన్నమంత్రికి మనుమఁడైన అన్నమంత్రి శ్రీనాథునిప్రాభవమును వర్ణించుచు, 'పాకనాఁటింటివాఁడవు, బాంధవుఁడవు, కమలనాభునిపౌత్త్రుఁడ, వమలమతివి' అనుచున్నాఁడు. దీనిని బట్టి బెండపూఁడి అన్నమంత్రికి శ్రీనాథునితో పాకనాటి నియోగి శాఖకు సంబంధించిన బాంధవము, ఇరువుర తండ్రి తాతల నాఁటి నుండియుఁ గలదని యూహింపవలసియున్నది. పాకనాఁ టింటివాఁడవు- అను పదమునకు పాకనాటి నియోగిశాఖకుఁ జెందినవాఁడవను నర్థమే వచ్చును గాని మఱియొకటి రాఁజాల దనుకొందును.

బెండపూఁడి అన్నమంత్రి తాతయగు అన్నమంత్రి నాఁటినుండియే వారు ఆ రేటి లేక అరిమేటివా రయినట్లును, తాతయగు అన్నమంత్రి ప్రతాపరుద్రుని రాజ్యమునందు స్థాపించుటలో ప్రధానపాత్రి వహించి యుండె ననియు, నీ భీమేశ్వరపురాణమే చెప్పుచున్నది.

కాకతిక్ష్మాపాల గంధ దంతావళ
ధ్వజినీ మహాధురంధరు డనఁగ
నవలక్షకోదండనాథ రాజ్యాంభోధి
సంపూర్ణ పూర్ణిమాచంద్రుఁ డనఁగ
నంధ్రభూమండలాధ్యక్ష సింహాసన
సంప్రతిష్ఠాపనాచార్యుఁ డనఁగ
వీరరుద్రావేమవిశ్వంభ రాధీశ
పృథులదక్షిణభుజాపీఠ మనఁగ
యవనసంహారవిలయకాలాగ్ని యనఁగ
ధాటీవిఘటితకుమ్మ్రోద్యానుఁ డనఁగ
విశ్వలోకప్రశస్తుఁడై వినుతికెక్కె
నతులబలసీరి పోలయ యన్నశౌరి.

పోలయమంత్రి కుమారుఁడైన అన్నమంత్రి, కాకతి ప్రభువునకు గజసైన్యాధ్యక్షుఁడు, తొమ్మిదిలక్షల ధనుర్ధరుల రాజ్యమను సముద్రమునకు పూర్ణిమనాఁటిచంద్రుఁడు, ఆంధ్రభూమండల ప్రభువును సింహాసనము నెక్కించుటలో ఆచార్యుఁడైనవాఁడు, ప్రతాపరుద్రచక్రవర్తికి కుడిభుజమైనవాఁడు, యవనులను సంహరించుటలో ప్రళయకాలాగ్నియైనవాఁడు, సాటిలేనిబలమునందు బలరాముఁడని ప్రసిద్ధికెక్కినవాఁడు, లోకమందంతటను పేరెక్కినవాఁడని యీపద్యమునకు భావము. ప్రతాపరుద్రునకు ప్రధానసేనానిగానుండి, ఆ ప్రభువును కాకతీయసామ్రాజ్యపదవీసింహాసనమందు నిలుపుటలో ప్రధానపాత్ర వహించి, వానికిఁ గుడిభుజముగా నుండిన అన్నమంత్రియే, ఆనాఁడు పద్మపురాణసంగ్రహకథాకావ్యరచయితయై, యుత్తమకవిగానుండిన కమలనాభామాత్యునకు కాకతిప్రభువును వినతునిగాఁ జేసి, ఈ కవికి కాల్పట్టణాధీశ్వరత్వమును గూడ లభింపఁజేసి యుండు

నని మన మూహింపవచ్చును. ప్రభుత్వమునకు సరిపడిన కాల్పట్టణము సముద్రతీరము నంటియున్నది, గోస్తనీనదీసాగరసంగమస్థలమునం దున్న కాలీపట్టణమే యగును. ఈ కాలీపట్టణము కొలని రుద్రదేవుని వలన అన్నమంత్రి అగ్రహారముగాఁ దీసికొన్న అరేఁడు (నేఁటిఆరేఁడు) నకు ఆఱుక్రోసుల మేరలోనున్నది. అన్నమంత్రికి అరేఁడు అగ్రహారముగా వచ్చినవిధ మీగా భీమేశ్వరపురాణమునందే వర్ణిత మైనది.

కొలనుప్రతాపరుద్రనృపకుంజరుచే నరేఁడు సారణీ
సలిలవివర్ధమాన బహుసస్యసమాకుల మగ్రహారమై
వెలయ విభాకరగ్రహణవేళఁ దగంగఁ బరిగ్రహించి బం
ధుల భరియించె నన్నవిభుతో సరియెట్లు ప్రధాను లెవ్వరున్.

కొలనుప్రతాపరుద్రుఁ డనఁగా ఇందులూరి రుద్రుఁడు. వీరివంశస్థులు కాకతీయరుద్రుని కాలమునుండియు, వారికి సేనాధిపతులు అమాత్యులునై యుండి వారికి రాజకీయములలోఁ జేదోడు వాదోడుగ నుండి, కొలను (కొల్లేరు) ప్రాంతమును జయించి, దానిని కాకతీయ సామ్రాజ్యమునకుఁ జేర్చి, ఆప్రాంతమును దాము సామంత మాండలికులుగాఁ బాలించుచుండినట్లు కొలని గణపతిదేవుఁడు రచించిన శివయోగ సార మను గ్రంథమునుబట్టి తెలియుచున్నది. ఆవంశములో రెండవప్రతాప రుద్రుని సమయమున కొలను (కొల్లేరు) పాలించు రుద్రుఁడే కొలను ప్రతాపరుద్రుఁడు. ఆతనినుండి, బెండపూఁడి అన్నమంత్రి పితామహుఁడైన అన్నమంత్రి అరేఁడు-ఈనాఁడు-ఆరేఁడు-అనఁబడు గ్రామమును సూర్యగ్రహణ సమయమున అగ్రహారముగా పరిగ్రహించి, తనబంధువులను పోషించె నని యీ పద్యము తెలుపుచున్నది. ఈ అరేఁడు-కొలను-కొల్లేరునకు సమీపమునం దున్నది. దీని నీనాఁడు ఆరేఁడగ్రహారమని యందురు ఇది పయ్యేరు ఒడ్డున నున్నది, వరిధాన్యము విశేషముగఁ బండు తావిది. ఇది పద్మినీపుర మని వెనుకటి శాసనములలోఁ

చేర్కొనఁబడి, యీనాఁడు "జల్లిసీమ గణపవర" మని వ్యవహరింపఁబడు గ్రామమునకు గోసు మీఁదను, "వుండి" యను గ్రామమునకు మూఁడు క్రోసులు క్రిందను నున్నది. ఆ రేఁడు అగ్రహారములోఁ బూర్వమునుండియు నివసించుచున్న వారందఱు నియోగి బ్రాహ్మణులే. వారిలో ఆ రేటి యింటిపేరు గలవారు నేఁటికిని గలరు. వీరికి బంధువులుగా క్రొవ్విడివారు కూడ నచటనే గలరు.

కాలీపట్నములోను వెనుకటి కాలములో నియోగిబ్రాహ్మణులే యుండెడివారు. వారి యింటిపేళ్ళు కాలీపట్నంవారు, క్రొవ్విడివారును. తొలుత కమలనాభామాత్యునకు ఆ రేటి అన్నమంత్రితో బాంధవ్య మేర్పడి యుండును. అన్నమంత్రి వంశమువారు కూడ పాకనాఁటి నియోగులని మన మూహింపవచ్చును. అన్నమంత్రి కుమారుఁడయిన తల్లమంత్రిని గూర్చి యీ భీమేశ్వర పురాణమునందీ క్రింది వర్ణనము గలదు.

పన్నీట గంధజలమున
నన్నయ తల్లప్రధానుఁ డభిషేకింపన్
గన్నప పుక్కిటి జలమునఁ
గన్నయకోఁచకము వాయుఁ గఱకంఠునకున్.

తల్లమంత్రికి సోదరుఁడైన దేవమంత్రికి రామాంబకు దాక్షారామ భీమేశ్వరుని కృపవలన లింగనాదులు జన్మించిరని తెలుపు సందర్భమునందే యీ తల్లప్రధాని కాళహస్తీశ్వర భక్తుడని ప్రత్యేకముగఁ జెప్పుటచే, బెండపూడి అన్నామాత్యుని పూర్వులు పాకనాఁటి నుండి ఆరేడునకు వచ్చిరని మన మూహింపవలసియున్నది. మఱియు దేవమంత్రికి సోదరుఁడు తల్లప్రధాని యని, ఆతనిఁగూర్చిన ప్రత్యేకత, కాళహస్తీశ్వరునకు సుగంధజలములతో నభిషేకించుట యని తెలుపుటచే నాతనికి అనుశ్రుతమైన కాళహస్తీశ్వరభక్తి కల దనుకొనినచో,

నీవంశములోనివారు పూర్వము పాకనాఁటిలోనుండినవారై, తరువాత ఆ రేటివారై రనుట నిశ్చయము. అన్నమంత్రి అ రేఁడు వగ్రహారముగా బొందిన వెనుకనే, పాకనాఁటి నుండియే తనకు బంధువైన కమలనాభామాత్యుని రావించి, కాకతీయ ప్రతాపరుద్రుని మన్ననకుఁ బాత్రునిగాఁజేసి, కాలీపట్టణమున కధీశ్వరునిగఁజేసియుండును. కాలీపట్టణము అనునది మూఁడువందల యేండ్లక్రిందటి వఱకు నొకముఖాసా గ్రామముగ నుండెనని తెలియవచ్చినది. సముద్రతీరమునకు కాలీపట్టణమునకు సమీపమునందే యున్న మొగలుతుఱ్ఱు సంస్థానమునకుఁజెందినదీ గ్రామము. క్రీ. శ. 1760 ప్రాంతమున మొగలుతుఱ్ఱు రాజుల ప్రాపున నైజాము ప్రభువులతో పరిచయము సంపాదించి, దుబాసీగానుండి, కోస్తా జిల్లాలను నైజాము ప్రభుత్వమునుండి ఈస్టిండియా కంపెనీవారికి కౌలున కిప్పించిన, కాండ్రేగుల జోగిపంతులు అనువారికి ఈ కాలీపట్నం ముఖాసా సంక్రమించినది. ఇది నాలుగు చదరపు మైళ్ళ పరిమితిగల గ్రామము. వినుకొండ వల్లభామాత్య వంశమువారికి గ్రామగ్రాసములతో మోపూ రెట్లు అధికారగ్రామముగా సంక్రమించినదో, కాలీ పట్టణాధీశ్వరత్వము కమలనాభామాత్యున కట్లె సంక్రమించె ననుకొనవచ్చును.

శ్రీనాథునకు బాల్యమునుండియు శివభక్తితత్పరత గల దనుట నిర్వివాదమైన విషయము. అట్టి శివభక్తి తత్పరత యేర్పడుటకుఁ బరిసగమం దుండెడి దివ్యస్థలములు చాలవఱకుఁ గారణములు గాకమానవు. గోస్తనీ నదీసాగరసంగమ స్థలమునందున్న యీ గ్రామమునకీ పేరు, అది కాలీదేవికి సంబంధించిన రేవుపట్టణమగుటచేతనే యేర్పడినది. ఈ గ్రామమున కుత్తరపు సరిహద్దులో నుండిన 'వెంప' యను గ్రామమున సోమేశ్వరుఁడు కలఁడు. "వెంప దేవునకు గంపెడుపూలు" అనే సామెత యొకటి గలదు. అది కాలీపట్నం చెఱువునుండి కలువలు

దెచ్చి గంపలతో పూజచేసే పరిపాటి యీనాఁటికిని గలదు. ఈ సామెతయే మఱియొక విధముగాఁ గూడ వినఁబడుచున్నది. కాలీపట్నం పట్టి (మైదానము) పండితే వెంపదేవునకు గంపెడు పూలు అనునది. ఈ సామెతను బట్టి వెంపకు కాలీపట్టణమునకు సన్నిహిత సంబంధ ముండినట్లు తెలియుచునే యున్నది.

వెంప గోస్తనీ నదీతీరము నంటియున్న ప్రసిద్ధమైన శివక్షేత్రములలో నొకటి. అచట వేణుగోపాలస్వామి యాలయము కూడ నొకప్పు డుండి, సముద్రపుటుప్పెనకు పూడిపోయి, కొంత కాలమునకు ఆ స్వామి విగ్రహము బైటపడఁగా, ఆ యాలయపు పీఠమును గూడ గుర్తించి బైటఁబెట్టి, ఆలయమును గట్టించి, వేణుగోపాలస్వామిని పునః ప్రతిష్ఠ గావించినట్లు తెలియవచ్చినది. వెంపకు కాలీపట్నమునకు నడుమనుండెడి మైదానమును త్రవ్వినపుడు పెద్దదయిన కాలీ విగ్రహము గూడ బయటికి వచ్చి, అదికూడ వెంపలోనే యుండినట్లును వినవచ్చినది. ఈ కాలీవిగ్రహముతో సంబద్ధమైన రేవుపట్టణ మగుట చేతనే కాలీపట్టణమను పేరేర్పడె ననుట నిశ్చితమైన విషయము. ఆ పరిసర మంతయు ప్రసిద్ధమైన శివక్షేత్రములతోఁ గూడియేయున్నది.

కాలీపట్టణమునకు పంచారామములలో ప్రసిద్ధమయిన క్షీరారామము (పాలకొలను) ఒకవైపునను, సోమారామము (గుణపూఁడి భీమవరము) ఇంకొక వైపునను గలదు. మఱియు సోమారామమునకు క్రింద రెండు క్రోసులలో ఎనమదుర్రు-అను గ్రామము గలదు. అదియు గోస్తనీ నదీతీరమునందే గలదు. అచటి యీశ్వరుఁడు శక్తీశ్వరుఁడు. శక్తివిగ్రహము ఈశ్వర లింగము నేకపీఠమునందే యున్నవి. దీనికి యమునాపుర మనుపేరు పూర్వ మున్నట్లు వినవచ్చినది. అచట శక్తీశ్వరుఁడు యమ ప్రతిష్ఠితుఁడు. శక్తి కాలీశక్తియేయని యందురు. ఈ యనమదుర్రు మొదలు కాలీపట్టణమువఱకు నడుమనుండెడి ప్రదే

శము చాల కాలము క్రిందటివఱకు మైదానముగనే యుండెడిది. కాలీపట్టణ మగుటచే కాల్పట్టణమను పేరు వచ్చియుండిన నుండవచ్చును. వెనుక సమీపమునందు శివదేవుని చిక్కాల యను గ్రామము గలదు. అదియుఁ బ్రసిద్ధమైన శివక్షేత్రమే. గోస్తనీ నదీ తీరప్రదేశ మంతయు ప్రసిద్ధమైన శివక్షేత్రములతోఁ గూడి యున్న దనుట సుప్రసిద్ధమైనవిషయము. గోస్తనీనదీమాహాత్మ్యము స్కాంద పురాణాంతర్గతమై యుండుట, ఆ తీరమున వాసుకి రవిసోమేశ్వరుఁ డను ప్రసిద్ధమైన శివమూర్తి వెలయుట, ఆపరిసర మంతయు శివభక్తి ప్రాదుర్భావమునకు నిలయమని యూహింపవచ్చును. శ్రీనాథునిజన్మ స్థలము గోస్తనీనదీతీరస్థితమైన కాలీపట్టణమే యనుటకు నొక గట్టి నిదర్శన మీ భీమేశ్వర పురాణమునందే కానవచ్చుచున్నది. పంచా రామముల యుత్పత్తినిగూర్చి తెలిపినప్రకరణములో, గోస్తనీనదీతీర స్థితమైన సోమారామమును వివరించిన తీరు, ఆ పరిసరములోఁ బుట్టి పెరిగినవానికిఁగాని నిరూపింపరానిది. ఆ క్రమ మిట్లుసాగినది.

"గౌతమీతీరంబున దక్షిణకూలంబున గుణపూఁడి యను గ్రామంబున సోమునిచేతఁ బ్రతిష్ఠితంబగుటంజేసి సోమలింగం బనఁ బ్రఖ్యాతంబైన సోమారామంబును"

సోమారామము అనఁగా గౌతమీనదీతీరమునకు దక్షిణదిశ నుండిన వసిష్ఠానది యొడ్డునకుఁ జేరిన గుణపూఁడి, అచట సోమప్రతిష్ఠితమైన సోమేశ్వరలింగము గలదు. దీనికి దగ్గఱనే భీమేశ్వరలింగ ముండుటచే ఆ సమీపమునందున్న గ్రామమునకు భీమవరమని వ్యవహారము. ఈ రెండింటిని గలిపి గుణుపూడి భీమవరమని యందురు. గుణపూఁడికి సోమారామ మని పేరుండినట్లు శ్రీనాథుని యీ వాక్యముల వలననే తెలియవలెను. గుణపూఁడిలో సోమేశ్వరుఁడే ప్రధానదేవతయని తెలి

సినవారు కొందఱున్నను ఆతావునకు సోమారామమని వ్యవహారము గలదని తెలిసినవారు చాలతక్కువ. వెనుకటి శాసనములలో కొన్ని టిలో దానికి దాక్షారామమని పేరున్నట్లు పేర్కొనఁబడినది. శ్రీనాథుఁ డాప్రాంతముననే పుట్టిపెరుగకుండినచో నీ సోమారామము నింత విస్పష్టముగఁ దెలుపఁజాలఁడనియే యనుకొనవచ్చును.

ఇంతేగాదు ఈ భీమేశ్వరపురాణమునందే భీమమండలాంతర్గతతీర్థక్షేత్రములను వర్ణించిన తీరునుబట్టి చూచినను, భీమమండలితో సన్నిహితసంబంధ మున్నవాఁడు గాని యథాతథముగ వివరింపఁజాలని విషయము లెన్నియో గానవచ్చుచున్నది. మఱియొక్క మాట. ఈ భీమేశ్వరపురాణములో నాతఁడు గ్రామనామములను పేర్కొనునపుడు హ్రస్వదీర్ఘాది వ్యత్యాసములు కొలఁదిగఁ జేసినట్లే కనఁబడుచున్నదిగాని పెద్దగ వ్యత్యాసములు చేసినట్లులేదు. 'గండ్రేడు' అనఁబడుదానిని గండ్రెడు చేసినాఁడు ఆ పేరును వృత్తములో సరిపెట్టుటకే. పీఠికాపురమును పీఠాపురము చేసినది వృత్తము కుదిరికకే. పలివెలపురమును పల్వెల పురమును జేసినది వృత్తసౌలభ్యమునకే. కావున భీమేశ్వర పురాణములో నిబంధించిన "కాల్పట్టణము" అను పదము కాలీపట్టణమునకు వృత్తసౌలభ్యమునకై ఈ కారలోపము కావించిన రూపమని, తన్మూలమున శ్రీనాథునిజన్మస్థలము కృష్ణగోదావరీ మండలాంతర్గతమైన కాలీపట్టణమే యనుకొనుట యుక్తమని నా మనవి. అంతియగాని నెల్లూరు మండలమునకుఁ జెందిన వానిగఁ జేయుటకై కృష్ణాపురమును కాల్పట్టణముగ శ్రీనాథుఁడు ప్రయోగించి యుండుననుట సరికాదనియు నా మనవి.

శ్రీనాథుఁడు భీమమండలమునం దున్న యడుగడుగును నీభీమేశ్వరపురాణములోఁ దీర్చిదిద్ది చూపెట్టినాఁడు. ఆ బాల్యమునుండి భీమ

మండలముతోఁ బరిచయము లేనివానికిఁ దెలుపరాని విషయము లెన్నియో యందుగలవు. ఈతఁడు పినాకినీ నదీతీరమందు పుట్టి పెరిగి యున్నచో నింతటి శివభక్తిభావ నాతని కేర్పడుట కా పరిసరమం దింతటి దివ్యతీర్థక్షేత్రములు లేవు. సన్నిహితముగ కాళహస్తీశ్వరుఁడు గలఁడుగదా! యని యందురేమో ? అతఁడు కాళహస్తీశ్వర భక్తుఁడే యైనచో, శ్రీకాళహస్తిమాహాత్మ్యమును రచించు నవకాశము ధూర్జటికిఁ దక్కకయే యుండెడిది. కృష్ణాపురమే శ్రీనాథునిజన్మస్థలమైనచో నాతఁడు శ్రీకృష్ణభక్తుఁడే కావలసి యుండును. లేక పినాకినీనదీతీరస్థిత సోమశిలాక్షేత్రస్థ సోమేశ్వరభక్తుఁడైనఁ గావలసి యుండును. "పాకనాఁటింటివాఁడవు" అను నొక్కమాటనుబట్టి శ్రీనాథుని పాకనాఁటిలోనే పుట్టిపెరిగిన వానినిగ నిరూపించుటకంటె ఆతఁడు పాకనాఁటి నియోగిశాఖకుఁ జెందినవాఁ డనుకొని, అతని రచనలలోఁ గానవచ్చెడి వాక్య విన్యాసపద్ధతిని, మాండలిక పదముల కూర్పును బరికించి, ఆతని భీమమండలిలోఁ బుట్టిపెరిగిన వానినిగనే భావించుట భావ్యమని నా మనవి.

ఈవఱకు శ్రీనాథుని జన్మస్థలమును గూర్చి నిర్ణయించి పెట్టిన పెద్దలు, అంతకుపూర్వమందున్నవారు కర్ణాకర్ణికగఁ దెలుపుకొనుచు వచ్చినవాక్యములను గొంతవఱకు నూఁతగాఁ గొని, యామీఁదఁ దమకు స్ఫురించిన యుపపత్తులతో నిర్ణయమును జేయుచు వచ్చినారు. అప్పటికన్న మనకిప్పుడు విమర్శనపద్ధతులు క్రొత్తవి పొడకట్టుచున్నవి. ఆ పద్ధతులలో నిష్పాక్షికముగ నిర్ణయము చేయుట భావ్యము. ఒకరన్నది కాదనుట కేవియో కొన్ని యుపపత్తు లెప్పుడును బొడకట్టుచునే యుండును. శ్రీనాథుని స్త్రీలోలునిగా మలచుట కుపపత్తు లెన్ని తోఁచినవో కాదనుటకుఁగూడ నన్ని యుపపత్తులు తోఁచినవి. శ్రీనా

ధుని రచనలు సారస్వత చారిత్రిక విషయములకు సమ్మేళన రూప
ములు. కావునఁ గేవలము చారిత్రికదృష్టితోనే గాక సారస్వత సమ
న్వయదృష్టితో నాతనికి సంబంధించిన విషయములను నిర్ణయించుట
భావ్యమని నా యూహ.

కవి యే మండలమునఁ బుట్టి పెరుగునో, యా మండల మందు
వాడుకలోనుండిన పదజాలము, వాక్యవిన్యాసపద్ధతి తప్పక యాతని
రచనలోఁ బ్రవేశించి తీరును. తిక్కన, నాచన సోమనల రచనలలోఁ
గానవచ్చెడి నెల్లూరుమండలమునకుఁ జెందిన నుడికారపు తీరు, మాండ
లిక పదములు, తిక్కన శిష్యుఁడ నని చెప్పుకొన్న కేతన రచనలోఁ
గానరావు. పోతన భాగవతమునందును, కొఱవి గోపరాజు రచించిన
సింహాసనద్వాత్రింశిక యందును గానవచ్చెడి పదజాలము, వాక్యరచ
నాక్రమము తెలంగాణమునకుఁ జెందినదే గాని యన్యము కానేరదు.
అల్లసాని పెద్దన కవితలో రాయలసీమకు సంబంధించిన తీరే కాన
వచ్చును. ఆయా కవులు తమకు ముందున్న కవుల రచనలలోని విష
యముల ననుకరించుటకు సేకరించుటకుఁ బూనుకొనినను, కవి తా నే
మండలమునఁ బుట్టి పెరుగునో, యా మండలమునకుఁ జెందిన మాండ
లిక పదములు, అచటి జనుల వ్యవహారమునందున్న వాక్య విన్యాస
క్రమము నాతని రచనలో జతఁగూడకమానదు.

ఆ క్రమమున శ్రీనాథుని రచన లన్నిటిలో నాతఁ డుపయో
గించిన మాండలిక పదములు, వాక్యవిన్యాసక్రమము ప్రకరణోచితముగ
నిరూపించిన సంప్రదాయములను బరికించినచో నాతని రచనలలో
గోదావరీ కృష్ణామండలములలో వినవచ్చెడివి కానవచ్చెడివి మాత్రమే
గోచరించును. కన్నడభాషలోఁ గానవచ్చెడి కొన్ని వైరిసమాసము
లున్నవని యాతనిఁ గన్నడ దేశమందు జన్మించినాఁడని గాని, కొండ

పీట పాలనము సాగించిన రెడ్లు పెన్నానదీ తీరమునుండి వచ్చిరి కాన, వారితోపాటే పాకనాటిలోఁ జన్మించిన యాతఁడు రెడ్ల యాస్థానికిఁ జేరె ననుటగాని సరిపడు విషయము కాదని నా మనవి. ఇంతకు శ్రీనాథుఁడు, తనరచనలను గృతియిచ్చినది; రెడ్డిప్రభువయిన వీరభద్రారెడ్డి కొక్కనికేగాని, మిగిలిన కావ్యములన్నిటిని వారి మంత్రులకో తత్సంబద్ధులకో కృతి యిచ్చినాఁడు. మామిడి సింగనమంత్రిప్రాపు లభించిన నాఁడుగాని శ్రీనాథునకు కొండవీటియాస్థానిలో స్థానమే లభింపలేదు. ఈతఁడు పాకనాటిలో పుట్టి పెరిగినవాఁడే యైయుండినచో, అనవేమారెడ్డి సమయములోనో, కుమారగిరిరెడ్డి పాలనమునాఁడో యాతనికి రెడ్లయాస్థానిలో స్థానము లభించియుండెడిది.

మఱియొక్క విషయము- శ్రీనాథుఁడు ధనంజయవిజయ మను కావ్యమును దంతులూరి గన్నభూపాలునకుఁ గృతియిచ్చినట్లు, దంతులూరి బాపరాజ ప్రణీతమైన మూర్తిత్రయోపాఖ్యానమునందలి యీ క్రిందిపద్యమువలనఁ దెలియవచ్చుచున్నది.

అహితదుర్గాధ్యక్షు లందఱు భయమందఁ
    గ్రీడికై వడి నిల్చెఁ దాడినాడ
సత్క్షుద్రదానవవిద్యాత్త్రాత్రములచేతఁ
    బ్రతి యెవ్వరును లేక ప్రతిభఁగాంచెఁ
దనకీర్తి దశదిగంతరగీయమానమై
    గనుపట్ట ధర్మమార్గంబు నెఱపె
శ్రీనాథ సుకవీంద్రుచే ధనంజయవిజ
    యంబను సత్కావ్యమంది వెలసె
నృపతిమాత్రుండె నిజపాదనీరజాత
ఘటితకోటీరవైరిభూకాంతమాన
సాంతరభయాపహారి శ్రీ దంతులూరి
గన్నభూపాలమౌళి దోర్గర్వశాలి.

ఈ మూర్తిత్రయోపాఖ్యానము రచించినది, ఇంచుమించుగ నిప్పటికి రెండు వందల యేండ్ల క్రిందటనే యైనను, దీనిలో నిరూపించిన విషయము నిశ్చితమే యైయుండును. ఈ పద్యములోఁ దెలిపిన క్రమమును బట్టి, దంతులూరి గన్నభూపాలుఁడు తాడినాడలో శత్రుసైన్యాధిపతులు భయపడునట్లు అర్జునునివలె నిలిచి ప్రతాపమును ప్రకటించె నని తెలియవచ్చుచున్నది. శ్రీనాథ కవీంద్రునిచే ధనంజయ విజయమను కావ్యమును కృతినొందె ననికూడ నెఱుఁగ నగుచున్నది. "తాడినాడు" యనునది కృష్ణాజిల్లా కైకలూరు తాలూకాకుఁ జెందినగ్రామము. అచట నీ దంతులూరి గన్నభూపాలుఁడు రాజ్యపాలనము సాగించుచునుండవలయును. ఆతనికి శ్రీనాథుఁడు తన ధనంజయవిజయ కావ్యమును కృతిగా నిచ్చి యుండవలయునని యీ పద్యమును బట్టి తెలియనగును. ధనంజయవిజయ కావ్యమునందలి కథావస్తువు అర్జునుని పాశుపతాస్త్రప్రాప్తియే యగును గదా! దంతులూరి వారిది ధనంజయగోత్రము. కావున శ్రీనాథుఁడు తన తొలుతటి కవితగా ధనంజయవిజయమును వెలయించి తనయావాసమయిన కాలీపట్టణమునకు సన్నిహితముగానుండిన తాడినాడనేలుచున్న గన్నభూపాలునకుఁ గృతి యిచ్చుట సంభావితమగును.

దంతులూరి గన్నభూపాలుని తాత, హరిసీమకృష్ణుఁడు ధరణికోట సామ్రాజ్యమునకుఁ జెందినవాఁడుగ ఈ మూర్తిత్రయోపాఖ్యానమునందలి యీ క్రింది పద్యమును బట్టి తెలియవచ్చుచున్నది.

> కరియించెన్ బహుధాన్యవర్ష మఖిలక్షోణీప్రదేశంబులన్
> హరియించె న్విమతాంధకారములు బాహాత్తాసిసూర్యప్రభన్
> సిరిమించెన్ నృపవర్యులెంచ ఘనుఁడై శ్రీధాన్యవాటీపురీ
> వరసామ్రాజ్య రమాసమాశ్రయమహాసింహాసనాసీనుఁడై.

హరిసీమకృష్ణుఁడు ఘనుఁడై ధాన్యవాటీపురి (ధరణికోట)కి చెందిన శ్రీప్రమయిన సామ్రాజ్యలక్ష్మి నాశ్రయించియున్న గొప్ప సింహాసనము నధిష్ఠించిన వాఁడై, భూమియందంతటను ధాన్యవర్షము కురిపించుచు, ఖడ్గ మనుసూర్యుని కాంతిచే శత్రువు లనునంధకారమును హరించుచు, సంపదతో మించె నని యీపద్యభావము. దీనినిబట్టి దంతులూరివారికి రాజ్యము ధాన్యవాటి (ధరణికోట) సామ్రాజ్యమును చెందినచోటనుండి సింహాసనాధిపత్యముండినట్లు తెలియవచ్చుటచే అది తాడినాడయే కావలయునేమో ? మూర్తిత్రయోపాఖ్యానములోఁ దెలిపిన మొదటి మూఁడు తరముల విషయమునకు నేకవాక్యత కుదుర్చుకొనవలసివచ్చిననాఁడు, శ్రీనాథునిచే ధనంజయవిజయకావ్యమునుకృతిగొన్న దంతులూరి గన్నభూపాలుఁడు తాడినాడకుఁ జెందినవాఁడేయగును. తన్మూలముగ శ్రీనాథుని జన్మస్థలము కృష్ణాగోదావరీ మండలాంతర్గతమైన కాలీపట్టణమే యగును.

పెదకోమటి వేమునికి ధరణికోట పాలకుఁడైన దంతులూరి గన్నభూపాలునికూఁతురు సూరాంబయు దేవిగా నుండినట్లు శాసనవాక్యములనుబట్టి తెలియవచ్చుచున్నది. ఆక్రమమున ఆ గన్నభూపాలుఁడే మూర్తిత్రయోపాఖ్యానమునందుఁ జేర్కొనిన గన్నభూపాలుఁడైనచో, అతఁడును శ్రీనాథునకు సమకాలికుఁడే యగును గాన, అతనికి ధనంజయవిజయకావ్యమును గృతియిచ్చియే యుండవచ్చును. కాని యట్టిప్రబంధ మేమియుఁ గానవచ్చుట లేదు. హరవిలాసము నందలి కిరాతార్జునీయకథయే. అర్జునపాశుపతాస్త్రప్రసిద్ధివఱకుఁగల భాగము ధనంజయవిజయ కావ్యమై, ఆ భాగమే తరువాత కొన్ని మార్పుల

తోను, చేర్పులతోను హారవిలాసకథాసూత్రమునం దాయోజిత మైన దని మన మూహింపవచ్చును. ధనంజయవిజయకథ, తరువాతఁ గూర్చిన ఊర్వశీప్రణయభంగవిషయమును హారవిలాసమునం దాయోజించుటకు ముందే రచించియుండె నని యూహింపనగుచున్నది. పైవిషయపర్యాలోచనముచే శ్రీనాథునిజన్మస్థలము గోస్తనీనదీసాగరసంగమ స్థలమందున్న కాలీపట్టణమే కావలయునని నేను భావించువాఁడను.

తాడినాడ యనునది 'కల్దిండి' అను చరిత్రప్రసిద్ధమయిన యొక నాఁటి చాళుక్యరాజధానికి క్రోశముదూరములో నున్నది. తూర్పు చాళుక్యులలోని రాజరాజనరేంద్రుఁడు రాజమహేంద్రవరము రాజధానిగాఁ బాలించుటకు ముందు 'కల్దిండి' రాజధానిగా నీ ప్రాగ్దేశము చాళుక్యులచేఁ బాలింపఁబడినట్లు శాసనాధారమునుబట్టియే తెలియుచున్నది. ఆక్రమమున, కల్దిండిమీఁదికి శత్రువులదండయాత్ర వచ్చినపుడు దంతులూరి గన్నభూపాలుఁడు కల్దిండి సమీపమునందున్న తాడినాడదగ్గఱ శత్రువులను నిలువరించియుండును. ఈ తాడినాడ కాలీపట్టణమునకు సన్నిహితముగా నుండుటచే శ్రీనాథుఁ డా గన్నభూపాలునకు ధనంజయవిజయ నంకితము చేయుట తన్మూలమున శ్రీనాథుని జన్మస్థలము పైనఁదెలిపిన కాలీపట్టణమే యగుట సర్వథా సంభావిత మగును.

గ్రంథస్వీకారము—సమీక్ష

(శ్రీ బండారు తమ్మయ్య)

(1) శ్రీ రామచరిత మానసామృతము.

కర్త:—తులసీదాస దాసి యను సాంకేతిక నామము గల శ్రీమతి నేలనూతల పార్వతీకృష్ణమూర్తి-మూలపేట, నెల్లూరు. డెమ్మీ పుటలు 405+48- వెల రు. 10-0-0.

ఇది హిందీభాషలో గోస్వామి తులసీదాసు రచించిన సుప్రసిద్ధ రామాయణమునందలి కొన్నికొన్ని రసవత్తర ఖండములను గైకొని, యందఱకు సర్థమగు సులభ శైలిలో రచించిన యాంధ్రానువాదము. మూలమందలి శ్రీ రామభక్తిరస బిందువు జక్కఁగఁ బ్రతిపాదితమగునటు లతి యలతి వాక్యములతో గ్రంథకర్త్రి రచియించియుండుటచేఁ బండితపామరవిభేదము లేక యందఱకును హృదయంగమము కాఁగలదు. రామాయణ మేడుకాండములందలి ఘట్టములను గొన్నిటిని గ్రహించి యిది సప్త సోపానములుగఁ గూర్చఁబడినది. తులసీదాసు పార్వతీ పరమేశ్వర సంవాదరూపముగ శ్రీరామనామ మహిమ నుద్ఘాటించు తలంపుతోఁ దన గ్రంథమునందు సచ్చిదానందమూర్తి యగు శ్రీ రాముఁడే తనకు ధ్యేయుఁడయినట్లు శివుఁడు పార్వతికి బోధించినట్లు వ్రాసియున్నాఁడు. ఇది యధ్యాత్మరామాయణము ననుసరించి తులసీదాసు గ్రహించినవిధానమని చెప్పనవసరము లేదు. ఆదికవులు వాల్మీకి, వ్యాసుఁడు, కాళిదాసు మున్నగువారు శ్రీరాముని శివభక్తునిగానే వర్ణించి యాతఁ డొనర్చిన లింగ ప్రతిష్ఠలను బ్రశంసించి యున్నారు. ధర్మఖండాదు లందు రామ శబ్దము శివపరముగనే నిర్వచింపఁబడినది. శ్రీరాముని శరీరాభిరామతేరముచేఁ గరంబు పేరితుండయి దశరథుఁ డాతనికి జగత్ప్రథచు మంగళంబగు రామనామం బుంచెనని కాళిదాసుఁడు రఘువంశమున వ్రాసియున్నాఁడు. జగజ్జనకులగు నుమామహేశ్వరులు శ్రీరామావతరణమునకు ముందునుండియు నున్న,

సకల సృష్టికర్తలు రామనామోత్కృష్టత్వమున కయి, తులసీదాసు అధ్యాత్మ రామాయణాది వృత్తముల ననుసరించినను, అఖండ మగు శివభక్తిని దానుగూడఁ దనగ్రంథమునఁ బ్రదర్శించియేయున్నాఁడు. వాల్మీకి రామాయణానంతరము వెలసిన యితరగ్రంథము లనేకములు పరిశీలించి యీతఁడు తన కావ్యమున నెన్నెన్నియో క్రొత్త వృత్తాంతములు మనకుఁ దెలిపియున్నాఁడు. శ్రీమతి తులసీదాసదాసి, పార్వతి కృష్ణమూర్తిగారి శ్రీరామచరిత మానసామృత గ్రంథముతో పాటు తత్ప్రశంస పూర్వకముగ గ్రంథారంభమునఁ బ్రకటితములయిన పండితులయభిప్రాయములు, అవతారికలుకూడఁ బాఠకులవశ్యముపఠింపఁ దగియున్నవి. శ్రీ పుట్టపర్తి నారాయణాచార్యులుగారు "ఆశీర్వచనములు" అను పేరితో రచించిన భాగము మఱియు ముఖ్యముగాఁ జదువఁదగినది. తులసీదాసు మూలగ్రంథమందలి గేయములు గూడఁ బలుతావుల నిందు విపులముగా నుదాహృతములయి వాని తాత్పర్యము గ్రంథకర్త్రి సులభశైలితో రచించియుండుట యొకవిశేషము. ఈమె రచనమును గుఱించి శ్రీ నారాయణాచార్యులుగారు వ్రాసిన ఈ క్రింది వాక్యములు పరిశీలింపఁదగినవి.

"ఆమె తెనుఁగు లక్షణముగా నున్నది. పాండిత్య ఆడంబరము లేదు. భక్తియున్నది. మూలమునకు యథాతథముగ నామె యనువదించినది కాదు. కథనుసంకుచితముగఁ జెప్పుచుఁ బోవును. తన కింపుగఁ దోచినచోట ననువదించును. అనువాదములలో నిది యొక పద్ధతి. ఇట్టి రచనములు పాఠకులలో మూలగ్రంథమును జదువవలె నను నాశను రేకెత్తించుచు ఒక కరదీపికగాఁ దోడుపడును"

ఇందుకుదృష్టాంతముగ నీ క్రిందివాక్యములు చిత్తగింపఁదగును.

"అదితి కశ్యపులు పూర్వము ఘోరతపస్సు చేయఁగా నేను వారికివరములిచ్చియుంటిని. కౌసల్యా దశరథరూపములతో నయోధ్య

లో వారు రాజదంపతులుగా జన్మించియున్నారు. వారి గృహమున రఘుకుల శ్రేష్ఠులయిన నలుగురు సుతులుగా నవతరించెదను. నారదుని శాప వచనములు సత్యమగును. నా పరాశక్తి నారీరత్నమై పుట్టును. భూభారమును హరించెదను. ఓ! దేవ బృందములారా ! మీా కభయ మిచ్చుచున్నాను. వెడలిపొండు. (అసురములు- అను భాగమునుండి. పుట 53)

(2) ఆంధ్ర బాల రామాయణము- క్రౌను పుటలు 12+2.
వెల రు. 0-4-0.
కర్త:—విద్వాన్ శ్రీ కోగంటి దుర్గామల్లికార్జునరావుగారు
రిటైర్డు తెలుగు పండితులు- పామఱ్ఱు, కృష్ణాజిల్లా.

(3) సంసారశోభ-నాటకము. క్రౌను పుటలు, వెల 0-8-0.

(4) పంచవర్ష ప్రణాళికా ప్రచారిణి. క్రౌను పుటలు 52+8.
వెల 0-12-0.

కర్త:—శతావధాని శ్రీరాం వీరబ్రహ్మ కవిగారు, రిటైర్డు తెలుఁగు పండితులు, మచిలీపట్టణము.
ప్రకాశకులు:—శ్రీ కోగంటి దుర్గామల్లికార్జునరావుగారు
విఘ్నేశ్వర గ్రంథమాల, పామఱ్ఱు.

నెం. 2—సంస్కృతమున బాలుర యుపయోగార్థమై సంక్షిప్తముగరచింపఁబడిన బాలరామాయణమునకు సులభశైలిలోఁ గూర్చిన యాంధ్రానువాదము. బాలురవశ్యము పఠింపఁదగినది. చివరను లఘుటీక యనుపేరితోఁ గొన్ని పదముల కర్థము లొసఁగఁబడినవి.

నెం. 3—కుటుంబ నియంత్రణము (Family Planning) వలని యుపయోగములను గూర్చి హెచ్చరించుటకయి నూతన ఫక్కిని వచనమున రచితమయిన నాటకమిది. ఆదాయముతక్కువయై యధిక సంతానము వలన బాధలుపడు దంపతులు, పరిమితమయిన సంతతితో

సంసారశోభ, సౌఖ్యములతో నానందించు మఱొక దంపతులు, ఇరువురకు జరిగిన పరస్పర సంభాషణ పూర్వకముగ నిది రచితమయినది. కొందఱు అలోపతీవైద్యులొసఁగిన సదభిప్రాయములుఁగూడ నిందుఁ బ్రకటితము లయినవి.

నెం. 4—ప్రభుత్వమువారేర్పఱచిన పంచవర్ష ప్రణాళికను గూర్చిన వివిధ వివరములు, వానిని బాగుగా నర్థముచేసికొని ప్రజలు సహకరించి ప్రణాళికావిజయమునకుఁ దోడ్పడుచో, దేశమునకుఁగల్గు నభ్యుదయ క్షేమములను హెచ్చరించుచు, నేకపాత్రాభి నభినయ పూర్వకమగు హరికథా రూపముగ నిది రచింపఁబడినది. పద్యములు, దరువులు, కీర్తనలు రసోచితముగ నందందుఁ గూర్పఁబడినవి. ఇట్టిగ్రంథములు హరికథారూపమునఁ బ్రజలలోఁ బ్రచారమయినచో నందువలన విశేషోపయోగము గలుగుననుటకు సందేహింపఁ బనిలేదు. ప్రభుత్వము ప్రజలు నిందుకు సహకరించి కవిగారి ప్రయత్నమును సార్థక మొనరింతురు గాక.

(5) ఆంధ్ర యక్షగాన వాఙ్మయ చరిత్ర.

కర్త:—డాక్టరు యస్వీ జోగారావుగారు (M. A. Ph. D.)

ప్రకాశకులు:—ఆంధ్ర విశ్వకళా పరిషత్తు, వాల్తేరు.

డెమ్మీ పుటలు 502- వెల. రు 10-0-0.

మిత్రులు శ్రీ జోగారావుగారు విశేష పరిశ్రమ కావించి, P. H. D. పట్టమున కయి బహు రూపక పరిశోధనము లొనరించి, విరచించి యాంధ్ర వాఙ్మయమున కమూల్యాలంకరణముగ నొసగూర్చిన యుత్తమగ్రంథ మిది. చిరకాలము ఆంధ్ర విశ్వకళాపరిషదుపాధ్యక్షులుగ నుండి కీర్తిశేషులయిన డాక్టరు వాసిరెడ్డి కృష్ణగారి కంకితము. కేంద్ర సంగీతనాటక పరిషదధ్యక్షులు, మదరాసు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తులు శ్రీ పి. వి. రాజమన్నారుగారు, ఆంధ్ర

విశ్వకళా పరిషత్తు, ఆంధ్రశాఖాధ్యక్షులు, శ్రీ ఆచార్య విద్వాన్ గంటి జోగిసోమయాజిగారు ప్రకటించిన ప్రశంసాపూర్వక సదభిప్రాయములు గ్రంథమునకుముఖాలంకారములుగనున్నవి. "యావదాంధ్ర వాఙ్మయమునకు బహుముఖ వైవిధ్యమును, వైశిష్ట్యమును గలిగి విశాలసాహిత్యశాఖగా విలసిల్లిన ప్రక్రియ యక్షగాన మొక్కటియే." అని నిరూపించుటకు శ్రీ జోగారావుగా రీయుత్తమగ్రంథమును రచించి రనియు, ఇందుకు వారు చేసిన కృషి, జరిపిన పరిశోధన, ప్రకటించిన యుత్సాహము, సంపాదించిన పాండిత్యము, ఉపయోగించిన విమర్శ కౌశలము, అసమానము, శ్లాఘనీయము" అను శ్రీ రాజమన్నారుగారి యభిప్రాయముతో మేము సంపూర్ణముగ నేకీభవించుచున్నాము. దీనిని ప్రథమభాగము, ద్వితీయభాగము నను రెండు భాగములుగా కృతికర్త విభజించి యున్నారు. ప్రథమ భాగమున యక్షగానము, ఉత్పత్తి విచారము, పరిణామచరిత్ర, విపులముగా 1-224 పుటలలోఁ జర్చింపఁబడినవి. అందుకుఁ జేర్చిన ప్రథమానుబంధములో రేకు-రగడ, దరువు, ద్విపద, పద్యము, వచనము లేక గద్య,పదములనెడి యూఱు విభాగముల క్రింద నా యా లక్షణములు చర్చింపఁబడినవి. 2, 3, 4, 5, 6 అనుబంధములలో తంజావూరు పద వాఙ్మయము, శహాజీ దరువులు, వివిధ గేయ రచనలు, యక్షగాన శబ్దజాలము, యక్షగానములోని సామెతలు, అను శీర్షికలక్రిందఁ జర్చలుగావింపఁబడినవి. ద్వితీయ భాగమునందు ఆంధ్రప్రాంతయక్షగానకవులు, వారికావ్యములు,దక్షిణదేశ యక్షగానకవులు, తెలంగాణ యక్షగానకవులు, వారి కావ్యములను గూర్చి కాలక్రమానుసారముగ వివరములు రచింపఁబడినవి. అనంతరము పరిశిష్టము అను శీర్షికక్రింద కాలము, కర్తృత్వము, యక్షగానముల తేలని వివరములు, అలభ్య యక్షగానములు, యక్షగానాభాసములు, అకారాదిక్రిము కవినామ గ్రంథనామ సూచికలు,

సంకేతములు, ఉపజీవ్యగ్రంథముల వ్యాసములు, యక్షగానవిషయకములుగ కృతికర్త యందందుఁబ్రకటించిన స్వీయవ్యాసములుగూర్చిన ఏడు అనుబంధములు గూర్చఁబడినవి పాఠకులు. వీనిని సావధానముగఁ బరిశీలించుట యత్యావశ్యకము.

యక్షగాన రచనము తమిళ కన్నడములలోకన్న తెలుగునందే మునుముందు బయలుదేఱినదని కృతికర్త సప్రమాణముగ నిరూపించినారు. వేయేల. యక్షగానముల గూర్చిన సర్వస్వ మిదియని యుగ్గడింపఁదగును. ఆంధ్రులెల్లరు దీని నాదరించి గ్రంథకర్త పరిశ్రమమును సార్థక మొనర్తురు గాక యని యభిలషించుచున్నాము.

(6) సరస్వతీ కంఠాభరణము. (బూసం మల్లయ్య గారి షష్టి పూర్తి సన్మానసంచిక). రాయలుపుటలు 77. ప్లవ ఉగాది (17-3-61) నాఁడు వెలువడినది.

కవిగారు దేవాంగపేట వాస్తవ్యులును, దేవాంగకులజులు నయి సాహితీపిపాస గలవారవుటచే శ్రీ యీారామ నీలకంఠ స్వాములవారు సంస్థాపించిన రాత్రిపాఠశాలలోఁ బ్రవేశించి ఆంధ్ర సంస్కృత కావ్య నాటకములం జదివి కవితాసంపద నార్జించి "మోటుపల్లి" మున్నగు కావ్యములరచించి లోకసన్నుతి నందినారని, వీరికృతులు చాలవఱకు నముద్రితములు గానే యున్నవని, వీరు సాహిత్యవేత్తలయి పలువురకుచితముగ విద్యాదాన మొనర్చుచు, ముహూర్త జాతక వాస్తు శాస్త్రములందుఁ గూడ నిష్ణాతులయి ప్రజల యవసరములఁ దీర్చుచున్నా రని సన్మానసంఘ కార్యదర్శి భట్ట వేంకటసుబ్బయ్యగారు వ్రాసిన "మామాట" యనెడి యవతారిక వలనఁ దెలియుచున్నది. పేరికుఁ దగినట్లుగా నీ సన్మానసంచిక చాల సుందరముగా ముద్రితమయి ముద్దులు గులుకుచున్నది. కవిగారి శిష్యులు, మిత్రులు, పండితులు, కవులు, పలువురు పంపిన గద్య పద్య సందేశములతో, అభి

నందన, శుభా కాంతులతో నీ సంచిక యలరారుచున్నది.

తెలుగులెంక, శ్రీ తుమ్మల సీతారామమూర్తిగారి ప్రశంసా పద్య మొకటి యుదాహరించుచున్నాము.

"మల్లయ్య కవిత తెలుఁగుం
దల్లికి వెలలేనిపగకదా! జనకసుతా
వల్లభుదయ నీకవి న
వోల్లాసముతో శతాయు వున్నతిఁ గనుతన్"

(7) నమస్సుమాలు. (శారదా స్తుతి) కర్త: కావూరి పూర్ణ చంద్రరావు గారు బి. ఎ., బి. ఒ. యల్. ఆంధ్ర లిమోల కాలేజీ, గుడవల. క్రౌనుపుటలు 22. వెల, 0-4-0.

(8) ఆత్మబోధ. కర్త: దిటో. పోకెట్టుసైజు పుటలు 20 వెల, 35 న.పై.

కవిగారు శారదాభక్తులనియు వారికా దేవియందుఁగల భక్తి ప్రతి పద్యమునందును ప్రత్యక్ష మగుచున్నదని, మిత్రులు శ్రీదివా కర్ల వేంకటావధానిగా రొసంగిన యభిప్రాయము నందు వెలువరిం చిరి. అది నిజమేయని మా యభిప్రాయముగూడ. మొత్తము 110 శార్దూల మత్తేభ వృత్త పద్యము లిందున్నవి.

మచ్చున కొకటి రెండు.

"ధ్వస్తసమస్తకల్మష శుభప్రతిపాదక మానసుండనై
ప్రస్తుతిసేయువేళల భవప్రతిబంధ నిరోధకావళిన్
వ్యస్తముచేయరాఁగదె కృపామతి మాటికివేఁడికొందు చా
దస్తముకాదు నాహృదయ తాపనివేదనగాని శారదా!

"వీణావాదనవేళ వైణికుఁడు శా వీక్షింపకే వ్రేళులన్
వీణాతంత్రిల మీటుచందమున నే వేళన్ భవత్పాదసం
ధానై కాగ్రితనున్న నాకిట పరధ్యానంబుగానైన న

"క్షీణతస్కృతల కార్యనిర్వహణాశక్తిం గూర్పవే శారదా!''

చాద స్తము అను రూపము లాక్షణికము కాదు వ్యావహారికమని కవిగారు వాడియుందురని తలంతుము.

(8) శ్రీ జగద్గురు శంకరాచార్యులు సంస్కృత భాషలో రచించిన ఆత్మబోధయనెడి యద్వైతమతగ్రంథమున కిది యనువాదము. శ్రవణపేయమగు సులభశైలిలో నిందలిపద్యము లలరారుచున్నవి. న్యాయవేదాంతాలంకార శ్రీ ముదిగొండ పిచ్చయ్యగారి సదభిప్రాయము గ్రంథారంభమున ముద్రితమయినది.

(9) ధరాత్మజాపతి శతకము. రచయిత, పెద్దిభట్ల వేంకటప్పయ్యగారు, కురుమద్దాలి. క్రౌను పుటలు 20. వెల, 0-3-0.

కవిగారి నివాసస్థల మగు కురుమద్దాలి యందలి శ్రీ రామాలయ పునరుద్ధరణ సందర్భమున నిది రచితమయినది. ఆయన కిదియే ప్రథమ రచనమని వారియవతారికవలననే వ్యక్తమగుచున్నది. ధారాశుద్ధిగలిగి సులభశైలిలో నిందలిపద్యము లలరారుచున్నవి. మచ్చున కొకటి రెండు.

సూనులులేనిచో గతులు శూన్యమటంచును బల్కుచుందు ర
మ్మానిశుకుండు స్త్రీసుతసమాజుఁడుగాక పరంబునొందె నీ
ధ్యాననిమగ్నుఁడెట్టులు సదాభ్రమచెందును ధారుణీస్థలిన్
దానవభంజనా! కురుమదాలినివాస ధరాత్మజాపతీ.

పుట్టిననాటినుండియును బొందుగ బాల్యమునందుఁ గొన్నినా
ళ్ళట్టులె యౌవనంబున సుఖానుభవంబులయందుఁ గొన్నినా
ళ్ళట్టులె వార్ధకంబున మెలంగితి నీదగుభక్తి నిచ్చి పోఁ
దట్టుము పాపముల్ కురుమదాలినివాస ధరాత్మజాపతీ.

(ఇవి, (8) ఆత్మబోధ సమీక్షక్రింద చదువవలెను.)

మచ్చునకు రెండు పద్యములు.

శ్రీకరమైనయాత్మపద చింతనసేయఁగనీని రాగకో
పాకరమానసంబున మహత్తరశాంతగుణంబు నింపి పా
పాకుబలం దపోనిరతి నంతముఁజేసి ముముక్షులైనవా
రీకృతిఁజూడ నర్హులు జయింప భవప్రతిబంధకావళిన్.
సరగున మానవుల్ ఘనవిచక్షణతాగుణమూని తమ్ముఁదా
మెఱుఁగుటకైనఁ గోశముల నెల్ల నొకొక్కటి నేతినేతియన్
వరుసనదీసివేయ భగవంతుఁడు సచ్చిదఖండమూర్తిగా
దరిసెనమిచ్చు; పొట్టుఁగదంచినవడ్లను బియ్యమట్లుగన్.

(10) గాంధీవాణి. (నేటి తలఁపు) గ్రంథయిత :- శ్రీ చొల్లేటి నృసింహశర్మగారు, రిటైర్డు తెలుగుపండితులు, హనుమకొండ. క్రౌనుపుటలు 78 వెల, 0-12-0

గాంధిమహాత్ముని నోటినుండియో, వ్రాతలందో, యప్పుడప్పుడు వెలువడిన కొన్ని సూక్తులు తేదీలవారీగా గ్రహింపఁబడినవి. రచనయంతయు వచనమే. శ్రీ టి. హయగ్రీవాచార్యులు M. L. A. గారి కంకితము.

మచ్చునకుఁ గొన్ని సూక్తులు-

"పతితునికన్న పతితుఁడు, ఉన్నతునికన్న ఉన్నతుఁడు, ఇద్దరును సమానముగా పురోగమించు అవకాశముగల తంత్రమే ప్రజాతంత్రమని నా తలంపు"

"బాహ్యాభ్యంతర తుపానులమధ్య పరస్పరము జరుగు నిత్యసంగ్రామము జీవితము. ఇట్టి సంగ్రామ మధ్యమందే శాంతి అవసరమని గుర్తింపవలెను."

"నీ వేది చేసినను నాకు అర్పణము చేయుము. నా కొఱకై చేయుము— అన్న గీతావచనామృతమును నే నెప్పుడును గుటకలువేసి

తాగుచుండును.”

“చరఖా- సత్యముయొక్క ఒక అంశము. కనుక నేను దానిని సత్యరూపి యగు భగవానుని యొక్క మూర్తిగా గాంతును. చరఖా యొక్క వ్యాపకార్థ మెఱుంగుట అవసరము.”

“మనుష్యుని భగవంతుఁడనరాదు. మనుష్యుఁడు భగవంతుఁడు కాఁడు గాని భగవంతుని వెలుతురునుండి మనుష్యుఁడు వేఱైనవాఁడు కాఁడు.

లోకమతమనగా సమాజముయొక్క అభిప్రాయమని యర్థము. ఈ మతము నీతివిరుద్ధముగా ఉండనంతకాలము దాని నాదరించుట మన ధర్మము.

అపారమగు ధైర్యము, గాఢమగు శాంతి, మంచి చెడ్డ వివేకము, ఆత్మత్యాగము, సత్యజ్ఞానము- ఇవి అహింస నాశ్రయించియే యుండును.

ఏ దేశమున అచటి విద్యావిధానము ఆ దేశమును ముందుకు కొనిపోవునదిగా నుండవలెను.

(11) రాచబాట. కర్త:- కవిసమ్రాట్ గొన్నాబత్తుల నూకరాజు గారు, గొల్లప్రోలు. క్రొను పుటలు 28. వెల, 1-0-0.

కవి పిఠాపురములో నొక యద్వైతమత పీఠమును నెలకొలిపిన హాజరత్ మహబూబ్ షరీఫ్ బాబాగారి శిష్యకోటిలోని వాఁడు. ఆయన కంకితముగానే యిది రచింపఁబడినది. “రాచబాట నూకరాజు మాట” అను మకుటముతో 108 ఆటవెలఁది గీతములతో రచితమయిన శతక మిది. చాల పద్యములు- వీరి పీఠమునకు సంబంధించిన సాంకేతిక వేదాంత పరిభాషలో గూఢార్థములతో నిండి యుండును.

అందందు లోకానుభవబోధక నీతి పద్యములును గలవు. పద్యములందలి యంతరార్థము గూఢ మయినను కవిగారు ధారాశమయిన సులభ శైలిలో దీనిని రచించుట ప్రశంసనీయము.

మెచ్చునట్టి కొన్ని పద్యములు—

మాటలన్ని గట్టిమాటయి యున్నట్టి
బోటితోడ గూడి యాటలాడి
చేటుగవనివాడె పోటుమానిసి యౌర
రాచబాట నాకరాజు మాట (1)

వాక్యమందుగల్గు భావంబు లక్ష్యంబు
మాపునందు నిల్చి రూపొనర్చి
తన్మయుండయియుంట తానె నేననుటరా
రాచబాట ... ... (2)

లేతమావిచివురు మేతను దా మేసి
కూయు దియ్యగాను కోకిలమ్మ
కోకిలారవంబు కాకి యేమెఱుగును
రాచబాట ... ... (3)

(12) అంబకథ. (1వ భాగము) క్రొన్ను పుటలు 8. వెల, 0-1-0.
(13) వృత్రాసుర వధ. ,, ,, 0-1-0.
(14) నీతికథావళి.(ప్రథమభాగము) ,, 16. 0-2-6.

కర్త :- విద్వాన్ కోగంటి దుర్గామల్లికార్జునరావుగారు,
రిటైర్డు తెలుగు పండితులు, పామఱ్ఱు, కృష్ణా జిల్లా.

నెం. 12- ఇది భారతమందలి కథ ననుసరించి రచితమయినది.

కాశిరాజు మూవురు పుత్రికలలో పెద్దదయిన అంబ, సౌంభ దేశ ప్రభువగు సాళ్వుని పెండ్లియాడ వరించియుండగా నావృత్తాంత మెఱుగక భీష్ముడువిచిత్రవీర్యునివివాహమునకయి కాశిరాజతనయలు మూవురను గూడ గొనితెచ్చిన పిమ్మట యంబ సాళ్వుని వరించి యున్న వృత్తాంతమువిని యామెను విడిచిపెట్టుట, సాళ్వుండామెను నిరాకరించుట, ఇట్లు భీష్మునిమూలమున భ్రష్టయైన యంబ యాతని

సంహరించుట కయి ఘోరతప మొనర్చి ద్రుపదుని పుత్రి డయిన శిఖండిగా జన్మించుట- ఇత్యాది వృత్తములను గొని సులభ శైలిలో బాలుర యుపయోగార్థము వ్రాయఁబడినది.

నెం. 13-త్వష్టపుత్త్రుఁడు విశ్వరూపుఁ డింద్రపదమును గోరి తప మొన రించుచుండ నింద్రుఁ డాతని సంహరించుట, యా యకృత్యమునకుఁ గినిసి యింద్రునినిర్జించుటకై త్వష్ట వృత్రాసురుని సృజించుట, ఇంద్ర వైరియగు నతఁడు తరువాత విష్ణుసాహాయ్యముచే నింద్రునిచే నిహతుఁ డగుట, యను పౌరాణిక కథ ననుసరించి సులభ శైలిలో బాలుర యుపయోగమునకే యిది రచితమైనది.

నెం. 14-శూద్రుఁడు, కుక్క; దొంగ, కవి- మున్నగు శీర్షికలుగల 18 చిన్నచిన్న కథ లిందుఁగలవు. ప్రతికథ చివర నందువలన వ్యక్తమగు నీతి యుదాహృత మయినది. అంతమందలి గద్యలో "రావు కవిచే నాంధ్రీకరింపఁబడిన నీతికథావళి ప్రథమభాగము" అని యుండుటచేఁ గృతికర్త వీనిని సంస్కృతవాఙ్మయ మందలి కొన్ని కథల ననుసరించి రచించియుండుననితోఁచును. గ్రంథమంతయు సులభశైలిలో బాలుర కుపయోగించు రీతిని వ్రాయఁబడినది.

(15) ఆంధ్ర ప్రతాపరుద్ర యశోభూషణము.

డెమ్మీ పుటలు 582+114-696. వెల : రు. 12-0-0.

ప్రతిష్ఠానము :—నాగార్జున బుక్ డిపో, నారాయణగుడా, హైదరాబాదు.

శ్రీమాన్ చలమచర్ల రంగాచార్యులుగారు రచించినగ్రంథము నకు ద్వితీయముద్రణము. సంస్కృతభాషలో విద్యానాథుఁడు రచిం చిన ప్రతాపరుద్రియశోభూషణమున కిది 'రుచిరసమీక్ష'తోఁ గూడిన యాంధ్రానువాదము.

కాకతీయులు త్రిలింగసామ్రాజ్యమును పాలించిననాఁడు వారి యశోభూషణముగ వెలువడినది సంస్కృతభాషలో నిది యొక్కటియే యనిచెప్పవచ్చును. ఇదిగాక మిగిలినవన్నియు శాసనరూపములే. కాకతీయుల పాలనములో త్రిలింగసామ్రాజ్య మంతయు నిలిచియున్నది యించుమించుగ 175 వత్సరములు. ఆ సమయములో వారి వైభవమును వెలార్చుచు, వారిపేర సంకేతమైన గ్రంథమిదియే. ఇది బయలు దేఱినది మొదలు నేఁటివఱకు నలంకారశాస్త్రవిషయపరిజ్ఞానమునకు దాక్షిణాత్యు లందఱకు నాదరణీయగ్రంథమైనది. దీనికి, వ్యాఖ్యాతృశిరోమణియగు మల్లినాథసూరిసుతుఁడైన కోలచెలము కుమారస్వామిసోమయాజి 'రత్నాపణ'మను వ్యాఖ్యానమురచించి, దీనిమహత్త్వము నినుమడింపఁజేసినాఁడనుట తథ్యము.

ఈ గ్రంథకర్త వ్యాఖ్యాత యిరువురుకూడ తెలంగాణమునకుఁ జెందినవారై మూలవ్యాఖ్యల రెండిఁటి నచటనే వెలయింపఁగా, శ్రీమాన్ చెలమచర్ల రంగాచార్యులవారు నచటనేయుండి, ఈగ్రంథమును దెలిఁగించి తెలుఁగువారి కందించుట మంచి యౌచిత్యమును వహించినది. రత్నాపణము బయలుదేఱినతరువాత నందలివిషయము దుర్బోధముగ నుండుటచే రామతీర్థనివాసులు శ్రీమాన్ చిలకమర్తి తిరుమలాచార్యులుగారు రత్నశాణమను వ్యాఖ్యను రచింపఁగా, శ్రీరంగాచార్యులుగారు ఈ రెండవకూర్పులో, ప్రతాపరుద్రీయ రత్నాపణ విషయములను, ఆయావిషయములం దితరాలంకారికులు దెలిపినరీతులను సమీక్షించి, శక్యమైనంతలో సుబోధమగునట్లు తెలుఁగుచేసి వెలయించుటలోఁగూడ నొక ప్రత్యేకమయిన యౌచిత్య మేర్పడెనని చెప్పవచ్చును.

ఈ గ్రంథమునకు తొలిసారి మలిసారి భూమికలు రచియించి పెట్టిన శ్రీమాన్ ఈయుణ్ణి వీరవెంకటరాఘవాచార్యులుగారు అలంకారశాస్త్రగ్రంథములకు సంబంధించినంతవఱకు పెక్కువిషయములను తమ భూమికలో క్రోడీకరించి పెట్టినారు. ద్వితీయ ముద్రణములో శ్రీమాన్ రంగాచార్యులవారు, అలంకారశాస్త్రవిషయములకు సంబంధించిన పెక్కువిశేషములను, వివిధగ్రంథములలో నున్నవానిని సమీకరించి, సముచితముగ నాయా తావులందు తెనిఁగించిపెట్టినారు. వీరి యిరువుర పరిశ్రమమువలన, ఆంధ్రపాఠకులకు అలంకారశాస్త్రగ్రంథములు, గ్రంథస్థవిషయములు సుపరిచితములు సులభపఠితములుకూడ నగుననుట నిశ్చయము. శాస్త్రీయవిషయములను భాషాంతరములోనికిఁ దెచ్చుట మిక్కిలి శ్రమసాధ్యమైన పని. అందును మూలములో గద్యపద్యాత్మకముగా నుండినవిషయమును, మూలానుకృతితో గద్యపద్యరూపమునఁ దెలుఁగులో ననువదించి, రుచిరసమీక్ష సాగించి, యాంధ్రలోకమున కందిచ్చిన శ్రీమాన్ రంగాచార్యులవారి పరిశ్రమమును సహృదయులైనపాఠకులు సమీక్షించి, ఆలంకారిక విషయపరిజ్ఞాతలగుదురుగాక యని నా యాకాంక్ష.

ఇంకొక్కమాట. కాకతీయుల చరిత్రమును స్పష్టముగ నున్నంతవఱకుఁ దెలిసికొనుటకు సహకరించెడి గ్రంథములలో మొదటిది ప్రతాపరుద్రయశోభూషణము. మిగిలిన ప్రతాప చరిత్రాదులలో కట్టుకథలు హెచ్చు. ఆవిషయమును పీఠికలో రచయిత లంగీకరించియే యున్నారు. ప్రతాపరుద్ర యశోభూషణమునుబట్టి తెలియవచ్చెడి చరిత్రాంశములను భూమికలోఁ దెలిపియుండవలసినది. తరువాతి ముద్రణమునందైన నీ విషయమును సంతరించెదరని భావించెదను.

చి. పాపయ్యశాస్త్రి.

నన్నెచోడుని కవిత్వము—రసపోషణము

శ్రీ శిష్టా రామకృష్ణ శాస్త్రి

ఉ. కేవలకల్పనాకథలు కృత్రిమరత్నము, లార్యసత్కథల్
వావిరిపుట్టురత్నము, లవారితసత్కవి కల్పనావిభూ
షావహ పూర్వవృత్తములు సానలదీరిన జాతిరత్నముల్.
వసు I-19.

అని రామరాజభూషణకవి నుడివినరీతిని 'సానలదీరిన జాతిరత్నము' వంటిది ప్రబంధము. ఏలన మూలకథావస్తువు 'అష్టాదశవర్ణనాపరిపూర్ణంబై, దశప్రాణంబుల సప్రాణంబై', (I-45), 'ప్రబంధము సదృశ ప్రబంధముగా', (I-48), కవి 'యనూన ప్రతిభార్ణవోదీర్ణ రుచిర వస్తు విస్తారితోత్తమ కావ్యరత్నవిభూషణంబు' (I-56)గా శోభిల్లును. విశేషించి,

చ. రవికులశేఖరుండు కవిరాజశిఖామణి కావ్యకర్త స
త్కవి భువి నన్నెచోడుఁడటె; కావ్యము దివ్యకథన్ కుమారసం
భవమటె; సత్కథాధిపతిభవ్యుఁడు జంగమమల్లికార్జునుం
డవిచలితార్థయోగధరుఁడట్టె; వినం గొనియాడఁ జాలదే. I-57

ఇఁకఁ గావ్యస్వరూప మెటువంటి దనఁగా,

కం. తనువగు శబ్దార్థంబులు
ధ్వని జీవ మలంక్రియావిలాసము సొమ్ముల్
తనరుగుణములు గుణములు
ఘనవృత్తులు వృత్తు లౌర కావ్యేందిరకున్. నరస శ-53

కాఁగా, 'రసాత్మకం వాక్యం కావ్య'మ్మని విశ్వనాథుఁడు చాటెనుకదా! దానిననుసరించి కావ్యప్రయోజనము 'రసాస్వాదన సముద్భూతం, విగళితవేద్యాంతర మానందం' కాన, రసహీనమైన కావ్యమునకు గౌరవమే యుండదు. అందుచే రసపరిపాలనము కావ్యమున ప్రధానస్థాన మాక్రమించును. తత్తద్రసావిష్కరణానుగుణములగు వర్ణనలను,

దదవలంబనములగు భావములను, దత్ప్రకాశకములగు పదములను నన్నెచోడకవి తన కుమారసంభవమహాకావ్యమున నెట్లు ప్రదర్శించెనో క్రమముగా బరిశీలింతము.

చోడకవి తన కుమారసంభవమున శృంగారమును ప్రధానరసముగను, వీరరసము నంగముగను జేసి, యితరరసములను సందర్భానుగుణముగఁ బరిపాలించినాఁడు. ఈ కావ్యమున పార్వతీపరమేశ్వరులు నాయికానాయకులు. వారే శివశక్తులు. వీరి సంయోగ విప్రలంభ శృంగారములను, పునస్సంయోగ శృంగారమును వర్ణించుటకు వీలుగా ప్రసిద్ధమైన (కాళిదాస కుమారసంభవమందలి) పార్వతీపరమేశ్వరుల పరిణయగాథకు కవి పూర్వాపరములకుఁ గొంతకథను జేర్చికొనినాఁడు. ప్రధానకథయగు పార్వతీపరమేశ్వరుల పరిణయవృత్తాంతమును, దత్ఫలితమగు కుమారస్వామి జననమునకును, బూర్వమున సతీ శివుల పరిణయచరిత్రను, పరమందు కుమారస్వామి తారకుని సంహరించుట యటుతర్వాత పార్వతి శివుని యర్ధాంగమును సంపాదించుట యను విషయములను గలిపి, నాయికానాయకుల విప్రలంభ సంభోగశృంగారములను విస్తరించి, విపులముగా వర్ణించుటకు చోడకవి యవకాశమును గల్పించుకొనినాఁడు. ఇందుచేఁ గథావస్తువున గాంభీర్యముఁగూడ సిద్ధించినది. దీనిమూలమున సతీశివుల కరికరిణీరూప రతిక్రీడయందును పార్వతీపరమేశ్వరుల వివాహానంతరమునను సంభోగ శృంగారమును, దక్షాధ్వరధ్వంసానంతరమునను, పరమేశ్వరతపోవిఘ్నానంతరమునను గూడ విప్రలంభ శృంగారమును వర్ణించుట కవకాశము గల్గినది కవికి. మఱియు నట్లే వీరరౌద్రములు దక్షాధ్వరధ్వంసమున గణపతులపరాక్రమ ప్రకటనమునను, తారకాసురయుద్ధమున దేవదానవుల విజృంభణమునను, భయానకరసము దక్షాధ్వరమున దేవతలు పాఱిపోవునపుడును, యుద్ధమున రాక్షసులు పరాజితులై పలాయన మగునపు

డును, కరుణరసము దక్ష మన్మథ తారకులు పరాజయ సంహారములు గావింపఁబడగ, వారి భార్యల విలాపములందును పోషింపఁబడినవి. ఈ రీతిగ ననేకపర్యాయములలో కేరసము వివిధరూపములఁ బ్రతిపాదించుటకు వీలై, కవిప్రతిభ ననేకముఖములఁ బ్రకాశింపఁజేయుటకు నావకాశముగల్గినది. శృంగారరసమున కాలంబనవిభావమగు స్త్రీవర్ణన పార్వతి యౌవనవర్ణనచేయుపట్ల నొకమారును, మాయావటునిరూపమున శివుఁడు దపముచేయుపార్వతిని గాంచినసన్నివేశమునను, సప్తర్షులు పార్వతినిజూచివచ్చి శివున కెఱిఁగించునపుడును మాత్రమేగాక, ప్రాసంగికముగ నరణ్యమున నాటవికస్త్రీలను పార్వతి తిలకించునపుడును, వైవాహికయాత్రలో శివునిఁజూడవచ్చు స్త్రీలనుగూర్చి తెలుపునపుడును, విటీవిటుల వర్తనలసందర్భమునను, యుద్ధారంభమున వీరపత్నులచేష్టలపట్లను వివిధ స్త్రీలను పలువిధములుగ వర్ణించి శృంగార రసమును విస్తారముగఁబోషించి, పుష్టినొసఁగి, కావ్యమున శృంగారము ప్రధానరసమని ఘంటాపథముగ చాటినవాఁడయ్యెను కవి. కాన నా రస మెట్లు పోషింపఁబడినదో పరిశీలింతముగాక.

శృంగార రసము :

పార్వతీపరమేశ్వరుల శృంగారమును కవివర్ణించుటలోఁ దపము చేయుచున్న శివునొద్దకు పార్వతివచ్చునప్పుడు మన్మథుఁడు వారిరువురను కామోద్రేకులఁజేయు సన్నివేశముతో ప్రారంభించినది. ఈ సందర్భమున కవికుల గురువైన కాళిదాసు తన కుమారసంభవమున 'తనకుఁగాఁబోవు భర్తయొద్దకు పార్వతిరాఁగా, శివుఁడంత పరమాత్మ ధ్యానముచేసికొని యోగమును విరమించె' నని యిట్లు రచించినాఁడు.

శ్లో॥ భవిష్యతః పత్యురుమాచ శంభోః
సమాససాద ప్రతిహార భూమిం
యోగాత్ స చాన్తః పరమాత్మసంజ్ఞం
దృష్ట్వా పరంజ్యోతి రుపారరామ. 3-58.

కాని యామె వచ్చినతీరునుగాని, యామెవిలాసమునుగాని కవి వర్ణింప లేదు. ఈ సన్నివేశమున చోడకవి తోడువచ్చిన చెలికత్తెలను వివిధ పుష్పములతో నలంకరించి, పార్వతి నిట్లు ప్రవేశపెట్టినాఁడు.

సీ॥ కరవీరరచిత నూపురములు సెలువొందఁ
గాంచనపుష్ప మేఖలలు గట్టి
పున్నాగమయహారములు వెట్టి నవకర్ణి
కారశోభితకటకములు వెలుఁగఁ
కేసర రాజీవ కేయూరములు దోడి
రాజీవకర్ణపూరము లమర్చి
తిలకాభినుత హేమతిలకంబు లుప్పొంగఁ
జంపక మాలికాసమితిఁ దాల్చి

గీ॥ మధులతాంతమయవిభూషణమండితు
లైన కన్యకాచయమ్ము నడుమఁ
బొలిచె నద్రితనయ పుష్పితజంగమ
లతలనడిమి కల్పలతయుఁ బోలె 5-20

కాళిదాసు సంస్కృతమున వనదేవతలగు చెలికత్తెలతోఁ బార్వతిగనఁ బడెనని చెప్పి, యామెనే వివిధపుష్పములచే నలంకరింపఁజేసెను, గాని చెలికత్తెలను పుష్పములతో నలంకరింపలేదు.

శ్లో॥ నిర్వాణభూయిష్ఠ మథాస్య వీర్యం
సంధుక్షయంతీవ వపుర్గుణేన
అనుప్రయాతా వనదేవతాభ్యా
మదృశ్యత స్థావరరాజకన్యా. 3-52

శ్లో॥ అశోక నిర్భర్త్సితపద్మరాగ
మాకృష్ట హేమద్యుతికర్ణికారం

ముక్తాకలాపీకృత సిందువారం
వసంతపుష్పాభరణం వహంతీ. 53

పార్వతి కెంపులు, బంగారు, ముత్యముల నగలకు బదులు పుష్పములనే నగలగా ధరించెనఁట. ఈ పుష్పాలంకరణమును చోడకవి పార్వతి నుండి చెలికత్తెలకు మార్చినాఁడు. పార్వతియందా లోపమును దీర్చుటకుఁగాఁబోలు కాళిదాసు వదలిపెట్టిన, శివార్చనకై పార్వతి పుష్పాపచయము చేర్చి చక్కఁగఁ దీర్చినరీతిని చోడకవి యిట్లు రచించినాఁడు.

వ. ఇట్లకాల వసంత లతాంతాపచయ కేళీలాలసయై ప్రాలేయ
కుత్కీలాత్మజ యక్షణంబ,

కం. అతి సంభ్రమమునఁ ద్విజగ
తృతి నర్చనసేయఁదలఁచి పరిమళమంద
స్మితకుసుమ మృదులపల్లవ
తతిలో మేలెఱిఁగికొని ముదంబొదవుమదిన్. 22

సీ. మెలపారు నెలమావితలిరుల నొకకొన్ని
రమణీయమగు చంపకములు వొదివి
లాలితాశోకపల్లవముల నొకకొన్ని
కమనీయమగు కుర్వకములు వెట్టి
మాసరంబగు నంటిమోసుల నొకకొన్ని
గోపరారు కర్ణికారములు నించి
తరుణాంబుజాత పత్రంబుల నొకకొన్ని
యమరిన సరసోత్పలములు సుట్టి

గీ. చెలువ లెల్ల నొంకుసిగుళులుఁ బువ్వులుఁ
గలయఁదాల్చి పొల్చి బలసిరాఁగ
శైలరాజతనయ సనుదెంచె నందన
వనము గాఁపువచ్చు వడువుతోఁత. 23

ఈ విధముగా పుష్పములన్నియు వివిధాభరణములుగాఁ దీర్చిదిద్ది, శివునొద్దకుఁబోవుటకు పార్వతి పరిసరములను చోడకవి చిత్రించినాఁడు. ఏయేసుమ మేయే విధముగా నెట్లలంకరణమున కుపయోగించునో గుర్తించినట్లు వర్ణించెను. శివుని తపోవనమునకుఁ బోవుటకై మన్మథుకు సిద్ధముచేసికొనిన రథవర్ణనముగూడ నిట్లే నేర్పుతోఁ గూర్పబడినది. చూడుఁడు :

సీ. పంకరుహంబులు బండికండ్లు చంప
    కంబులు నొగ లుత్పలంబు లిరుసు
గరవీరములు పలుఁగాఁడి జాదులు సనుఁ
    గొయ్య లశోకముల్ గోడిపీఁట
సిందువారములు సీలలు గేతకుల్
    మెట్టులు మొల్లలు మెట్టుగుదెలు
పొగడలు పలుపులు పున్నాగములు పగ్గ
    ములు సహకారముల్ పూను గాడి

గీ. కురవకానీక మాలంపుఁగోల కైర
వములు ములుకోల కోకముల్ వాహనములు
గా వసంతుఁడుసూతుఁడై పూవుఁదేర
నెరయఁ గుసుమాయుధంబులు నినిపి తెచ్చె. IV-83

ఇట్లు ప్రతి యవయవమును సింగారించుటలో చోడకవి తననైపుణ్యమును ప్రదర్శించి కవిత్వము నొక శిల్పముగాఁ జిత్రించెను.

తర్వాత పార్వతి శివునొద్దకు వచ్చినపు డెట్లుండెనో నన్నెచోడుఁ డిట్లు వర్ణించినాఁడు.

ఉ. ఆ లలితాంగి, భూషితలతాంతవిభూషణజాలగాత్రి, హం
సాలసమందయాన, వికచామల కోమలనీరజాస్య, బా
లాలికులాళినీలకుటిలాలకి, లోలవిశాలనేత్రి, కు
త్కీలతనూజ వచ్చె మదనదీపముపోలెఁ బినాకిపాలికిన్. 5-24

ఇందు పార్వతి లలితసుకుమార సుందరాకారము మనోహరముగఁ జిత్రింపఁబడినది. ఈపద్యము చక్కనికైశికీవృత్తిలో ప్రసాదమాధుర్య గుణములతో వృత్త్యనుప్రాసమునఁ గూర్పఁబడినది. దీని తుల్యరచన సంస్కృతకుమారసంభవమున లేదని పైననే సూచింపఁబడినది. శృంగారరసమున కాలంబనవిభావ మగు నాయికా వర్ణనమును జేసిన యాంధ్రకవిసార్వభౌము, యాంధ్రకవితాపితామహులరచన లెట్లుం జెనో సాదృశ్యమునకు స్మరింతము.

శృంగారనైషధమున శ్రీనాథుఁ డిట్లు దమయంతిని చూచినట్లుగా హంసచే వర్ణనచేయించినాఁడు.

మ. ... ... విదర్భదేశమున నారీరత్నముం గాంచితిన్
సదసత్సంశయ గోచరోదరి, శరత్సంపూర్ణచంద్రాననన్. 2-20

మ. ... ... కంటిన్ విదర్భంబునన్
రమణిం, బల్లవపాణిఁ బద్మనయనన్, రాకేందుబింబాననన్
సమపీన స్తని, నస్తినాస్తి విచికిత్సాహేతు శాతోదరిన్. 21

ఇఁక మనుచరిత్రమున నల్లసాని పెద్దన, ప్రవరునిచేఁ గనుపింపఁజేసిన వరూథినివర్ణన యిది.

మ. ... ... కనియెన్ విద్యుల్లతావిగ్రహన్
శతపత్రేక్షణఁ, జంచరీకచికురం, జంద్రాస్యఁ, జక్రస్తనిన్
నతనాభిన్ నవలా నొకానొకమరున్నారీశిరోరత్నమున్. 2-25

నాయికావయవసౌందర్యముతో బాహ్యాకారమును జిత్రించి యొక రుచిరవిగ్రహమును కథలలోఁ బ్రవేశపెట్టి శృంగారరసమున కాలంబన విభావమును నెలకొల్పుటలో నాంధ్రకవిసార్వభౌమ, కవితాపితా మహుల రచనాపద్ధతినే పూర్వమెప్పుడో గ్రహించినాఁడు కవిరాజ శిఖామణి గూడ. ఈతనికి శ్రీహర్షుని నైషధరచన మేలుబంతియై

యుండనోపు నీ సందర్భమున. తెలుఁగున చోడకవియే యిట్టి రచనకు మార్గదర్శియైనాఁడు. కావ్య మిక్కడనే రక్తికట్ట నారంభించినది.

పిమ్మట పార్వతి "హరిచరణ సరసీరుహంబులకుం బుష్పాంజలి యిచ్చి కృతాంజలియైనది". అంత మదనప్రేరితమై యామె సాత్త్వికావస్థ నొందిన దిట్లు:

మ. అలిరాగస్థింబునగాఁలి యూఁడె బొమ లాహ్లాదింపఁ గన్గోనలన్
దలఁకెన్ సమ్మదవారి, మోవి యదరెన్, దన్వంగిమైనొత్తె, ము
త్పులకల్ గంపముగూడె, నూర్పులెలమిఁ బొందెన్, మనం
బాత్మలో
నోలసెన్, రాగము మోహమునం బొలసె గండోల్లాసహాస
ప్రిథల్. 30.

ఆమె హావభావ విలాసములచే శివునిహృదయము చలించిన ట్లీ క్రింది పద్యమున కవి వర్ణించినాఁడు.

ఉ. ఆ లసితస్మితాస్య, లలితామలకోమల చంచలాలసా
లోలవిశాల సంస్ఫురితలోచన దృష్టిరస ప్రవాహమం
దోలినపర్వివెల్లిగొని, యొక్కట గ్రిక్కునముంచి మీఁదికిన్
తేలఁగనే త్రెజాట్టి,హరుఁడిప్పులఁ బెట్టెమనోజుఁ డుబ్బఁగాన్. 31

పార్వతి యనురాగ దృష్టివలన శివుఁడు రాగరసమగ్నుఁడై, యాతనిఁ దిప్పులఁ బెట్టెనఁట. ఇట్లు సుకుమార సుందర భావములతో మృదు మధురపదవిన్యాసముతో నాయికా నాయకుల పరస్పరానురాగమును హృదయరంజకముగ నన్నెచోడకవి ద్యోతకముచేయఁగల్గినాడు. గారి పొందిన మనోవికారమును చక్కఁగ నిట్లు చిత్రించి చూపినాఁడు చోడకవి.

సీ. ఎలరారు కనుఁగవ వ్రాలయించుఁ గ్రేవల
నెఱిఁగొని మెఱుఁగులు దుఱఁగలింపఁ
గ్రొవ్విరి చిరునవ్వు నవ్వవాలెఱ కాంతి
రంగిల్లి సితరుచుల్ దొంగలింపఁ
గుదుట గ్రిక్కడరినఁ గదియించు గుడువిల్లు
సుడిసి ము త్తరగలు గడలుకొనఁగ
సోలంబు నెద నూర సొగియు నుంజెమటపై
వదలి మైడిఁగఁ మవ్వంబుదిగుల

గీ॥ నొత్తలించుఁ దఱుమ నూకించుఁ దాలిమి
కగ్గలించు నెఱయ నప్పలించు
మదనశరవిభిన్నహృదయాబ్జయై మహా
దేవుఁ జూచి గౌరి దేవి దివుట. 41

ఈవిధముగా మదనవికారమానసయైనది పార్వతి. కేవలము బాహ్యాకారమును మాత్రము వర్ణించినచో కొయ్యబొమ్మవలెనుండి, నిర్జీవముగానుండును. సాత్త్వికభావోదయము శరీరమునపొందిన మార్పులను మాత్రము సూచించును. వీనినన్నింటిని మించి, పాత్రను సజీవముగాఁ జేసి, చైతన్యమును గూర్చునది మానసికప్రవృత్తియే. మానసిక ప్రవృత్తిని ప్రతిపాదించిననేకాని ఏ కళయైనను జీవకళతో శోభింపదు. పార్వతికిజనించిన యనురాగమువలన చిత్తవిభ్రమముగల్గి కనుఁగవ మెఱుఁగులఁ దుఱగలించినది; చిరునవ్వు సితరుచులు తొంగలించినది; తఱుమ నూకించినది, తాలిమి కగ్గలించినది. ఇట్లామె మానసికపరిణామ క్రమమును విపులముగ తేటతెలుఁగుదేశీయపదములతో వివరించి పార్వతిపాత్రను చైతన్యవంతముగఁ జేసినాఁడు చోడకవి. ఇదే కవితాశిల్ప రహస్యము. ఇఁక నామె ముఖవికారమును గాంచి శివునికిఁ గూడ ననురాగముగల్గి సాత్త్వికభావ మంచిన దిట్లు.

ఉ. ఆరుచిరాన నాబ్జదరహాసవిలాస వికాసభాసి నీ
హారకరాతిభాతి నమలాంగశరీర తుషారదీప్తికాం
తోరువగంబు సమ్మదరసోత్కటఘర్మజలంబు పర్వ పొ
ల్పారె హిమాచలంబు నమరాధిపవాహినిఁ గప్పినట్టిదై. 43

శివుని సాత్త్వికభావోదయమువలనఁగలిగినఘర్మవారి, హిమాచలము మీఁద ప్రవహించు గంగానదివలె నున్నదఁట. అప్పు డాయన మనఃప్రవృత్తి నిట్లు చిత్రించినాఁడు.

సీ. పులకాంకురంబులు దలలెత్తి మేనఁగం
పింపఁ గోమలిఁ గౌఁగిలింపఁదలఁచు
రాగోత్కటమున సైరణలేక మానినిఁ
గాయ్వునఁ బైఁబడి కవయఁదలఁచు
లలితాంగి యవయవములు సూచి మదిఁ దని
వోవక చూపులఁ ద్రావఁదలఁచు
నధరోష్ఠమధురంగ నంతస్స్మితాంశులు
దలుకొత్త నేమేనిఁ బలుకఁదలఁచుఁ
గీ. తనమహత్త్వంబు దలఁపక తరుణిపొందు
వడయఁ గీడ్పడి తేఁకువ వాపఁదలఁచు
భావజాస్త్రాభిగతి మహాదేవుఁ డొక్క
వ్రేలిమిడిఁ బెంపుసెడి కడు విరలిగొనియె. 45

ఈపద్యమున శివుఁడు మానసికముగఁబడినత్రిప్పులన్నియు విపులముగ వర్ణింపఁబడినవి. శివుఁడంతవాఁడు తన మహత్త్వంబునుగూడ దలఁపక, మదనవికారమునఁ బార్వతినిఁ గౌఁగిలింపఁబూనుకొనినాఁడఁట, పైఁబడి కవయఁదలఁచినాఁడఁట, ఆమె యవయవసౌందర్యమును చూపులతోఁ ద్రావఁగోరినాఁడఁట, ఆమెతోఁ దన ప్రేమోదంతమును బలుకఁదల

పెట్టినాఁడట, ఆయన సాహసోద్రేకప్రయత్నములతో శివుని మనః పరిణామ మిట్లువివరింపఁబడినది. ఇది చైతన్యపూరితమైన పాత్రచిత్రణము. ఇట్టి రచనవలననే పాఠకులు పాత్రలతో సమానాభిప్రాయములనొంది యభినందింపఁగలరు. ఇందు పార్వతి మనోగత భావములకును, శివుని మానసికోద్రేకమునకుఁ గల భేదమును నైపుణ్యముతో, జిత్రించినాఁడు చోడకవి. కన్య మనసునఁగల్గు లలితభావోద్రేకమునకుఁ పురుషునకు జనించు తీవ్రభావావేశమునకుఁ గల తారతమ్యము నతి జాగరూకతతో, కౌశలముతో నన్యూనాతిరిక్తముగా వర్ణించినాఁడు కవి. ఇట్టి మానవ మానసిక ప్రవృత్తివివరణమును తిక్కన విరాటపర్వములో సైరంధ్రీకీచకుల కథాఘట్టమును జిత్రించుటలో చోడకవి నట్లనుకరింపఁగల్గినాఁడో క్రింది పద్యములలోఁ గాంచఁగలము. సుదేష్ణ యింటిలో కీచకుడు ద్రౌపదినిఁగాంచి, మోహితుఁడై, యామె రూపరేఖావిలాసములను మెచ్చుకొని మదనబాధాపీడితుఁడై, యనేకవిధములఁ దలపోసి,

చ. అనియని యుగ్గడించు, ధృతియుల్లలనాడినఁ దల్లడించుఁ, బై
కొనఁ దలపోఁతనించు, మదికోర్కులు పెచ్చిన నప్పళించు, నె
ట్టన తెగ నగ్గలించు, నచటన్ జనులం బరికించు, బుద్ధిదూ
లిన వెస నెంతయుం గళవళించు మనోజవికార మగ్నుఁడై.

విరాట 2-31

సీ. తన్వంగిమవ్వంపుఁ దనులత నెనఁగొడు
నునుఁగాంతివెల్లువ మునుఁగఁబాఱఁ
గిసలయహస్త కెంగేల నేపారుక్రొ
మ్మించను లేయెండ మిగులఁబర్వఁ

గమలాస్య ముద్దుమొగంబు లేమెఱుంగుల
మొత్తంబు పరిచుట్టు ముట్టికొనఁగ
ధవళాక్షి లొంగలి తఱచు తెప్పల చెన్న
కప్పును చీఁకటి గవియుదేర
గీ. బెగ్గలం బంతకంతకు నగ్గలింప
నొదవు చెమటతోఁ జిత్తంబు సెవరి యెందు
మెలఁగఁ దలఁపేది యాసింహబలుఁ డనంగు
పట్టియాడెడు జంత్రింబుపగిది నుండె. వి. 2-37

ఈ రెండుపద్యములందును కాముకుఁడైన కీచకుని చిత్తవిభ్రమమును ననురాగంపు కోర్కులును, ముట్టికొని, మన్మథునిచేతిలోఁ గీలుబొమ్మ వలె నతఁడాడింపఁబడెనఁట. శివుఁడు మదనునిచేతిలోఁ ద్రిప్పలువడెనని కదా చోడకవి వర్ణన. తిక్కన చోడకవు లిద్దరును కాముకుల మనోవికారమును వివరించుపట్ల దేశీయపదములనే కూర్చుటకాక, యొకే పదములను, నొకేవిధమగు దేశీయశబ్దములను, సదృశమైన భావవ్యక్తీకరణమున నుపయోగించిరి. ఇద్దరును నగ్గలించు, నప్పళించు అను దేశీయక్రియలను ప్రయోగించిరి. చోడకవి 'మైఁతీఁగ మవ్వంబు' అని వాడఁగ, తిక్కన 'మవ్వంపుఁ దనులత' యని కొంచెమునూర్చినాఁడు. చోడకవి 'పొలయించు, తుఱగలింప, తొంగలింప, రంగిల్లు, బత్తలించు మాకించు,' నను క్రియలను వాడఁగ, తిక్కన మునుఁగబాఱు, పర్వు, చుట్టుముట్టు, గవియుదేర' యను తెలుఁగుక్రియలను వాడినాఁడు. ఈ రెండు రచనలలోను భావవ్యక్తీకరణమును, భాషా ప్రయోగమునను పదముల నెన్నుకొనుటలో సమానసన్నివేశములలో దుల్యముగా నున్నవి. ఇందుచే కవిబ్రహ్మకు కవిరాజశిఖామణి పూర్వుఁడు గాన మార్గదర్శకుఁడైనాఁడని భావింపవలసి వచ్చుచున్నది. ఇట్లు కవితా శిల్పమున నిద్దరును సమానముగ రచించిరని యెంచనగును. ఇట్టి మనో

వివరణలేనిరచన కేవలము కథాకథనముగనే యుండునుగాని, పాత్రలు సజీవములుగానుండి పాఠకుల మనఃఫలకములందు ముద్రితములైనట్లుండవు. సంస్కృతకుమారసంభవమున కాళిదాసిట్టి రచనలేవియుఁ జేయలేదు. మారుండు తన వింట బాణమును తొడుగగనే పార్వతీ పరమేశ్వరులు గొంత పరస్పరానురాగముతోఁ జూచుకొని రనియు, తర్వాత శివుఁడు తన మనోవికారమునకుఁగల కారణమగు మన్మథుని వైపు చూచి యాతని దగ్ధముచేసినట్లు మాత్రమే కాళిదాసిట్లు రచించినాఁడు.

శ్లో. హరస్తు కించిత్పరిలుప్త ధైర్య
శ్చంద్రోదయారంభ ఇవాంబురాశిః
ఉమాముఖే బింబఫలాధరోష్ఠే
వ్యాపారయామాస విలోచనాని. 3-67

శ్లో. వివృణ్వతీ శైలసుతాఽపి భావ
మంగైః స్ఫురద్బాలకదంబకల్పైః
సాచీకృతా చారుతరేణ తస్థౌ
ముఖేన పర్యస్తవిలోచనేన. 68

శ్లో. అథేంద్రియక్షోభ మయుగ్మనేత్రః
పున ర్వశిత్వాత్తరసా నిగృహ్య
హేతుం స చేతోవికృతే ర్దిదృక్షు ర్దిశా
ముపాంతేషు ససర్జ దృష్టిమ్. 69

కాని పార్వతీపరమేశ్వరుల మనోవికార ప్రవర్తనమును మాత్రము కాళిదాసు చిత్రింపలేదు. ఆచిద్విలాసమునంతయు చోడకవి సుమారు 20 పద్యములలో వర్ణించినాఁడు. ఈ రీతిగ నాంధ్రకవి సంస్కృతకవి కంటె విపులముగ రచించుటచే గ్రంథవిస్తృతి జరిగినది.

పై చోడకవిరచనలో వృత్తములందు పార్వతి, సుకుమార పేశల మైన యంగవల్లియు, హంసాలసమందయానమును, వికచామలకోమల నీరజాస్యమును, నీలకుటిలాలికలును, లోలవిశాల నేత్రములును గల్గి, మరుదీపమువలె ప్రకాశింపఁగా, నామె దరహాసమును, రుచిరానన దీప్తులు నుద్దీపన విభావములై, శివు నాశగొల్పి, పారవశ్యము చేసిన వనియు, నదరెడు నామె మోవియు, నలికంబున వ్రేలాడు కను బొమలు, నామె శరీరకంపమును, గల్గిననూర్పులును, సమ్మోదవారియు నామెహృదయానురాగమును బైటకు వెలువరించినవని వర్ణించినాఁడు. ఇందు కోమలమైన పార్వతి యవయవములు, మధురమైన భావములను ద్యోతకము చేయువిధమును, మృదుపదప్రయోగమున చోడకవిచిత్రించి చూపినాఁడు. క్రింద గీతలుంచినచోట పదప్రయోగ మెంతయు హృద్యముగనుండి, కర్ణరసాయనముగ నున్నది. ఇందలి రసోచితమైన భావములు, భావోచితమైన పేశల పదప్రయోగమును స్తవనీయ ములు. వృత్తముల రచన తత్సమపద సమాసభూయిష్ఠమై నన్నయ కవితాశైలివలె సాగఁగ, మనోవృత్తిని వివరించిన పదములు దేశీయ పదశోభితమై తిక్కన శైలిని బోలియున్నవి. ఇది పార్వతీపరమేశ్వరుల పరస్పరానురాగఘట్టము.

విప్రలంభ శృంగారము :

పార్వతీపరమేశులపరస్పరానురాగము మన్మథునిచేఁ బ్రేరేపింపఁ బడి, మన్మథనాశనముచే విఘ్నముగల్గినదైనది. కామదహనానంతరము పార్వతి హిమవంతునిచే స్వగృహంబునకుఁ గొనిపోఁబడఁగ, నామె శివునిపై మరులుగొన్న కతన నక్కడ నామె యెడబాటుచే విరహానల బాధితయయ్యె. విరహ మొకవిధముగ బాధాకరముగ నుండునదైనను మఱియొకవిధముగ నది రమణీయముగనే యుండును. అందుచేతనే విప్రలంభశృంగార మెక్కువరసవంతముగా భావింపఁబడుట. నాయికా

నాయకులు సంభోగమునకు బూర్వము వారి ప్రియాప్రియులకై పడు మనోవికారవేదన భావము లిందు ప్రతిపాదింపఁబడును మనోహరముగ నుండును. విరహావస్థవలన వారి హృదయానురాగము దృఢపడుటకుఁ గారణమగును. అనురాగోదయమైన వెంటనే సంభోగశృంగార మనుభవించినచో స్థాయీభావము రసరూప మగుటకుఁ దగిన యవకాశముండును. విరహబాధ నాయికానాయకులకు పానకమందలి మిరియముపొడివలె కొంచెము కటువుగానుండినను, తరువాత ననుభవింపఁబోవు సంభోగశృంగారము పానకపుఁదియ్యందనమువలె నుండును. మఱియు పరస్పరానురాగోదయము నాయికానాయకుల ముగ్ధభావమునుండి లీలగానే వ్యక్తమగును. విరహావస్థలో నది ప్రకటితమగును. చోడకవి రచించిన పార్వతీపరమేశ్వరుల విరహావస్థ యిది.

వ. అట గిరిజ శిశిరగిరిపరికరస్పర్శంబు శిశిరోపచారంబుగా నెచ్చెలి,
కన్యాంతఃపురావర్తి యగుచు నంతకాంతకుని నిజాంతరంగం
బునం జింతించుచుండునంత నంతకంత కగ్గలించుచు, 5-104

చ. తలపులతిట్ట, భావములతానక, మానసపుట్టినిల్లు, గో
ర్కులనెలవీడు, వల్వగలకూట, మవస్థలజన్మదేశ, ము
మ్మలికలపేట, వేదనలమంద, మనోభవువేఁటపట్టు, మూ
ర్ఛలసహవాసమన్విరహసంతతతాపమునొందెఁ బార్వతిన్. 105

* * * *

వ. కళవళించి పరమేశ్వరుం దలఁచి మనంబునం దువ్విళ్లూరుచు

సీ. సురనదినురువులు జూటాంతరంబునఁ
గొవ్విరిజాదులకొమరుగాఁగ
బావకాంబకరుచి ఫాలతలంబునఁ
గాశ్మీరమయతిలకంబుగాఁగ

గరళాసితప్రభ గళమున వ్రాసిన
కస్తూరిపత్రభంగంబు గాఁగ
భాసురంబగు నిజపాండురాగద్యుతి
సదమలచందనచర్చగాఁగఁ

గీ. చారుతరమైన సహజశృంగారరూప
విభవసౌభాగ్యసంపద విస్తరిల్లు
నామహాదేవుతోఁ జిత్తమార నెలసి
కలసి రమియింప నెన్నఁడుగాంతునొక్కొ. 115

* * * * * *

వ. అంతం దనసంతాపంబువాపనోపక పరమేశ్వరురూపుచిత్రించి చూచిన, 118

చ. కలకలనవ్వినట్లు, దమకంబునఁ గన్గవవిచ్చి భావిలతల్ వాలయఁగఁజూచునట్లు, దనివోవఁగనిల్పియుఁ గౌఁగిలింపఁ జే తులువచరించున, ట్లదటుతోఁరతికేళికి నవ్వళించున ట్లెలమినటించుచుండె సతి కీశ్వరురూ పెదురంబ్రిసన్నమై. 119

* * * * *

వ. ఇది యంతయు హరునివలని విరహావ్యంజకం బగుచున్నయది యనిన, నెచ్చెలి నగజ గనుంగొని,

ఉ. ఆ దరహాసవాసలలితాస్యరుచుల్ దలుకొత్త, నప్పుడా హ్లాదముతోడఁ జూచి చనినప్పటి సమ్మదరాగలీల నాఁ డాదిగఁ బాయ కీశుఁడెద నప్పటికప్పటికొక్కభంగి న న్నాదటఁగూడియుండ విరహావ్యథనా దెసఁ బొంద నేర్చునే.125

వ. అని కల్పితపల్కులంబోయి, బయల్పడఁబల్కు వెలువలఁబాఱుచుఁ దనబహిఃప్రాణమైన ప్రియవయస్యపై నల్లన వ్రాలుఁడు. 126

గీ. ఉవిదమానసమున నుప్పొంగి వలరసం
బొక్క పెట్టతఱిమి కుక్కిడంబు
గాఁగనిండి త్రాల్మికట్టవ్వి వెలడెనా
వెడలె నశ్రువారి వెల్లిగొనుచు. 127

పై పద్యములందు పార్వతీవిరహావస్థ సరసముగ వర్ణింపఁబడినది. ఈ ఘట్టమునఁగొన్ని పద్యములు సాంకేతికముగను, సాంప్రదాయికముగఁ దీర్పఁబడినప్పటికి, నాంధ్రమున నిది ప్రథమప్రబంధ మగుటచే నపూర్వ రచనముగనే భావింపవలయును. తన మనోభావమును గిరిజ ముగ్ధయగుటచే గప్పిపుచ్చనెంచియు, నట్లుచేయఁజాలక యథార్థమునే బయలుపెట్టినది. తన ప్రియునిచిత్తరువును చిత్రించుకొని చూచుకొని యానందించిన దామె కన్యగాన. ఆ చిత్తరువులోని ప్రియుని రూప భావ విలాసాదికములు దనకోర్కెల కనుగుణముగా చిత్రితములై, యామె నువ్విళ్ళూరించుచున్నవి. తర్వాత నామెకు శిశిరోపచారము లను చెలికత్తెలుచేసి యోదార్చిరి. ఈ తంతునంతయు చోడకవి 63 పద్యములలో విస్తరించి రచించినాఁడు. కాళిదాసు సంస్కృతకుమార సంభవమున నీ విషయములనే యెత్తుకొనలేదు. పార్వతి కామదహ నానంతరము పితృగృహముచేరిన తర్వాత శివునియందు విరహము పొందెనని, పార్వతి తపముచేయునపుడు వచ్చిన మాయా వటువుతో నామె చెలికత్తెలు చెప్పినట్లుగా పంచమసర్గలో 54–58 శ్లోకములలో మాత్రము క్లుప్తముగావర్ణింపఁబడినది. కాని కథాకథనమునమాత్రము పార్వతీదేవి పితృగృహమును జేరనతర్వాత శివునిపొందుటలోవిఘ్నము గల్గుటవలన నిరుత్సాహముచెంది, తన మనోరథప్రాప్తికై తపము చేయఁగోరి పోయెనని కాళిదాసిట్లు తెల్పెను.

శ్లో. తథాసమక్షం దహతా మనోభవం
పినాకినా భగ్నమనోరథాసతీ

నినింద రూపం హృదయేనపార్వతీ
ప్రియేషు సౌభాగ్యఫలాహి చారుతా. 5-1

శ్లో. ఇయేష సా కర్తు మవంధ్యరూపతాం
సమాధి మాస్థాయ తపోభి రాత్మనః
అవాప్యతేవా కథ మన్యథా ద్వయం
తథావిధం ప్రేమ పతిశ్చ తాదృశః 2

కాని నైషధాది గ్రంథములందువలె చంద్ర మన్మథ మలయమారు తాది దూషణలుమాత్రము చోడకవి చేయలేదు.

ఇఁక శివునివిరహావస్థను కవి యెట్లు వర్ణించెనో చూతము.

వ. అంత నటచని కృతాంతాంతకుండు కంతులతాంతాస్త్రహతాంత
రంగుండై కాంతావియోగంబునం దురపిల్లుచు, 6-159

సీ. హిమవంతుఁ డింతి నాకీఁ దెచ్చు డెఱిఁగియు
నామాట లే నేల యాడనైతి
నతఁ డొండునానోడి యతివ నాకడనుంచి
యేఁగిన కన్నేల యెఱుఁగనైతి
నాబాల ననుగూడ నాసించుచున్నచో
మిన్నక తపమేల పన్నికొంటి
నెలనాఁగ నామీఁద నెలయింపవచ్చిన
భావజుతో నేల పగయుఁగొంటిఁ

గీ. తరుణివలరసంబు దఱిమి పైఁబడనున్న
నెఱి నెఱింగికూడ నేర కేల
శేలనైతి ననుచు బాలేందుధరుఁ డాత్మ
చింతవిడిచి విరహచింతఁ దగిలె. 160

మ. బొమలల్లార్చుచు, లోచనద్యుతులఁ బైఁ బూరించుచున్, మందహా
సమరీచుల్ దళుకొత్తఁ బల్కునోఁటవుల్ సంధించుచున్, లోలభ్రూ

వము సూచించుచు, నీశుమౌళిలనెలమిన్ వర్తింపఁజొచ్చెన్ మనో
రమణాం బార్వతిరూపవిభ్రమ, మహాఘోరాత్రింబు సాన్నిధ్యమై. 161

చ. హరునకుఁ జూడఁగా మహిఁ జరాచరరూపములెల్ల సన్నుతిన్
గిరిసుతరూపమై విరతభేదముఁ జెప్పఁదొడంగె, నట్లు కా
కరయఁగ నాదిశక్తి సచరాచరరూపము కావునన్ మహా
పురుషులకన్న కాన్కయనపోహము కాదు డిదేమిచోద్యమో. 162

వ. తదవసరంబున, 163

సీ. ఉరుకపర్దారుణ తరదీప్తులను మృదు
నవసహకార పల్లవవిభాతి
నీలకంఠప్రభాజాలంబు లనుసమ
దాలోలరోలంబమాలికలను
బాండురాంగామలబహుళదీధితు లను
పూర్ణచంద్రాతపాకీర్ణరుచులు
గంగాంబుశీకరోత్కలితాహినిశ్శ్వాస
ము లఘుందపవనంబుఁ బొందుచేసి

గీ. కాముఁ జంపినపగఁ దీర్పఁగడగి సూక్ష్మ
భావమునఁజొచ్చి చిత్తతాపావహంబు
లయ్యెనో కానాఁగ, శివుఁ డంగజాపహారి
యయ్యుఁ విరహాగ్నిఁబడి (వేగ) నలసిసొలసి. 164

మ. అలిధమ్మిల్ల, మృణాలహస్తఁ, గమనీయావర్తనాభిన్, మహో
త్పలగంధిన్, గలహంసయాన, విలసద్బంధూకరోష్ఠ, న
త్పలనేత్రిన్, గమలాస్య నంగజరసాంభఃపూరఁ దత్పార్వతీ
జలజావాసముఁ జొచ్చియాడక మనోజాతానలం బాఱునే. 165

ఉ. అత్తనుమధ్యరూపు గడునందముగాఁ గుసుమాయుధుండు నా
చిత్తమునందు రేఖగొని చిత్రము వ్రాసెనో, పోలుపొంద న

చూచితినో, నేర్పునం గలయనూన్చెనో గాకిది తన్మనోభవో
న్మత్తవికారమో, మదనుమాయయొ, నిక్కువమో తలంపఁ
గాన్. 166

వ. అని యనేకప్రకారంబులఁ ద్రిలోచనుండు రణరణకవ్యథా
కులితహృదయుం డగుచు నుండె. 167

పార్వతిరూపరేఖావిలాసములు శివునిమనస్సులో నహోరాత్రములు వర్తించి, లోకమందలి చరాచరరూపము లెల్లను పార్వతీరూపములుగాఁ బొడగట్టి, యనురాగాభివృద్ధి చేయుచుండెనఁట. మన్మథుఁ డామె రూపమును దన మనమునందుఁ జిత్తరువువలె వ్రాసినాఁడఁట. మఱియు, మన్మథుని దాను దగ్ధముచేసినందులకుఁ గసిదీర్చికొనుటకై తనమర్యాద మీఱునట్లు క్రూరముగా బాధించుచుండెనని శివుఁడు తలంచెను. ఈ శివుని విరహవర్ణనముగూడ కాళిదాసుని సంస్కృత కుమారసంభవమునందు లేదు. సంస్కృతమున పార్వతి తీవ్రతపస్సును వర్ణించినవెంటనే శివుఁడు మాయాబ్రహ్మచారి రూపమున నామె యొద్దకు వచ్చెనని యిట్లు వర్ణింపఁబడినది.

శ్లో. మృణాలికాపేలవ మేవమాదిభి
ర్వ్రతైః స్వమంగం గ్లపయం త్యహర్నిశం
తపశ్శరీరైః కఠినై రుపార్జితం
తపస్వినాం దూర మధశ్చకారసా. 29

శ్లో. అథాజినాషాఢధరః ప్రగల్భవా
గ్జ్వలన్నివ బ్రహ్మమయేన తేజసా
వివేశ కశ్చిజ్జటిల స్తపోవనం
శరీరబద్ధః ప్రథమాశ్రమో యథా. 30

కాని చోడకవి యాంధ్రకుమారసంభవమున పార్వతీ తీవ్రతపోవర్ణనానంతరము శివునివిరహతాపమును వర్ణించి, తర్వాత నామెనుజూచు

టకు మాయాబ్రాహ్మణవటురూపమునఁ బోవును. ఇఁక పార్వతీ పరమేశ్వరుల విరహవర్ణనలందు చోడకవి కొంత భేదమునుజూపినాఁడు. పార్వతి విప్రలంభమున ముగ్ధభావమును, లజ్జయు, దన ప్రియానురాగమును గుప్తముగానుంచు ప్రయత్నమును ద్యోతకముగాఁగ, శివుని విరహమున బహిరంగముగ తనయాత్మచింత యెట్లు విరహచింతగా మాఱెనో స్పష్టముగనే వ్యక్తీకరింపఁబడినది. ఇదే కదా స్త్రీపురుషుల స్వభావములందుఁగల వ్యత్యాసము. ఈ భేదమును కవి చక్కఁగా గుర్తించి, మనోగతవ్యాపారముల నుచితముగఁ బ్రతిపాదించినాఁడు. "బొమలల్లార్చుచు" అను పద్యమున పార్వతి హావభావవిలాసములతో నామె సుకుమార సుందరవిగ్రహ మెట్లు శివుని మనసున హత్తుకొని పోయినదో కవి చక్కఁగా చిత్రించిచూపినాఁడు. ఈ పద్యచిత్రము పార్వతివిరహమున శివునిరూపమును చిత్రలేఖనముగవ్రాసి యానందించిన "కలకలనవ్వినట్లు" అను పద్యచిత్రమునకుఁ బ్రతిగానున్నది. ఈ సందర్భములందు చక్కని కైశికీవృత్తి కవిచే గ్రహింపఁబడి, రచనలో ప్రసాదమాధుర్య గుణములు పరిపాలింపఁబడినవి. ఇందు దేశ్య తత్సమపదములు సమముగా వాడఁబడుటచే వర్ణనలు హృద్యములై కర్ణరసాయనముగా నున్నవి. ఇది విరహఘట్టము.

పరీక్ష :

నాయికానాయకులకు పరస్పరానురాగము దృఢముగానున్నను నాయకుఁడు ప్రచ్ఛన్నరూపమున నాయికను సందర్శించుసన్నివేశమును గల్పించి, యామె సౌందర్యమును బరికించి, యామెతో చమత్కార సంభాషణము నెఱపి, చివరకు నిజరూపమును బైటఁబెట్టుట యొక్క రసవంతమైన పద్ధతి. నలదమయంతులు, సుభద్రార్జునులు, పార్వతీ పరమేశ్వరులప్రణయచరిత్రలిట్టివి. ఈ పద్ధతి వీలుపడనిచోట ప్రథమ సందర్శనముననే, వివాహమునకుఁబూర్వము, నాయికా నాయకులకు

చమత్కార సంభాషణమును గల్పించుట హృద్యముగా నుండును. ఇట్టివి వరూథినీప్రవరాఖ్యులకు, నులీచ్యర్జునులకు జరిగినసంభాషణలు. కాన పార్వతీశివుల సంభాషణమును బరిశీలింతము. మాయా వటువు రూపమున శివుఁడు పార్వతితో సంభాషించినఘట్టమును చోడకవి కుమారసంభవమున వర్ణించినదానిని, శ్రీనాథకవిసార్వభౌముఁడు రచించిన హరవిలాసమునఁగూడ క్లుప్తముగ రచించినాఁడు గాన, చోడుని కవితాశక్తిని గుర్తించుటకు శ్రీనాథునిరచనతోఁ బోల్చి చూచిన, విశేషముగ వ్యక్తమగును గాన, నట్లుచేసి కాళిదాసు సంస్కృతమున నీ రమణీయసన్నివేశమును చిత్రించిన వైఖరిగూడ పరిశీలింపఁబడును. శివుఁడు మాయావటు రూపమున పార్వతి తపోవనమును బ్రవేశించి యామెచే నాతిథ్యమును బొందిన పిమ్మట, నామె "రూప సౌందర్య విభ్రమ విలాసములు గనుంగొని నిజాంతర్గతంబున నిట్లు మెచ్చుకొనె నట.

సీ. భూతిపూసిననింత వాడమెడుఁదను కాంతి
తోడసిన నెంత మెర్గడరియున్నో
వందికందిననింత వరలెడుముఖరోచు
లెలమిన నెంత సల్లలితమగునో
పొలయింపకయు నింత వెలిఁగెడుఁ జూడ్కు ల
ల్లార్చిన నెంత రమ్యంబులగునో
జడలుగట్టియునింత జక్కనైనది వేణి
దీర్చిన నెటు లెంత దేసియగునో

గీ. యీఁతవిడిచినమేఁదీఁగ యింతసయము
కలిగియున్నది వాడిక కలిగనేని
నెంత నవకమైయుండునో యింతి కనుచు
శివుఁడు గిరిరాజసుత విశేషించె నర్థి.

* * * * *

మానిని. ఆననలీల సుధాకరబింబ నవాంబురుహంబుల చెల్వగుటన్
వేనలి కృష్ణభుజంగకలాపి నవిస్తరభాసురమై చనుటన్
దానతిబాలికయయ్యుఁ దపం బుచితస్థితిఁ జేయుచునుండుట నీ
మానినిరూపచరిత్రలు దా రసమంబగుచున్నవి చిత్రగతిన్. 7-9

అని యీ మానినివర్ణనను మానినివృత్తమున చోడకవి విరోధాలంకారమున బహుచమత్కారముగా వర్ణించినాఁడు. పై సీసపద్యమున శివుఁడు పార్వతీ సౌందర్యమునుగూర్చి యూహించి తనయాశ్చర్యమును మనసులోఁ దలపోసినాఁడు. ఇందుచేనద్భుతరసము శృంగారమున కంగముగ చేసి చోడకవి యెక్కువరసవంతముగా వర్ణించినాఁడు. సంస్కృతమున నీసందర్భమున శివుఁడు పార్వతీసౌందర్యాభినందనముతో ప్రారంభింపక యామె క్షేమసమాచారములను విచారించుటతో మొదలిడి, ప్రయాణాయాసమును బొందినవానివలె శివుఁడు నటించినాఁడని కాళిదాసిట్లు రచించినాఁడు.

శ్లో. విధిప్రయుక్తాం పరిగృహ్య సత్క్రియాం
పరిశ్రమం నామ వినీయచ క్షణం
ఉమాం సపశ్యన్ ఋజునైవ చక్షుషా
ప్రచక్రమే వక్తు మనుజ్ఝితక్రమః. 32

శ్లో. అపి క్రియార్థం సులభం సమిత్కుశం
జలాన్యపి స్నానవిధిక్షమాణి తే
అపి స్వశక్త్యా తపసి ప్రవర్తసే
శరీర మాద్యం ఖలు ధర్మసాధనం. 5-33

కాళిదాసరచనకు సన్నిహితముగా శ్రీనాథుడు హరవిలాసమున నిట్లు వ్రాసెను.

తే. ఇవ్విధంబున నేతెంచి యెదుట నిలిచి
గౌరి నాశీర్వదించె నక్కపటవటుఁడు
కలితకోమలనవకుశగ్రంథి యైన
యంగుళీపల్లవములతోడి హస్తమెత్తి. హర 4-16

వ. పార్వతియు బహుమానపురస్సరంబుగా నయ్యుర్వీసురవటునకు నతిథిపూజయొనర్చె. అతండును గొండరాచూలి సేయుసత్కారం బంగీకరించి, ముహూర్తమాత్రంబున బరిశ్రాంతినపనయించి, మెయివడిచూపున జూచి ప్రస్తావోచితంబుగ నిట్లనియె. 17

సీ. సలిలంబు త్రిషవణస్నానక్షమం బౌనె
యంభోజపత్త్రదీర్ఘాయతాక్షి!
కుసుమంబులును సిధ్మకుశపల్లవంబులు
సులభంబులైయున్నె సుందరాంగి!
సత్త్వంబు లన్యోన్యజాతివైరముదక్కి
శాంతిగైకొనియున్నె చంద్రవదన!
యనుదినంబును దేహయాత్ర కాయితమౌనె
నీవారశాకాది వ్రా వ్రుఁబోణి!

తే. శక్తికొలఁది దపశ్చర్య సంఘటింతె
ఫలముపై నాన నాగ్రహబంధ ముడిగి
శ్యామబింబోష్ఠి ! ధర్మసాధనములందు
నాద్యమగుసాధనంబు దేహంబకాదె. 18

(సశేషము)

వ్యక్తి వివేకము

భాగవతుల కుటుంబరాయశాస్త్రి.

(గతసంచిక తరువాయి)

రెండు వస్తువులకుఁగల సాదృశ్య మన్యూనానతి రిక్తములగు శబ్దములవలననే వాచ్యమగుచో నది శబ్దశ్లేషయగును. (81) శబ్దశ్లేష,

(1) ధర్మి ప్రతిపాదక శబ్దవిషయము

(2) ధర్మ ప్రతిపాదక శబ్దవిషయము నని రెండు విధములుగ నున్నది. ఈ శ్లేషయందు ప్రధానములగు కర్త కర్మ క్రియ లను ప్రధానార్థములు భాసించి తీరవలయును. (82) ఇవి శబ్ద శ్లేషకు సంగ్రహ లక్షణము. ప్రసిద్ధ మగుటచే నర్థశ్లేష నిచట మేము వివరించుట లేదు. శ్లేషద్వయాభివ్యక్తికిని, యేదే నొక నిబంధన ముండవలయును. లేనిచో శ్లేషబంధోద్యమము వ్యర్థమగును.

ధర్మవర్థ శ్లేష కుదాహరణము.

"అత్రాన్తరే, ఫుల్లమల్లికా ధవలాట్టహాసః
కుసుమసమయయుగ ముపసంహరన్
అజృంభత, గ్రీష్మాభిధానో, మహాకాలః

అర్థము :— (1) ఈ లోపల, వికసించిన మల్లెలచే తెల్లనైన యంగడుల యొక్క వికాసము కలిగిన, గ్రీష్మ మను మహాకాలము, వసంతర్తు సంబంధి మాసద్వయము నుపసంహరింపఁ జేయుచు, విజృంభించెను.

(2) ఈలోపల, వికసించిన మల్లెలవలె తెల్లనైన నవ్వుగల మహాకాలుఁడు (ఈశ్వరుఁడు) కృతయుగమును నాశనము సేయుచు జృంభించెను. (నోరు తెఱచుకొనెను)

(అట్టము=అంగడి=అపణము;
అట్టహాసః= ఈశ్వరుని నవ్వు)

ఈ యర్థములలో మొదటిది ప్రస్తుతార్థము. రెండవ దప్రస్తుతము-గ్రీష్మ సమయమున కుచితములైన విశేషణముల సామ్యమున వలన మహాకాలుఁడను దేవతాప్రతీతి కూడ కలుగుచున్నది. అందుచే నిట సమాసోక్తియలంకారము భాసించును. ఈ యలంకారమే మహాకాలశబ్దము నావృత్తి చేయుటకు హేతువైనది. కేవలము మహాకాలశబ్దమే యుభయార్థ ప్రతీతికి హేతువుకాలేదను విషయము చెప్పఁబడును.

(మహాకాలశబ్దము, ధర్మివాచకము, కుసుమసమయయుగము కర్మవాచకము, ఉపసంహారణము క్రియా వాచకము ననున వన్నియు నిట నున్నవి. అందుచే నీ శ్లేష దుష్టము కాదు)

నిబంధనము లేనిచో, నా శ్లేష దుష్టమే యగును. ఉదా॥

"ఆచ్ఛాదితాయత దిగంబర ముచ్చకైర్గా
మాక్రమ్యచ స్థిత ముదగ్ర విశాలశృంగమ్,
మూర్ధ్నిస్ఖలత్తుహినదీధితి కోటి మేన
ముద్వీక్ష్య కో భువి నవిస్మయతే గిరీశమ్॥

అర్థము:—ఆచ్ఛాదితాయత దిగంబరమ్=వ్యాపింపఁబడిన విశాలములైన దిక్కులు, ఆకాశమునుగలట్టియు, (ధరింపఁబడిన విశాలమైన దిక్కులనెడు వస్త్రములు గలట్టియు) ఉదగ్ర విశాలశృంగమ్=ఎత్తును విశాలమునునగు శిఖరములుగలట్టియు, ఉచ్చకైః, గామ్=ఉన్నతమైన భూమిని, ఆక్రమ్య స్థితమ్=ఆక్రమించి యున్నట్టియు (ఉదగ్ర విశాల శృంగమ్=పెద్దవియు, విశాలములు నైన కొమ్ములు గల, ఉచ్చకైః, గామ్=ఎత్తైన ఎద్దును, ఆక్రమించి కూర్చొని నట్టియు నని శివపరమగు నర్థము) మూర్ధ్ని= శిరసునందు, స్ఖలత్ తుహిన దీధితికోటిమ్ = భాసించుచున్న చంద్రుఁడు గలట్టియు, ఏనమ్ గిరీశమ్=ఈపర్వత రాజును (ఈ యీశ్వరుని) ఉద్వీక్ష్య=చూచి, (సాక్షాత్కరింపఁజేసికొని) భువి=భూమిలో, కః-ఎవఁడు, న, విస్మయతే=ఆశ్చర్యపడఁడు?

ఇచట గిరీశపదము నావృత్తిసేసి, రెండర్థములను చెప్పుటకుఁ దగిన కారణ మేమియుఁ గనుపడదు. చెప్పవలసిన హేతువును చెప్ప కుండుటచే నిట అవాచ్యవచనదోషమున్నది.

ప్రశ్న :—"శ్వేతో ధావతి" అను వాక్యమునకు సందర్భము ననుసరించి (1) శ్వేతః=తెల్లనిది (గుఱ్ఱము), ధావతి=పరుగెత్తుచున్నది, అని కాని శ్వా=కుక్క, ఇతః ధావతి=ఇచ్చటినుండి పరుగెత్తు చున్నది అనికాని, రెం డర్థములను జెప్పవచ్చును. దీపము, మనము చూడఁదలచిన వస్తువులనేకాక ఇతరపదార్థములనుగూడ ప్రకాశింపఁ జేయును. అటులే శబ్దము గూడ నవివక్షితార్థమును సైతము చెప్పవచ్చును. దీనిని తన్త్రమందురు. ఇట్లు ప్రకరణ (ప్రసంగ) వశమునఁగాని తన్త్రమువలనఁగాని గిరీశశబ్దము రెండర్థములను చెప్పవచ్చును గదా!

సమాధానము:—మీవాదము సరియైనదికాదు. పై వానిలో దీపము, సహజముగనే, ప్రతిపత్తృ పరామర్శతో నిమిత్తము లేకయే ఇతర పదార్థమును ప్రకాశింపఁజేయును. శబ్ద విషయమున నిట్లనుట యుచితము కాదు. ప్రతిపత్తృ పరామర్శ నపేక్షింపక, శబ్ద మర్థాన్తరమును భాసింపఁజేయదు. పరామర్శ నిర్నిబంధముగ నుండదు. ఉండవచ్చు ననుచో నతిప్రసంగ దోషము వచ్చును. ఇచట నేమియు నిబన్ధనము లేదు. అందుచే శ్లిష్టార్థశబ్దాన్వేషణ ప్రయాసము కవికి వ్యర్థము.

మఱియొక యుదాహృతి:—

విదధతః పథిక క్షపణం ప్రతి
స్మృతిభువో, నిజశక్త్యుపబృంహణమ్
దధు, రహార్యభటా, స్సహకారితాం
అనవమా, నవమాధవ సంగినః.

అర్థము:—నవమాధవ సంగినః=క్రొత్తవసన్తర్తు సంబంధము గలట్టియు, పథికక్షపణంప్రతి=పాన్థవినాశమును గుఱించి, నిజశక్త్యుప

బృంహణమ్=తన శక్తియొక్క వృద్ధిని, విదధతః=చేయుచున్న, స్మృతి భువః=మన్మథునకు, అనవమాః=ఉత్కృష్టులైన (తక్కువవారు కాని) అహార్యభటాః=అడ్డగించుటకు వీలులేని, భటులు (పర్వతములనెడు భటులు) సహకారితామ్=సహకరించుశీలమును (మామిడిచెట్ల సంబంధమును) దధుః=కలిగియుండిరి.

ఇచట సహకార శబ్దమునకు- సహకరణ శీలత్వము, సహకార సంబంధము, (సహకారః=మామిడిచెట్టు) అను రెం డర్థములు వివక్షితములు. ఇవి రెండును శ్లేష వలన సిద్ధింపవలయును. కాని అందులో రమ్యతాతిశయముగల యర్థ మొకటియే (సహకారసంబంధ రూపము) స్ఫురించును. నిబంధనము లేకుండుటచే రెండవ యర్థము ప్రతీతము గాదు. వాచ్యము గావలసిన, యా నిబంధన ముపాత్తము గాకుండుటచే, నిట నవాచ్యవచన దోష మున్నది.

సంగ్రహ శ్లోకార్థము :—

ఒకపద మే, సంకేతస్మృత్యనాకాంక్షమై, దీపమువలె, సహజముగ నే, యనేకార్థ ప్రతీతిని కలుగఁజేయుచో నది తన్త్రమునకు విషయము. (85) అర్థభేదము వలన శబ్దభేదము కల్గును. అందుచే శబ్దమున కేకత్వము సిద్ధింపదు. సాదృశ్య విప్రలబ్ధమైన లోకము శబ్దైకత్వమును నిశ్చయించును. (86) ఏతావన్మాత్రమున శబ్దమున కనేకార్థవృత్తిత నంగీకరింపఁగూడదు. అందువలననే ప్రసంగమునకు శబ్దము విషయము గాదు. (87) నిబంధనము లేనిదే శబ్ద మర్థాన్తరమును దెలుపదు. ఆ నిబంధన మనేకవిధము. అది అవ్యయము. (ఇవాది శబ్దము) కావచ్చును. లేదా అనవ్యయము (సదృశాది శబ్దము) కావచ్చును. (88)

అందుచే అర్థాన్తర వ్యక్తికి, హేతు వేదియు లేనపుడు, శ్లేషబంధనిర్బంధము, కవికి, క్లేశమునే కలుగఁజేయును. (88)

ధర్మార్థమున కుదాహరణము :—

ప్రకట కులిశకున్త చక్రి భాస్వత్

పరవలభీహిత మత్తవారణాంకా,

దిశిదిశి దదృశే నిశాన్త పంక్తిః

సమరవిమర్దభువం విడంబయన్తీ॥

అర్థములు :—ప్రకట.....వారణాంకా- ప్రకట=స్పష్టమైన, కులిశకున్త=కులు లనెడు పక్షుల (పిచ్చుకల) యొక్క, చక్రి=సమూహముచే, భాస్వత్, పర, వలభీ, హిత, మత్త వారణాంకా=ప్రకాశించు, ఎత్తైన, వలభుల కనుగుణమైన, మత్తవారణములు గల (ఏనుగుల యాకారము గలశిల్పము), నిశాన్త పంక్తిః=అంతఃపురముల వరుస, సమరవిమర్ద భువం=యుద్ధభూమిని, విడంబయన్తీ=పరిహసించుచున్నదై, దిశి దిశి=ప్రతిదిశయందును, దదృశే=కన్పడెను. ఇచట, ప్రకట...వారణాంకా అనెడు సమాసము, యుద్ధభూమికి సరిఁయగు నర్థమును గూడ నిచ్చును. "ప్రకటములైన, కులిశములు, కున్తములు చక్రములు నను నాయుధములచేప్రకాశించు పరబల (శత్రుసైన్యము) మునకు, భయమును కలిగించుటకై యుంచిన, ఏనుఁగుల చిహ్నములు గల" యనునర్థము సమరభూమి కన్వయించును.

యుద్ధభూమిని పరిహసించుచున్న దనుటచే నిచట వ్యతిరేకాలంకారమున్నది. శ్లేషాభివ్యక్తికిఁ గూడ నిదియే యిట హేతువు.

వేఱొక యుదాహృతి :—

ఉషసి విగలితాన్ధకారపంక

ప్లవశబలం ఘనవర్త్మ దూరమాసీత్,

మధురతరణి తాపయోగతారం

కమలవనే మధుపాయినాంచ పంక్తిః

అర్థము :—ఉషసి—ఉషఃకాలమున, విగలిత, అన్ధకార, పంక, ప్లవ, శబలమ్=పోయిన, చీకటి యనెడు బురదయొక్క, అనవస్థాన ముచే, విచిత్రమైన; ఘన వర్త్మ=(మేఘ మార్గము) ఆకాశము, దూరమ్=ఎక్కువగా; మధుర, తరణి, తాప, యోగ, తారమ్= సుకుమార మైన, సూర్యుని ఎండయొక్క, సంబంధముచే, మనోహర మైనది, ఆసీత్=అయ్యెను.

కమలవనే=కమల వనమునందు, మధుపాయినామ్, పంక్తిః, చ=తేనెటీగల పంక్తి కూడ; విగళిత, అన్ధకార పంక ప్లవ, శవ, లంఘన, వర్త్మ, దూరమా=తొలగిన చీకటి యనెడు బురదయొక్క అనవస్థితి యనెడు, శవముయొక్క దాటుటచే, కనుతెప్పల యందలి, అరమణీయశోభ కలిగినది. మధు, రత, రణితా=తేనె యందలి ఆసక్తిచే ధ్వని కలిగినది, పయోగతా=నీటియం దున్నది, అరం=అధిక ముగా, ఆసీత్=అయ్యెను.

ఇచట చశబ్దము (కూడ-అను శబ్దము) శ్లేషాభివ్యక్తిహేతువు. (గ్రంథకర్త దీనిని ధర్మార్థశ్లేషకే యుదాహరణముగ నిచ్చినను, ఘన వర్త్మయనను, నుపమేయవాచక శబ్దముగూడ శ్లేషలో నంతర్భావము నొందుట వలన నిది ధర్మి ధర్మోభయార్థ శ్లేష యని యనఁదగు నని వ్యాఖ్యాతలు)

ధర్మి ధర్మోభయార్థశ్లేషయు నుండవచ్చునని కొందఱందురు.

ఉదా :- "అనవరతనయన సలిల సిచ్యమాన, స్తరురివ విపల్ల వోఽపి, సహసైధా, ప్రరోహతి"

అర్థము :- అనవరత, నయన సలిల, సిచ్యమానః=ఎడతెగని కన్నీటిచే తడుపఁబడుచున్న, విపత్, లవః అపి=ఆపదయొక్క లేశము గూడ, అనవరత, నయన, సలిల సిచ్యమానః=ఎడతెగని, ప్రాపణము (తీసికొనిపోవుట) గల,నీటిచే తడుపఁబడినదై,విపల్లవోఽపి=చిగురాకు

లేనిదై ః, తరురివ = చెట్టువలె సహస్రధా=అనేకవిధముల, ప్రరో హతి=వృద్ధినొందును, అంకురించును.

ఇచట, విపల్లవ శబ్దము, ఆపదయొక్క లేశమనునపుడు ధర్మి వాచకము 'చిగురుటాకు లేని' యను నర్థమున ధర్మవాచకము నగుటచే ధర్మిధర్మోభయశ్లేష, యీ శ్లోకమున నున్నదనుచున్నారు. అది యుక్తము కాదు. విపల్లవశబ్దము ధర్మి ధర్మార్థములను రెంటిని చెప్పినను, ధర్మార్థత్వము దానికున్నదనుట యుచితముగాదు. ధర్మార్థత్వము నంగీకరింపవలయునన్న, నది యుపమానమగు తరుశబ్దమునకు విశేషణము కావలయును. అపుడది యావృత్తము కావలయును కాని, "ఆపల్లేశమ"ను నుపమేయార్థమును చెప్పుటచే చరితార్థమైన విపల్లేశ శబ్దము నావృత్తము చేయుటకు ప్రమాణములేదు. ఆ వృత్తిలేనపుడుపమానమునకు విశేషణముగ నన్వయించుట యసంభవము. ఆ వృత్తిలేకున్నను, నుపమానమునకు విశేషణముగ నన్వయింతుమేని, విపల్లవశబ్దమున కుపమేయ స్వరూపాపహారప్రసంగము కలుగును. అందుచే విపల్లవ శబ్దమునకు ధర్మార్థత్వము కుదురదు.

ఒకపదము, ప్రధానమైన యర్థమును బోధింపక, యప్రధానమగు నర్థమునే బోధించుచో, నది యుపయుక్తార్థమైనను, నిబంధనమున్నచో, దాని నావృత్తిసేయవచ్చును.

ఉదా :- "సానుస్థితి ర్జనక రాజసుతేవ భాస్వత్
అంకోల్లపల్లవతయా శ్రియమేతి యస్య.

అర్థము :- యస్య, సాను, స్థితిః=ఏ పర్వతపు చఱియ(లోయ)ల యొక్క స్థితి; భాస్వత్, అంకోల్ల, పల్లవతయా=ప్రకాశించు అంకోలవృక్షముల యొక్క చిగురుటాకులు గలిగియుంటచే; భాస్వత్, అంక, ఉల్లపత్, లవతయా=ప్రకాశించు, అంకమునందు, మాట్లాడు,

చున్న, లవుఁడను పుత్రుఁడు కలిగియుండుటచే జనకరాజను తేవ=సీత వలె, శ్రియమ్, ఏతి=శోభనొందుచున్నదో.

ఇచట "భాస్వదంశోల్ల పల్లవతయా" యను శబ్దము ప్రధానములైన యుపమానోపమేయములలోనే యొకయర్థమును దెలుపుట లేదు. ఆ రెంటికిని విశేషణముగనే యన్వయించినది. అది ప్రధానార్థముగాదు అందుచే నుపమేయమున కన్వయించి, యొక యర్థమును చెప్పినను, ఆవృత్తమై యుపమాన విశేషణపరమగు నర్థమును గూడ బోధించినది. ఇట్టి స్థలములయం దావృత్తి యుచితమే.

"అనవరత నయన" యను వాక్యమునందు, విపల్లవశబ్దము యొక్క యావృత్తియే, యుపమాన సంబంధబుద్ధికి నిబంధము. ఇచ్చా ద్వ్యయము కాని, అన్వయమగు నలంకారాంతరము గాని, హేతువు కాదని తెలియవలెను.

ఒకశబ్దము ప్రధానాప్రధానార్థములను రెంటిని చెప్పునదైనను, ప్రధానార్థసంస్పర్శయున్నందు వలననే (అప్రధానార్థమును బోధింపలేదను కారణమున) యాశబ్దమును రెండు పర్యాయములు ప్రయోగింపవలయునని చెప్పినప్పుడు, ప్రధానార్థమును మాత్రమే చెప్పు శబ్దమును రెండు పర్యాయములు ప్రయోగింపవలయునని వేఱుగఁ జెప్పవలయునా ?

ఉదా :- "బ్రధ్నస్యేద్ధా రుచి ర్వో రుచిరివ
రుచితస్యాప్తయే వస్తునోఽస్తు"

అర్థము :- రుచితస్య = ప్రాప్తాభిలాషుఁడైన వానియొక్క, రుచిరివ=అభిలాషవలె, బ్రధ్నస్య=సూర్యునియొక్క, ఇద్ధా,రుచిః= ఉజ్జ్వలమైన, కాన్తి, వః=మీకు, వస్తునః=వస్తువుయొక్క, ఆప్తయే అస్తు=పొందుట కగుఁగాక.

ఇచటనున్న "రుచి" శబ్దములు రెండును విశేష్య వాచకము లగుటచే ప్రిథానార్థములను బోధించుచున్నవి. అందుచే నా శబ్దమును కవి, రెండు పర్యాయములు ప్రయోగించినాఁడు.

ఉదా:—

"ఖలతామ్ ఖలతా మివాసతీం, ప్రతిపద్యేత కథం బుధో జనః"

ఇచట "ఖలతా" శబ్దములు రెండును ప్రిధానార్థ వాచకములే.

ప్రశ్న:—"అనవరత" యను వాక్యమున, నావృత్తికినిబంధనమైన, 'ఇవ' శబ్ద మున్నది గదా! అట్లున్నపుడు, "ప్రిధానార్థసంస్పర్శ యుండుటచే విపల్లవశబ్దమునకు, ద్విరుపాదానప్రసక్తి యెట్లు కలుగును?

సమాధానము:—సత్యమే కాని, ఆ "ఇవ" శబ్దము, తరువునకును, విపల్లవమునకును, ఉపమానోపమేయభావ ద్యోతనమాత్రము ననే చరితార్థ మైనది. అందుచే, తరువునకును, విపల్లవ శబ్దమునకును, తిరిగి, విశేష్య విశేషణ భావమును బోధించు సామర్థ్య మా "ఇవ" శబ్దమున కుండదు.

ప్రశ్న:—విపల్లవశబ్దమునకు, తరువునకు విశేషణముగ నన్వయించుటకు యోగ్యమైన యర్థ మున్నది. అదియు, తరు శబ్దమును నొకే విభక్తియం దుండుటచే, నా రెంటికిని సామానాధికరణ్యము గూడ నున్నది. ఇట్లు ఆకాంక్ష, సన్నిధి, యోగ్యత లుండుటచే, తరు విపల్లవ శబ్దములకు విశేష్య విశేషణ భావప్రతీతి కలుగుచున్నదిగదా! అది లేదనుట యెట్లు?

సమాధానము:—అంతమాత్రమున విశేష్యవిశేషణ భావము నంగీకరింతుమేని, "విపల్లవః తరురివ" విపల్లవము తరువువలె నున్నది. "సచతరు ర్విపల్లవః" ఆ చెట్టు, విపల్లవము (పల్లవములులేనిది) అను రెండు వాక్యములు చెప్పవలసి యుండును. అపుడు వాక్యభేద ప్రసంగము కలుగును. అది దోషము.

ప్రశ్న:—"అనవరతజలసిచ్యమాన" యను విశేషణవాచక పదమునకు, రెండర్థము లుండుటచే, పూర్వము తెల్పిన రీతిని, సమాసోక్త్యలంకారము ప్రతీతమగును. దానివలన, 'తరు, విపల్లవ' శబ్దములకు విశేష్య విశేషణ భావసంబంధము భాసింపవచ్చును గదా!

సమాధానము :—అది యుచితము గాదు. ఉపమేయ సాధారణవిశేషణబలమువలనఁగాని, అప్రస్తుత కార్యసమారోపమువలనఁగాని, ఉపమానమైన, వేఱొక ధర్మి, గమ్యమానమైనపుడే, సమాసోక్త్యలంకారము భాసించును. ప్రస్తుతము "తరురివ" యనువాక్యమున నుపమానము వాచ్యముగ నుపాత్తమైనది. అందుచే నిట ననేకార్థపదోపాదాన ప్రయాసము వ్యర్థమే యగును.

అందువలన, సలిలసిచ్యమానత్వము, సహసాధాప్రరోహము ననుసమానధర్మముల నాధారముగఁ జేసికొనియే, యిట తరు, విపల్లవ శబ్దముల కుపమానోపమేయ భావమును చెప్పుకొన వలయును. శ్లేషను చెప్పుట తగదు. ఇచట శ్లేష యున్నదనుట భ్రాన్తిమాత్రమే. ఉదా।

"క్వచిత్ తరుతల వివరవర్తినో బభ్రవః
క్వచిత్ స్వచ్ఛన్దచారిణో హరితాః
క్వచిద్ జటావల్కలా వలంబినః కపిలాః"

ఇచట శ్లేష నాధారముగఁ జేసికొని, దావాగ్ని వర్ణిత మగుచున్నది. అరణ్యాగ్నులు—క్వచిత్ =ఒకానొక చోట తరు—వర్తినః =తరుతలముల వివరములయందున్నవై; కపిల వర్ణముగలిగి యున్నవి. (బభ్రవః=కపిలవర్ణము గలవి)

ఒకానొకచో, స్వచ్ఛన్దముగ సంచరించుచు హరితవర్ణముగ నున్నవి. (హరితాః=హరితవర్ణము గలవి) ఒకానొకచో, వృతమూలములను, బెరడును ఆశ్రయించినవై కపిలవర్ణము గలిగియున్నవి.

రెండవయర్థము:—ఒకచో తరుతలవివరములయందున ముంగిసలు (బభ్రవః) ఒకచో స్వేచ్ఛగసంచరించు లేళ్ళు (హారిణాః) ఒకచో జడలను, నారచీరెలను ధరించు మునులు (కపిలాః)

ఇచట హారిణాః, బభ్రవః, కపిలాః అను పదములు దావాగ్ని పరముగ నర్థమును జెప్పినపుడు దావాగ్నికి విశేషణములు అనఁగా, ధర్మార్థములు; లేడి, ముంగిస, ముని లను నర్థములను తెలుపునపుడు విశేష్యార్థములు (ధర్మ్యర్థములు). ఇట్లు శ్లేష యున్నట్లు కన్పడినను అది భ్రాన్తి మూలమే. అర్థశ్లేష విషయమునఁ గూడ నిట్లే తెలియ వలయును.

ఉదా:— "సమన్తతః కేసరిణాం వసన్తం
భీమంచ కాన్తంచ వపుర్వహన్తమ్
విలోక్య దూరాత్ తరసాభిమానో
దుర్వారణః క్వాపి గతః సమత్తః"

అర్థము:—1. సమన్తతః=అంతటను, కేసరిణాం=కేసరపుష్పములు గలిగినట్టియు, భీమం=భయంకరము (వియోగి జనులకు) కాన్తం=మనోహరమునగునట్టియు (శృంగారులకు) వపుః=స్వరూపమును, వహన్తం=కలిగి యున్నట్టియు, వసన్తమ్=వసంతర్తువును, దూరాత్=దూరమునుండియే, విలోక్య=చూచి, దుర్వారణః=ఆపుటకు శక్యము కాని, అభిమానః=అభిమానము, తరసా=వెంటనే, మత్తః=నానుండి, క్వాపి=ఎచ్చటికో, గతః=వెళ్ళినది.

(2) భయంకరమును, కాన్తమును నగు శరీరము గలట్టియు అంతటను నివసించుచున్న (వసన్తమ్) కేసరిణామ్=సింహమును, చూచి అభిమానః=ఎత్తైన (పెద్ద), మత్తః=మదించిన, దుర్వారణః=దుష్టగజము, ఎచ్చటికో వెళ్ళినది.

ఇచట కేసరి, దుర్వారణ శబ్దములు, వసన్తాభిమాన శబ్దములను, నొక యర్థమున విశేష్యములుగను మఱియొక యర్థమున విశేషణములుగను, నన్వయించినవి. అందుచే నవి ధర్మి ధర్మోభయార్థములు. ('కేసరిణమ్' అనునది విశేష్యమైనపుడు, వసన్తమనునది విశేషణము. వసన్త మనునది విశేష్యమైనపుడు 'కేసరిణమ్' అనునది విశేషణము. అట్లే దుర్వారణాభిమానశబ్దములు) వసన్తాభిమానశబ్దములు రూప్యములు. కేసరిదుర్వారణములు రూపకములు. ఇట్లా శబ్దములకు విశేషణ విశేష్య భావమో, రూప్య రూపక భావమో, యుపనిబద్ధమైనది. అది అయుక్తము. విశేషణము పరతంత్రతా లక్షణముగలది. విశేష్యమునకు స్వతంత్రత లక్షణము. ఈ రెండును పరస్పర విరుద్ధములు. ఇట్టి యీ రెండర్థములను, నొక పర్యాయము మాత్రమే ప్రయుక్తమైన శబ్దము బోధింపలేదు. రెండు పర్యాయములు ప్రయోగించినచో నవి భిన్నార్థకములేయగుటవలన నేమియు దోషముండదు.

ఉ:—"అలిభి రంజనబిందుమనోహరైః
కుసుమపంక్తి నిపాతిభి రంకితః
నఖలు, శోభయతిస్మ, వనస్థలీమ్
న, తిలక స్తిలకః, ప్రమదామివ"

అర్థము :—అంజన (కాటుక) బిందువుల వలె మనోహరములై నట్టియు, కుసుమపంక్తియందువ్రాలునట్టియు, తుమ్మెదలతోనున్న తిలకవృక్షము, స్త్రీని, తిలకము (బొట్టు) వలె, వనస్థలి నలంకరించుట లేదని లేదు. (అలంకరించుచున్నది) ఇచట తిలక శబ్దము ద్విరుపాత్తమైనది.

సమస్తతః- అను శ్లోకమున నాశబ్ద ములకు ద్విరుపాదానము లేదు. అందుచే నట నవాచ్య వచనదోష మున్నది. ఉభయార్థాభివ్యక్తికి నిబంధనములైన యివాది శబ్దములుగాని,సమాసోక్త్యాద్యలం

కారములు గాని యున్నచో, నా యర్థములకు, ప్రధానేతర భావాభి వ్యక్తి కలుగును: అపుడు విశేషణ విశేష్య ప్రతినియమము సేయుట యుక్తమే యగును.

ఉదా॥

"అతిగంభీరే భూపే కూపఇవ జనస్య నిరవతారస్య
దధతి సమీహితసిద్ధిం గుణవన్తః పార్థివా ఘటకాః

అర్థము :—అతి గంభీరమైన (లోతైన) బావియందు, (మెట్లు లేకుండుటచే) దిగుటకు వీలులేని మనుష్యునకు, తాటితోనున్న చిన్న కుండల వలె (గుణవన్తః ఘటకా ఇవ, గుణః=త్రాడు, ఘటకాః= చిన్నకుండ) అతిగంభీరుఁడైన రాజును సమీపించుటకు వీలులేని మను ష్యునకు, ఘటకులు (సమర్థులు) గుణవన్తులునగు పార్థివులు(రాజులు) సమీహితసిద్ధిని కలుగఁజేయుదురు.

ఇచట గుణవన్తః, ఘటకాః అను శబ్దములకు విశేషణ విశేష్య భావము 'ఇవ' శబ్ద నిబంధనము. పార్థివాః అను శబ్దమునకు పృథివీ సంబంధమైన అను నర్థమునుచెప్పి, 'ఘటకాః' అను పదమునకు విశేష ణముగఁ జేసి మట్టికుండలని చెప్పినపుడు, పార్థివ శబ్దమునకుఁ గూడ శ్లేష యున్నదని యనవచ్చును గాని యది సరికాదు. పార్థివ శబ్దము రాజను నర్థమున, నుపమేయము. అందుచే దానికి ప్రాధాన్యమున్నది. దానిని విశేషణముగఁ గూడ నన్వయింతుమేని, ప్రాధాన్యము పోయి స్వరూపాపహార ప్రసంగమే కల్గునని యింతకు మున్నే చెప్పితిమి.

మఱియు "మత్త" శబ్దమును రెండుపర్యాయములు ప్రయో గించినను, నా రెండు శబ్దములును భిన్న విభక్తులలో నుండుటచే నర్థ శ్లేష కుదురదు. అందుచే నచట శ్లేషాభిమానము భ్రాన్తిమూలకమే.

మఱియొక విశేషమునుగూడ గుర్తింప వలయును. శబ్దశ్లేషకుఁ జెప్పినలక్షణము వాక్యములోని "శబ్దనూ తేన్రి" యను పదములోని

'మాత్రి' పదము సాభి ప్రాయము. ఉపమానముతో సమానాధికరణ మైనను, వ్యధికరణ మైనను, యోగ్యమైన రెండు శబ్దములను గూడ గ్రహింపవచ్చు నని 'మాత్రి' పదము తెలుపును. అందుచే లింగ, వచన, విభ క్తి విశేష యోగమువలన, నే యుపమేయార్థమున కే యుపమానార్థముతో, సామానాధికరణ్య వైయధికరణ్యముల వలన, నన్వయార్హత కలుగునో, దానితోఁగూడ, సాదృశ్యముఁ జెప్పవచ్చు నని యనుజ్ఞ నిచ్చుట యైనది.

లింగ విశేష యోగమున కుదాహృతి :—

ఉషసి విగలితాన్ధకారపంక ప్లవశబలం ఘనవర్త్మ దూరమాసీత్
మధురతరణి తాపయోగతారం కమలవనే మధుపాయినాంచ పంక్తిః

ఇచట "పంక్తిః" స్త్రీలింగమునం దున్నది. "ఘనవర్త్మ" నపుంసక లింగమునందున్నది. అయినను "చ"కారముండుటవలన, శ్లేషాభివ్యక్తి కలిగినది. విశేషణములు, పై రెంటికిని నన్వయించినవి.

వచన విశేష యోగము :—

"విఘటిత తిమిరౌఘ దిక్ప్రబంధ ప్రకటనభస్యథ భవన్నిశావసానే
స్ఫుటదలనమనాశ్చ పద్మషండా స్సపది హిమేతర దీధితిచ్చ తేషామ్'

అర్థము:—నిశావసానమున, తిమిర సమూహము, దిక్సమూహమును వదలినది. ఆకాశము స్వచ్ఛముగ నున్నది. అపుడు, పద్మ మండములు, సూర్యుఁడును, స్ఫుటదలనమనస్కు లైరి. పద్మషండ ములు—వికసించిన, దళ, (రేకులచే) నమనము (వంగుట) కల్గిన వైనవి. సూర్యుఁడు ఆ పద్మములను, స్ఫుటముగా, దలనము సేయుట యందు (వికసింపఁ జేయుటయందు) ఆసక్తి కలవాఁ డైనాఁడు. ఇచట "పద్మ షండాః" బహువచనముననున్నది. "హిమేతరదీధితిః" ఏకవచనమున నున్నది. అయినను, "స్ఫుటదల నమనాశ్చ"యను విశేషణ మీరెంటి కిని నన్వయించును. అసఁగా నాపదమావృత్త మగును. ఇట శ్లేష

యున్నది. చకారము శ్లేషనిబంధనము.

“తనుత్వరమణీయస్య మధ్యస్యచ భుజస్యచ
అభవన్నితరాం తస్యా వలయః కాన్తివృద్ధయే॥

అర్థము:- తనుత్వముచే ((1) కృశత్వము (2) కోమలత్వము. రమణీయ మైన, మధ్యమునకు (నడుము) భుజమునకును, వలులు, (ముడుతలు) వలయమును (కంకణమును) కాన్తివృద్ధిని చేకూర్చినవి ((1) వలయః=ముడుతలు (2) వలయః=కంకణము)

ఇచటఁగూడ, వలయశబ్ద మొక్కయర్థమున బహువచనము. మఱియొక యర్థమున నేకవచనము. శ్లేష, చకార నిబంధనము. పై రెండు శ్లోకముల యందును, క్రియలను గూడ నొకసారి ఏకవచనమునను, మఱియొకసారి బహువచను మందును అన్వయించుకొనవలయును.

విభక్తి విశేష యోగము :—

“సరస మన్థర తామర సోదర
భ్రమరసజ్జలయా, నలినీ, మధౌ
జలధి దేవతయా, సదృశీం, శ్రియం
స్ఫుటతి రాగత రాగరుచిం, దధౌ”

అర్థము :— సరస, మన్థర, తామర సోదర, భ్రమర, సజ్జ, లయా (ప్రథమావిభక్తి) సరసము, మన్థరమునై, (అలసత్వముకలిగి) కమలముయొక్క మధ్యయందున్న, భ్రమరముచే, చేయఁబడిన, లయ గల (సంగీతశాస్త్ర ప్రసిద్ధము)నలిని; మధుమాసమున(వసంతర్తువున) సరస, మన్థ, రత, అమరజోదర, భ్రిమ, రసత్, జలయా (తృతీయా విభక్తి) కట్టుదలతో, చిలుకుటయం దాసక్తమైన, దేవ దానవులయొక్క, భ్రమణముచే (త్రిప్పుటచే) ధ్వని చేయుచున్న, నీరు గల, జలధిదేవతతో సమానమైన, స్ఫుటతరముగ, వచ్చిన,(ఆగత)రాగముయొక్క (ఎఱుపు; ((2) పద్మరాగమణి) కాన్తిని ధరించెను.

ఇచట "సరస-జలయా" యను పద మావృత్తమైనది. ఒకయర్థమున ప్రథమావిభక్తి. వేఱొకయర్థమున తృతీయావిభక్తి. "సదృశీం" అను పదము శ్లేషకు నిబంధనము. ఇది అనవ్యయము.

శబ్దశ్లేషకుఁ జెప్పిన లక్షణములో "అన్యూనానతిరిక్తేన" అను దళము యొక్క సార్థకతను విచారింతము.

ప్రధాన విశేషణము, ఉపమానోపమేయములకు రెంటికి సమానముగ నన్వయింపవలయు నను నభిప్రాయముతో నీ విశేషణ దళ ముపయుక్తము. అందుచే నెచట నన్యూనా నతిరిక్తత యుండదో, అచట శ్లేష దుష్టమైనదియే యని నిశ్చయింపవలెను.

న్యూనత్వమున కుదాహృతి :—

"ఇహ చటులతయా విలోచనాఘైః
స్ఫుటశితి, తారకవిభ్రమై స్తరుణ్యః
దధతి మధుకరైశ్చ, కోరకాన్త
స్థితి రమణీయతరైః శ్రియం నలిన్యః॥

అర్థము:— యువతులు, స్వచ్ఛమును, నల్లనివియు నైన కనుగ్రుడ్లయొక్క విలాసములుగల నేత్ర సమూహములచేతను, చంచలత్వముచేతను శోభ నొందినారు. నలినములు, కోరకముల యొక్క యన్తముల యందలి (చివరను) స్థితిచే రమణీయతరములైన, మధుకరములతో, శోభను వహించినవి.

ఇచట తరుణు లుపమేయము. నలినము లుపమానము. తరుణులకు నేత్రములవలనను, నలినములకు మధుకరముల వలనను శోభ కలిగినది. నేత్రములకు స్ఫుటశితి తారక విభ్రమములున్నవి. దీనితో సమానమగు లక్షణము, మధుకరముల కేమియు నిట ప్రతిపాదితము కాలేదు. మధుకరపక్షమున న్యూనత్వ మున్నదని భావము.

అతిరిక్తత్వమున కుదాహృతి :—

దిశి దిశి విహగా, స్తనూ, స్సమన్తా
దనల సపక్ష తయోపచీయ మానాః
ఉషసి, జిగమిషా కులా, స్తదానీం
దయిత వియోగదశా, వధూశ్చ, దేహుః॥

ఉషసి, తదానీం=ఆయుషఃకాలమున, దిశిదిశి=ప్రతి దిక్కునందును జిగమిషాకులాః=ఆహారముకొఱకై వెళ్ళుటయందాసక్తములైన, విహగాః=పక్షులు; అనలస, పక్షతయా=సమర్థములైన, రెక్కలు కలిగియుంటచే, ఉపచీయమానాః=ఒకచోఁ గూడినవై, తనూః=శరీరములను, దేహుః=పీడించినవి (కష్టపెట్టినవి; కలిసి ఎగిరిపోయిన వని భావము).

ఉషఃకాలమున (ప్రియాభిసరణానన్తరము) నిజగృహములకు వెళ్ళుటయాకులతనొందుచున్న ప్రియవియోగదశలు, అనలముతో (అగ్నితో) సమానముగ నభివృద్ధినందుచున్నవై, వధువులను (అభిసారికాస్త్రీలను దహించినవి.

ఇచట విహగములకు, దయిత వియోగదశలకును సాదృశ్యము వివక్షితము. దయితవియోగములు దహించినవనినను చాలును. దశాపద మధికముగ నుపయుక్తమైనది. "విహగసంఘాః" అని యున్నచో "వియోగదశాః" అని యున్నను, అతిరిక్తత్వము భాసించెడిది కాదు. అట్లు లేకుండుటచే, సిట, నతిరిక్తత సంభవించినది. ఇచట చకారమను నవ్యయ మావృత్తి హేతువు.

మఱియొక విషయము నిట గుర్తింపవలయును. శబ్దశ్లేషయందు కర్తృకర్మాది ప్రధాన పదార్థోపనిబంధముచే శబ్ద సాదృశ్యమును కల్పింపఁ గూడదు. అపుడు ప్రధాన స్వరూపాపహారమే కలుగును.

కర్తృస్వరూపాపహారమున కుదాహృతి :—

"ఇహ విబుధ గజస్య కర్ణతాలః
స్ఖలనసమీరవిధూతకుంభ ధాతోః

వహతి మదనదీప రాగరక్తా
రతిగృహ భిత్తిరివ శ్రియం పరార్థ్యామ్॥

అర్థము:—ఇహ=ఇచట, విబుధగజస్య=ఐరావతముయొక్క, కర్ణతాల...ధాతోః=చెవులనెడు విసనకఱ్ఱలతో వీచుటవలన కలిగిన వాయువుచే నెగురఁగొట్టబడిన కుంభస్థలముల యందలి గైరికాదిఁ ధాతువుయొక్క, పరాగరాగరక్తా=పరాగము రాగముచే రక్తమైన, మదనదీ=మదప్రవాహమె, మదన, దీప, రాగ, రక్తా=మన్మథుడనెడు దీపముయొక్క రాగముచే రక్తమైన, రతిగృహభిత్తిరివ=రతి యనెడు గృహముయొక్క గోడవలె, పరార్థ్యాం శ్రియం వహతి= ఎక్కువ శోభను వహించుచున్నది.

ఇచట "మదనది" కర్త. "మదనదీపరాగరక్తా" యను పదమునందలి శ్లేషమున, మదనదియొక్క కర్తృరూపము స్ఫుటముగ భాసించుట లేదు. అందుచే "మదనదీ" పదమునకు కర్తృస్వరూపాపహారము కల్గినది.

ఉదా॥ "సంగ్రామ నాటక కుతూహలినామ్ తదానీమ్
ఉత్థాపనేన దధతో ముద ముత్తమానామ్,
విస్పష్టభాండరుచయో ఽ తివిచిత్ర రూపామ్
లక్ష్మీం దధు ర్జవనికామహితా స్తురంగాః"

అర్థము:—(1) విస్పష్టభాండరుచయః=ఉజ్జ్వలమైన పాత్రల యందుశోభను గలుగఁజేయునట్టియు; జవనికా మహితాః=తెరలచే ప్రశంస నొందినట్టియు, రంగాః=రంగస్థలములు;
(2) విస్పష్టభాండరుచయః=ఉజ్జ్వలమైన యలంకారముల వలన శోభించు నట్టియు (భాండ=అలంకారము); జవ, నికామ, హితాః= వేగముచే నత్యంతము మేలునుగూర్చునట్టియు, తురంగాః=గుఱ్ఱములు సంగ్రామ నాటక కుతూహలినామ్=యుద్ధ మనెడు నాటకమునందు కుతూహలముగల, ఉత్తమానామ్=ఉత్తములైనవారియొక్క ఉత్థా

ఉద్ధాటనేన=ఉద్ఘాటనముచే. (1. పాత్రస్వరూపమును బాగుగా పరికాశింపఁ జేయుటచేత 2. పీరులను మోయుటచేత) ముదమ్, దధతః=సంతోషముమును కలిగినవై విచిత్రరూపమైన లక్ష్మిని (శోభను) వహించినవి.

ఇచట రంగాః అను పదమునకుఁగల కర్తృస్వరూపము స్ఫుటముగ భాసింపదు.

వేఱొక యుదాహృతి :–

అవన్ధ్యకోపస్య విహన్తు రాపదామ్
భవన్తి వశ్యా స్స్వయమేవ సంపదః,
అమర్ష శూన్యేన జనస్య జన్తునా
న జాతహార్దేన న విద్విషాదరః

అర్థము:—అవన్ధ్య కోపుఁడును; ఆపదలను పోఁగొట్టు వాఁడును నగువానికి, సంపదలు స్వయముగనే వశము లగును. అమర్ష శూన్యుఁడైన జన్తువు (మనుష్యుఁడు) నకు సౌహార్దము కలిగినంత మాత్రమున జనుఁ డెవఁడును గౌరవింపఁడు. అతనికి ద్వేషము గలిగినను ఎవఁడును భయపడఁడు.

"జాతహార్దేన, న, ఆదరః, విద్విషా, న, దరః"- అని పదములను విడఁదీయవలయును.

ఇచట "దరః" అను పదముయొక్క యర్థమునకు, కర్తృత్వస్వరూపమపహృతమైనది. ఇచట "నవిద్విషా భీః; సుహృదాచ నాదరః" అను పాఠముండుట లెస్స.

కర్మత్వ స్వరూపాపహారమున కుదాహృతి:—

"కుంతాలీభిః, యుధమివ, గహనానామే, తామూపాద్యోచ్చైః,
శిత శరశత సంకీర్ణాః
అస్మిన్, నానాఫల కబల నసంసక్తా
వల్గన్త్యేతే, దిశి దిశి, హరిసైన్యౌఘాః"

అర్థము:— కుంత + అలీభి:=కున్తములు (ప్రాసములు) అను ఆయుధములచే, గహనామ్=వ్యాప్తమైన, యుధమిప=యుద్ధభూమిని వలె, తాలీభి:=తాల వృక్షములచే గహనమైన, కుమ్=భూమిని, ఆసాద్య=పొంది, నానా, ఫల, కబలన, సంసక్తా:=అనేక ఫలములను తినుటయం దాసక్తమైనట్టియు,

(నానా, ఫలక, వలన, సంసక్తా:=అనేక బాణాగ్రిభాగములను సంచరింపఁ జేయుటకు సిద్ధముగ నున్నట్టియు) శిత, శర, శత సంకీర్ణా:=తీక్ష్ణమైన బాణ శతములచే (తృణ విశేషములచే) వ్యాప్తము లైనట్టియు హరిసైన్యౌఘా:=హరిసైన్యసమూహములు (వానర సైన్యసమూహములు) ప్రతి దిక్కునందును, వల్గన్తి=ధ్వనించుచున్నవి.

ఇచట "కుమ్" అను పదమునకు గలఁ కర్మత్వము స్ఫుటముగ భాసింపదు.

క్రియాస్వహాపావహారమున కుదాహృతి:—

"కుసుమై: కృతవాసన: సమన్తా
దపనిదశ్రీత్వముపేయివద్భి రస్మిన్
ప్రతిమంత్రిగణాభిరామ రూపై:
నవషౌపట్పదశోభిభి: సమీర:"

అర్థము:— కుసుమై:, కృతవాసన:=పుష్పముల వాసనగలట్టియు, సమన్తాత్=అంతటను, అపనిద్రశ్రీత్వమ్, ఉపేయివద్భి:=మేల్కొనినట్టి, నవ, షట్పద,(షౌపట్పద)శోభిభి:=క్రొత్త షౌపట్ పదములనెడు షట్పదములచే శోభించు, శ్రుతి (శ్రుతి) మంత్రిగణాభిరామరూపై:=వేదములనెడు, కర్ణములకు, మంత్రిసమూహముల వలె నభిరామమైన రూపములచే, పవౌ=వీచెను.

(సశేషము)

ఆంధ్రసాహిత్యపరిషత్తు

శాశ్వతాధ్యక్షులు

విమర్శకాగ్రేసర ఐతిహాసిక [illegible]

శ్రీ బండారు తమ్మయ్య

ప్రధాన కార్యదర్శి, కోశాధికారి

శ్రీ దంటు భాస్కరరావు

సహాయ కార్యదర్శి

శ్రీ దువ్వూరి సూర్యనారాయణశాస్త్రి

కార్యనిర్వాహకవర్గ సభ్యులు

1. శ్రీ జోగా శివనాథశాస్త్రి
2. శ్రీ వారణాసి సుబ్రహ్మణ్యశాస్త్రి (బాలవ్యాస)
3. శ్రీ చిలుకూరి పాపయ్యశాస్త్రి (వ్యాకరణవిద్యా, భాషాప్రవీణ)
4. శ్రీ కాకరపర్తి కృష్ణశాస్త్రి (కవిమూర్ధన్య, ప్రౌఢకవిచంద్ర)
5. శ్రీ కుందూరి ఈశ్వరదత్తు
6. శ్రీ జయంతి బుచ్చిరామశర్మ
7. డాక్టరు శ్రీ ఇవటూరి జోగారావు, (యం. బి. బి. యస్.,)
8. శ్రీ చిరుకోలు కోటేశ్వరరావు
9. శ్రీ దామెర రాజగోపాలరావు, బి. ఏ.
10 శ్రీ వేదుల రామచంద్రకీర్తి, బి. ఏ. (ఆనర్సు)
11. శ్రీ ఓలేటి సుబ్బరాయశాస్త్రి (ఉభయభాషాప్రవీణ)
12. శ్రీ కావలి శ్రీరామమూర్తి, బి. ఎ., బి. ఎల్.

పత్రికా సంపాదకుడు

శ్రీ చిలుకూరి పాపయ్యశాస్త్రి

ఆంధ్ర సాహిత్య పరిషత్ప్రచురణములు

శ్రీ సూర్యరాయాంధ్ర నిఘంటువు

1వ సంపుటము	....	రు 6—0—0
2వ సంపుటము	....	6—0—0
3వ సంపుటము	....	6—0—0
4వ సంపుటము	....	6—0—0
5వ సంపుటము	....	10—0—0
6వ సంపుటము	....	10—0—0
7వ సంపుటము	....	[ముద్రణములో నున్నది]

కవిజనాశ్రయము

వేములవాడ భీమకవి విరచితము.

పెక్కు పాఠభేదములతోఁ గూడిన వెనుకటివిషయ మంతయుఁ గలిసి తిరిగి తృతీయముద్రణ పీఠికతో ముద్రితమైనది వెల రు 1—50.

మాధ్యమిక కారికలు

బౌద్ధాచార్య నాగార్జున ప్రణీతము. కొల్లూరు సోమశేఖర శాస్త్రి విరచిత సుబోధినీవ్యాఖ్యాసహితము మూల్యము రు. 2—.50

ఆంధ్రసాహిత్యపరిషత్తు,

కాకినాడ.

Printed by J. Gopalam, B.A., L.T., at Republic Press, Kakinada

Edited by **C. PAPAIAHSASTRY**

Published by Andhra Sahitya Parishat, Kakinada.